ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

సంపుటము 42 సంచిక 1


ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

ఆగస్టు 31 1949


ఆంధ్రపత్రిక సికింద్రాబాదు బ్రాంచి ఆఫీసులో స్వాతంత్ర్య దినోత్సవమును జరిపిన సందర్భములో తీసిన చిత్రములు



సప్లయిస్ శాఖా కార్యదర్శి శ్రీ కె. విద్యాసాగర్ పతాకోత్సవమును జరిపిరి. శ్రీ. విద్యాసాగర్, శ్రీమతి విద్యాసాగర్.



శ్రీ. సి. యస్ నాయుడు (డెయిలీన్యూస్ సంపాదకుడు), శ్రీ జె. హెచ్. సుబ్బయ్య, శ్రీ మాదిపాటి రామచంద్రరావు, శ్రీ బినోద్, యు. రావు, శ్రీమతి సరస్వతి, శ్రీ యస్. యన్. శాస్త్రి, ఐ. విద్యాసాగర్, శ్రీ గౌరీ నాథ్, శ్రీమతి విద్యాసాగర్, శ్రీ యస్. సుబ్రహ్మణ్యం, శ్రీ ఆచారి, కృష్ణమూర్తి, శ్రీ నరసింహ గౌడ్, డా॥ జై సూర్య, శ్రీ వామనరావు.




శ్రీ యస్. సుబ్రహ్మణ్యం (ఆంధ్రపత్రిక), శ్రీ గౌరీనాథ్ (యు. పి. ఐ) శ్రీ సి. యస్. నాయుడు (డెయిలీన్యూస్) శ్రీ నరసింహగౌడ్ (డెయిలీ న్యూస్) శ్రీ ఆచారి (డెయిలీన్యూస్) శ్రీ బినోద్‌రావు (సమాచార శాఖా డైరెక్టర్) శ్రీ యస్. యన్. శాస్త్రి, (ఫ్రీప్రెస్ జర్నల్) శ్రీ రాజేశ్వర రావు (భారత్) డా॥ జైసూర్య, శ్రీ వామనరావు (హిందు) శ్రీ కృష్ణ (ఆంధ్రపత్రిక) శ్రీ కృష్ణమూర్తి (బులెటిన్).


★ వార్తా చిత్రాలు ★



ప్రపంచములో వివిధదేశాలలోని పట్టణాలను సందర్శించు అమెరికన్ టౌన్‌పార్టీ సభ్యులకు భారత గవర్నర్ జనరల్ శ్రీమాన్ రాజగోపాలాచారిగారు విందొసగిన సమయంలో తీసిన ఛాయాచిత్రం. ఇందు మేయర్ జార్జి విల్స్, భారత దేశంలో అమెరికన్ రాయబారి హెండర్సన్ జార్జి డెన్న సతి, డెన్న, రోగర్ క్యాం మున్నగు ప్రముఖులున్నారు.



గాంధీ స్మారకవనం నమోనాను భారతప్రభుత్వ ప్రధాన ఇంజినీర్ జి. బి. దియోలలీకర్ తయారుచేశారు. రాజకోట లోని మహాత్ముని సమాధి చుట్టూ నూరు ఎకరాల విస్తీర్ణంలో, ఈ తోటను వేస్తున్నారు. ప్రభుత్వం దీనిక్రింద 5 లక్షలు ఖర్చుచేయడానికి నిర్ణయించింది.



డ్రఫిన్ నౌకమీద ఏటా 80 మంది ఆఫీసర్లకు శిక్షణ యిస్తారు. పూర్వం ఇండియాలో 25 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చేవారు. ఈ పటంలో డఫ్రిన్ నౌకలో (పూర్తిగా సంస్కరింపబడింది) బ్యాండ్ ప్రదర్శనం జరుగుతూవుండగా కేప్టెన్ వందనస్వీకారం చేస్తున్నారు.

ఆంధ్రపత్రిక


ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగుదా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర భాద్రపద శుద్ధ అష్టమిః బుధవారము



బ్రిటిష్ విమానాల మరమ్మతుశాల

'నడాలోని డార్వల్ వద్దనుంటూన్న, ఈ విమాన మరమ్మతు కేంద్రాన్ని బ్రిస్టల్ సమీపంలో ఫిల్టన వద్దకు మార్చారు. 400 మంది ఇంజినీయర్లను కుటుంబాలతో ాహావిమానాలలో తర్లించుకొని వచ్చారు. విమానంలోని ఏ ఒక్క యంత్రాన్నైనా, మార్చటం వద్దనుంచి, విమానాన్నంతనీ పూర్తిగా "ఓవర్ హాల్" చేసి, ఎగరటానికి ి ఉందని సర్టిఫై చేసేదాకా విమానాల మరమ్మతు పనులన్నీ ఇక్కడ జరుగుతాయి. కనడానుంచి బ్రిటన్‌కు మార్చటంలో ఏటా 5 లక్షల పౌన్ల వ్యయందాకా బ్రిటిష్‌వారికి కలిసివచ్చింది.

ఆంధ్రపత్రిక

1949-వ సం॥ నెల ఆగస్టు 31-వ తేది బుధవారము

రాయబార ఫలితములు

గత గురువారమునాడు సమావేశం ముగిసేముందు కాంగ్రెసుకార్యవర్గము ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమునుగురించి చర్చించెనట. ఆంధ్రరాష్ట్ర శీఘ్రనిర్మాణావసరమునుగురించి సభ్యులందరికీ ఏకాభిప్రాయము కుదిరినదికాని, మద్రాసులో సగభాగమును చీల్చి, ఆంధ్రరాష్ట్రములో చేర్చవలెనను విషయముపైన ఎట్టి నిర్ణయమునకు రాలేకపోయిరట. ఇది ఢిల్లీలో అభిజ్ఞవర్గాలద్వారా తెలిసిన సమాచారము.

ఆంధ్ర ప్రజాపరిషత్తు రాయబార సంఘము తమను చూచినఫలితముగా కాంగ్రెసుకార్యవర్గము ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గురించి చర్చించినట్లు ద్యోతక మగుచున్నది. నాయకత్రయ నివేదికను కార్యవర్గము ఇదివరలో అంగీకరించినది. ఆ నివేదిక ప్రకారము, ఆంధ్రులు మద్రాసుపైని హక్కులను వదలుకొనవలసియుండెను. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘము మద్రాసు సమస్యను సరిహద్దుసంఘమునకు వదలమనినది. ప్రజాపరిషత్తు మద్రాసును చీల్చి ఉత్తరభాగమును ఆంధ్ర రాష్ట్రములో చేర్చమని కోరినది. రాష్ట్ర కాంగ్రెస్ పరిషత్తుతీర్మానమునకు సుముఖముగ నున్నదనవచ్చును. ఈ విధముగ కాంగ్రెసు కార్యవర్గము క్రొత్త పథకమును ఎదుర్కొనవలసివచ్చినది.

దీని విషయమున కాంగ్రెసు కార్యవర్గము ఒక నిర్ణయమునకు రాకపోవుటలో ఆశ్చర్యము లేదు. నిర్ణయమునకు రాలేదనుటకు బదులు ఏకాభిప్రాయము కుదర లేదనుటే సరియయిన వ్యాఖ్యానమనవలసి యున్నది. కాని ఆ విషయమున వ్యతిరేకముగ నిర్ణయము చేయకపోవుట మాత్రము కొంత సంతృప్తికి కారణము కావచ్చును. కాని అంత మాత్రముచేత ముందు అనుకూలముగ నిర్ణయించెద రని సంతసించుటకు అవకాశము లేదు. తిరిగి కార్యవర్గము, ఎపుడు సమావేశ మగునో తెలియదు. నూతనరాజ్యాంగనిర్మాణము పూర్తియగులోపునే కార్యవర్గము ఈ నిర్ణయమును చేయవలసి యున్నది. కార్యవర్గము నిర్ణయించిన మీదటగాని కేంద్రప్రభుత్వము దానికి సంబంధించిన కార్యక్రమమున కుపక్రమించదు. నూతన రాజ్యాంగనిర్మాణము పూర్తియగులోపున నిర్ణయించినగాని కనీసము నూతనరాజ్యాంగము ఆచరణతోపాటు ఆంధ్రరాష్ట్రము అమలులోకి రాజాలదు. నూతన రాజ్యాంగము క్రింద రాష్ట్రమును నిర్మించవలసివచ్చిన ఎంత కాలయాపన జరుగునో వేరుగ చెప్పనవసరము లేదు. నాయకత్రయనివేదికను ఆమోదించినవారు సత్వర ఆంధ్రరాష్ట్రము నిర్మాణమగునను భావముతో తప్ప వేరు గాదు. ఆంధ్రప్రాంతములోని అభివృద్ధిపథకములు వెనుకపడుచున్నవని, మద్రాసు ఆంధ్రరాష్ట్రములో చేరకపోయినను రాష్ట్రము అనునది వచ్చిన ఈ పథకములను ఆచరణలో పెట్టుట సత్వరము సాగగలదని ఆశించిరి.

ఆంధ్రప్రజాపరిషత్తు తీర్మానము నాయకత్రయ నివేదికను తిరస్కరించి, ఆంధ్ర రాష్ట్రంలో మద్రాసులోని సగభాగమును చేర్చవలెనని ఉద్ఘాటించినది. దీనిని గమనించి కార్యవర్గము ఏమి చేయనున్నదో ఎదురు చూడవలసియున్నది. ఆంధ్రరాష్ట్రమును శీఘ్రముగ నిర్మాణమొనరించవలెనను విషయమున అభిప్రాయభేదము లేనపుడు, మదరాసు విషయమున నిర్ణయమునకు రాలేకపోవుట, ఆ సమస్య కొంత నిరోధకముగ పరిణమించ వచ్చునని అభిప్రాయపడవచ్చును. ఒకపర్యాయము మద్రాసును గురించి నిర్ణయ మిచ్చిన కార్యవర్గమునకు ఇపుడు దానిని పునర్విమర్శించుకొనుటలో తీవ్రకాలయాపన జరుగవచ్చును. ఇంతకన్న బొంబాయి విషయమున నిర్ణయించినట్లు మద్రాసు ప్రత్యేక రాష్ట్రముగ నిర్మింప నిర్ణయించుట సులభము. ఆంధ్ర ప్రజాపరిషత్తు తీర్మానము రాయబారము ఫలితముగా నాయకత్రయ నివేదికలో మద్రాసును గురించి ఆంధ్రులకు విధించిన షరతును ఉపసంహరింప వచ్చునని ఆశించవచ్చును. కాని దానితోపాటు మద్రాసు వ్యవహారము, రాష్ట్ర నిర్మాణము రెండునూ వాయిదా పడవచ్చును. రాష్ట్రమునుగురించి తొందరలేని పక్షములో మద్రాసునుగురించిన తొందరయునూ లేదు. కార్యవర్గము తమ నిర్ణయమును శీఘ్రముగ ఇచ్చిననూ ఇవ్వకపోయిననూ ఆంధ్రపరిషత్తు తీర్మానము నామోదించిన రాష్ట్ర కాంగ్రెసు మద్రాసులో తమ కార్యస్థానమును తక్షణము ఏర్పరచుట వాంఛనీయము, అవసరము కూడ. దానివల్ల మద్రాసుపై ఆంధ్ర కాంగ్రెసుకు గల అధికారమునకు ప్రతిచిహ్నముగా నుండగలదు.

సోవియట్ - భారత సంబంధములు

మాస్కోలో భారతరాయబారిగ ఒక సంవత్సరము ఉన్నప్పటికిని, తాను జనరలిస్సిమో స్టాలిన్‌ను ఒక్కపర్యాయ మైనను కలుసుకొనజాలకపోతి నని శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఉద్యోగవిరమణానంతరము చేసిన ప్రకటన రష్యాలో ఒక దేశపు రాయబారిగ పనిచేయుట ఎంత బాధాకరమైన బాధ్యతో వెల్లడించినది. ద్వితీయ ప్రపంచసంగ్రామమునకు పూర్వము బ్రిటిష్ రాజ్యాంగతంత్రజ్ఞతకు అంతర్జాతీయవ్యవహారములందు అగ్రస్థానముండెను. కాని "హిట్లర్ జర్మనీ" బ్రిటన్‌ను సైతము త్రోసిరాజనకలిగెను. 1939-వ సంవత్సరము సెప్టెంబరు 3-వ తేదీన యుద్ధము ప్రారంభమగుటకు పూర్వము జర్మనీ కేవలము రాజ్యాంగతంత్రమువలననే అనేక విజయములను సాధింపకలిగెను. మ్యూనిచ్ ఒడంబడికతో బ్రిటిష్ రాజ్యాంగతంత్రజ్ఞత విఫలమైనట్లు ధ్రువపడినది. జర్మనీ అంతర్జాతీయ రాజకీయవ్యూహమున అగ్రస్థానమును సంపాదించెను. అట్టి జర్మనితో ఒక్క రష్యామాత్రమే, అదే పద్ధతులను అవలంబించి వ్యవహారము చేయకలిగెను. సోవియట్ అధికారులు, జర్మనీపాలకులతో, పశ్చిమయూరపురాజ్యములతో వ్యవహరించిన పద్ధతిని గమనించిన రష్యారాజ్యాంగతంత్రము యావత్తు అతిరహస్యముగ బహిరంగముగ ఇతర ప్రపంచమునకు పూర్తిగ భిన్నముగ సాగినట్లు స్పష్ట మగును. అమెరికా,రష్యాలందు ప్రథమ భారత రాయబారులుగ నియామకమైన అసఫ్ ఆలీ, శ్రీమతి విజయలక్ష్మిపండిట్‌లు ఆ దేశములందు ఒక్క సంవత్సరంకంటె ఎక్కువకాలము పని చేయలేకపోయిరి. వారి "ఉద్యోగము"లు ఎట్టి ఫలితములను సాధింపలేక పోయెను. ఆ కారణముగ వారి మార్పు అవసరమయ్యెను. రష్యాలో భారతరాయబారిగ పనిచేసిన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఇపుడు అమెరికాలో భారత రాయబారిగ వ్యవహరించుచుండెను. అమెరికా, రష్యాలందు రాయబారులుగ వ్యవహరించుటకు అసాధారణ ప్రతిభావిశేషములే గాక, అపార పాండిత్యమే గాక, విశేషముగ రాజ్యాంగచతురత అవసరము.

భారత రాజ్యాంగ తంత్రము ఫలింపవలెనన్న ప్రధాన దేశములందు అనుభవము గల రాయబారులుండుటతోబాటు భారతవిదేశాంగ విధానము నిర్దిష్టముగ నుండవలెను. నిష్కాపట్యము, రహస్యము లేకుండ ప్రతి వ్యవహారమునందును బహిరంగముగ వ్యవహరించుట కొన్ని సందర్భములందు ప్రమాదకరముగ నుండగలదు. ఈ సత్యమును భారతవిదేశాంగ మంత్రి గ్రహింపకపోలేదు. రాజ్యాంగతంత్రమున గోప్యము అవసరమని పండిట్ నెహ్రూ ఇదివరలో వెల్లడించియుండెను. రష్యావిషయమున ఈ విధానము ఫలింపవచ్చును.

ఇపుడు మాస్కోలో భారతరాయబారిపదవిని నిర్వహింపనున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణపండితుడు ప్రపంచఖ్యాతిగల వేదాంతి, తాత్వికుడు. రాజ్యాంగతంత్రమునందనుభవము ఎక్కువగ లేకున్నను, రాజకీయములందు విశేషప్రవేశము గలదు. ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక ఉపసంఘ కార్యకలాపమునందు వారు ఎక్కువ కృషి చేసి వివిధ దేశముల స్థితిగతులను అవగతము చేసుకొనిరి. ఈ ఉపసంఘమునందు రష్యా ప్రమేయము కల్గించుకొనక పోయినను, రాధాకృష్ణపండితునకు రష్యాఆర్థిక, సాంఘిక వ్యవహారముల పరిజ్ఞానము గలదు. వారు రష్యాలో తమ కర్తవ్యమును వెల్లడించుచు క్రిందటిమాసము బరోడాలోచేసిన ప్రసంగ మీవిషయమును స్పష్టపరచినది. వారా సందర్భమున, తిరిగి, మొన్న వారి నభినందించుట కేర్పాటైన సభయందు వారు వెల్లడించిన యభిప్రాయములతో ఏకీభవింపనివా రుండరు. యథార్థమునకు ప్రపంచరాజ్యము లన్నింటిలక్ష్యము ఒక్కటే. వాటి సాధనకు అనుసరింపబడుచున్న మార్గములే భిన్నమైనవి. వాటిని సమన్వయపరచుటే శాంతికాముకుల కర్తవ్యము. రష్యాలో రాధాకృష్ణపండితుడు సాధింపవలసినది ఇదే. భారతప్రభుత్వమునుగురించి ప్రబలిన అపోహలను తొలగించి, ఉభయదేశములకు స్నేహసంబంధముల నెలకొల్పుటకు వారికి మాస్కోలో గల యవకాశములు పరిమితములైయున్నందున వారి బాధ్యత మరింత గురుతరమైనది.

ఈ అభినందనసభయందు పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రకటించినట్లు రష్యా అగ్రరాజ్య మగుటవలన నేగాక, రష్యా ఇరుగు పొరుగుదేశ మగుటవలన ఆ దేశముతో భారత దేశమునకు స్నేహసంబంధము లుండుట అత్యవసరము. మాస్కోకు పాకిస్తాన్ ప్రధానమంత్రిని స్టాలిన్ ఆహ్వానించియున్నందున రష్యా, భారత పాకిస్తాన్‌ల మధ్య శల్యసారథ్యము చేయనున్న దేమోనను అనుమానము ప్రబలుచున్నది. పాకిస్తాన్, రష్యా భారతసంబంధములు సాఫీగ నుండకుండ చేయవలెనని ప్రయత్నింపవచ్చును. పాకిస్తాన్ ప్రధానికి పూర్వమె రాధాకృష్ణపండితుడు రష్యా వెళ్ళనున్నందున లియాఖత్ అలీఖాను రాకవలన రష్యాలో భారత దేశము యెడ అపోహ కలుగకుండ

నవల

సాత్తిఖాలి

వి.ఎడి. ప్రసాదరావు

౧౧

వారం రోజులు గడిచిపోయాయి. ఇంట్లో పెండ్లిమాటలు నలుగుతున్నాయి. తను "కాని" వాడున్లాగే ముభావంగా ఊరొకున్నాడు. "ఔ" ననీ "కాద" నీ చెప్పేందుకు తనమనస్సే తనకు తెలియటం లేదు. అదీ కాక కొద్ది రోజుల్లో మళ్లీ చదువుకు కాశీ వెళ్ళిపోబోతున్నాడు. ఈలోపుగా సంబంధం నిశ్చయం అయినా పెళ్లిజరిగే అవకాశం లేదు. తన మనస్సులో ఏదీ నిశ్చితం లేనిదే ఇప్పుడే తొందరపడి కావని కర్తృత్వం తన చేతుల్లో తీసికోడానికి ఇష్టం లేదు. మనస్సుమాత్రం క్షోభపడుతూ ఉంది. తన పెండ్లివిషయంలో తండ్రి తనతో సంప్రదించకపోవటం ఆత్మగౌరవాన్ని ముందు కొంత గాయపరిచినట్లయినా, తన ఈ స్థితిలో తనకు ఆ ప్రమేయముకూడా అంటకట్టకపోవటం కొంత శమనగానే ఉంది.

ఇంట్లో ఉండటానికి ఎక్కువగా మనస్కరించటం లేదు. పనిగాని .పనిగా పాతమిత్రులను తిరగేసుకుంటూ ఊరంతా తిరగటం ప్రారంభించాడు. మిత్రులతోటీ సమంగా మునుపటిలాగా కాలక్షేపం కావటం లేదు. ఆటలకని సాయంత్రం ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు పోయాడు. ఈ ఊరు వదిలాక ఆటల ధ్యాసే తప్పిపోయింది. ఆటలలో ప్రవేశం ఎక్కువ ఉండేది కాదు. మునుపు చదువు తీరితే ఆటలు. ఈ రెండే జీవితమంతా నింపేసి ఉండేవి. మనస్సుకు క్షోభ అనేదే ఉండేది కాదు. ఈ సమస్యలే ఉండేవి కావు. తీరుబడివేళల షికార్లు బయలుదేరే అలవాటు కాశీలో పరిచయాలతోనే ప్రారంభమయింది. లోకాభిరామాయణంతో స్త్రీల ప్రతిభంగకథలు రొట్టలు వేసుకొంటూ చెప్పుకుంటూ, గాలి తిరుగుళ్లు తిరుగుతూ, 'నవీనత' పేరున షికార్లూ, సినీమాలూ వృద్ధిచేసికోటంతో, మనస్సు మునుపటి ఆరోగ్యపు పంథాలు వీడి, సంశయాలను సమస్యలను కల్పించి, జీవితాన్ని క్షోభలోకి దింపింది.

ఇప్పుడు మునుపటి ఉత్సాహంతో, నిర్మాలిన్యంతో ఆ ఆటలలో పాల్గొనగల శక్తి కనబడలేదు.

ఒంటరిగా ఊరిబయటకు పోయి ఆలోచనలతో కాలం గడపసాగాడు.

ప్రభావతిని చూడాలి. చూసిగాని తన పురోగతిని నిర్ణయించుకొనేందుకు వీలు లేదు. ఆమె మారుస్తుందని కాదు. మార్చుకోవలసింది తనే. కాని మార్చుకొనేముందు, ఏదో అజ్ఞాతసమస్యలకు, అనూహ్యపరిష్కారాలను, ఆ పరిచయంలోనే లభింపచేసుకోగలనని, ఎరుగని ఆర్తి. అంతకన్నా ఆమెను మళ్లీ ఒకసారి చూడాలన్న అపేక్ష బలీయంగా వుంది. చూడకుండా ఆగిపోవటంలోనే శాంతి వుంది.. కాని ఆమెను చూడాలన్న వాంఛ, తర్కబలాన్ని ఎదురుకొంటూనే, బలీయంగా అలముకొంటోంది.

ఆమె ఉత్తరంవల్ల ఏమీ తెలిసింది లేదు. ఎన్నిమార్లో చదివాడు ఆ నాలుగుముక్కలే. ఏ సంగతీ నిశ్చితం అవటం లేదు. ఏ భావంలో వ్రాసిందో అని మళ్లీమళ్లీ తర్కించుకొని ప్రశ్నించుకోసాగాడు. ఏమీ అవగాహన కాలేదు. మును పెప్పుడూ ఆమె వ్రాసినలేఖ చూడలేదు. ప్రేమలేఖల అవసరం లేకుండానే ప్రణయఘట్టం సాగిపోయింది. ఇదే ప్రేమలేఖ కాబోలు. ఉత్తరంలో అల్లాంటి పోలిక ఏమీ లేదు. తనను చూడాలన్న అపేక్షను, "నామీద పూర్వ అభిమానముంటే" అన్న వాక్యపు తూష్ణీం భావంలో మరుగుపరచుకొంది. అది నిరసనం కాదేమో! నిస్పృహలో, అసహాయస్థితిలో, ఎవరి స్నేహబాంధవ్యాలూ అపేక్షించేందుకు, ధైర్యములేని నైరాశ్యమేమో!—

ఆమె యేస్థితిలో ఒంటరిగా ఇంటికి వచ్చేసిందో, కారణమేమో, తెలియటం లేదు. మామూలుగా పుట్టింటికి రావటమేనేమో! అయితే ఒంటరిగా రావలసినపని లేదు. ఏమో!— కారణా లుండకూడదా — ఉండకపోనూవచ్చు.

లోపలి మనస్సు, అంత తేలికైన నిత్య గృహకృత్యం కాదనే, అలజడి పెట్టూంది. ఏదో జరిగి ఉండాలి. అది ఏమైందీ తెలియటం లేదు. ఉత్తరంలో వివరంగా వ్రాయనందుకు చిరాకు వేసుకువచ్చింది.

తనా ఊరు వెళ్లటం - ఇంటికి వచ్చాక చేతిలో దమ్మిడీ డబ్బం లేదు. కొడుక్కి డబ్బు అవసరము ఉందని, డబ్బు ఈయవలసిన తండ్రి భావించటం లేదు. ఒకవేళ వెళ్లినా ఆ ఊళ్లో వాళ్ల యిల్లు ఏమని అడిగి తెలిసికోవటం?

మనస్సు అడ్డంకులు వేస్తూందిగాని, ఆ మనస్సే మళ్లీ, తనకు తోకొట్టూ సమాధానాలూ చెప్తూంది.

మళ్లీ తను చదువుకు కాశీ వెళ్లవలసిన రోజులు సమీపిస్తున్నాయి. ప్రభావతిని చూడదలచుకొంటే వెంటనే బయలుదేరాలి.

"అమ్మా! దగ్గిర ఊళ్లో ఒక స్నేహితుణ్ణి చూసి రావాలి. రమ్మని చాలా ఆహ్వానించాడు. మూడు రోజుల్లో తిరిగి వచ్చేస్తా."

అనుజ్ఞకై అడిగేవాడైతే తండ్రినే అడగవలసినవాడు. తల్లి దగ్గరే ఆ గూటిలోనుంచి ఈ గూటిలోనుంచి పోగుచేసిన డబ్బు తీసుకొని, ఇంట్లో చెప్పకుండా వెళ్లినట్టుగా కుండా, చెప్పి బయలుదేరాడు.

* * *

ఊరు సమీపించినకొద్దీ, ఇంటి ఆచోకీ తెలుసుకోటం ఎల్లాగో సమాధానంగా స్ఫురించటం లేదు. ఆయా సమయాల్లో ప్రభావతి తనయింటి విషయం చెప్పినమాటలు, అప్పుడు నిర్లక్ష్యంగా దృష్టి లేకుండా విన్నాడు. ఇప్పుడవి జ్ఞాపకం చేసికోటం కష్టంగా ఉంది.

ఒక రెండెడ్లజట్లిబండి, నెమ్మదిగా ఊరిముఖంగా నడుస్తోంది.

బండిమీది ఆసామీ చుట్ట కాల్చుకుంటూ సన్నగా ఏదో పాడుకొంటూ తన వైపు కాసేపు పరకాయిస్తూ చూస్తూ కూర్చున్నాడు. తనూ మాట్లాడకుండా తలవంచుకొని అల్లాగే నడుస్తున్నాడు.

"ఏ ఊరూ?" అతను చివరికి పలకరిస్తున్నాడు.

"ఏ ఊరెల్తుండా?"

అటు ఇంకా ఎవేవో ఊళ్ళున్నాయి కాబోలు. తనువెళ్ళే ఊరిపేరు చెప్పాడు. "మీది ఆ ఊరేనా?" అని అడిగాడు.

"ఎవరింటికి?"

దైవం దయ చూసినట్లు, ప్రభావతి తండ్రి పేరూ, అమ్మమ్మపేరూ చటుక్కున స్ఫురణకు వచ్చాయి.

"శాంతమ్మగారింటికి."

అడగక్కర్లేకుండానే అతనా యిల్లువివరం చెప్తున్నాడు. "చెరువు పక్క సందులో చివరింటిదాకా పోయి మలుపు తిరిగితేరా విసెట్టుపక్కన ఒంటరిగా ఉండే ఇల్లు.

"చుట్టాలా?"

"ఊఁ"

"మొన్న ఈమధ్య బ్రతక దనుకున్నారు. మొన్న ఈమధ్యే మనవరాలుకూడా కాశీనుంచి వచ్చింది. ఇప్పుడు కాస్త నెమ్మదేనేమో!"_ అయాచితంగా విషయవిపులీకరణ మొనర్చి అతను పాట పాడుకొంటూ బండితో లుకుపోతున్నాడు.

ప్రభావతి ముసలమ్మకు సుస్తీగా ఉండి వచ్చిందన్నమాట. తను అనుమానపడ్డ అవాంతరాలేమీ జరిగి రాలేదు! బయలుదేరి వచ్చినందుకు తనమీద తనకే కోపం వచ్చింది.

ఆ బండితో నడక తప్పించుకొని, యిల్లు గుర్తు చూసుకొంటూ ఊరిమధ్యనుంచికాకుండా ఊరి అంచునే చుట్టుకొంటూ బయలుదేరాడు. మొత్తం నూరుగడప లేని కుగ్రామం. కాని తను వెళ్తూన్న దోవలో తనరాక ఊరందరికీ తెలిసినట్లే అనిపిస్తూంది.

ఇంటిముందర ప్రభావతి కన్పడలేదు రావిచెట్టు అక్కడే ఉంది. ఆ యిల్లే.

నాల్గు నిముసాలు అటూ ఇటూ చూస్తూ, ఇంటిముందు మదురుగోడగుమ్మంలోకి వెళ్లాడు.

ఏవో ఇంటిపనులు చేసుకొంటూ ప్రభావతి కన్పడ్డది. తనవంక చూడటం లేదు. ఒంటరిగా లోపలిగుమ్మంలో ఆలోచిస్తూ నిల్చుని ఉంది.

కాశీలో రూపానికీ ఈ రూపానికీ పోలికే కనపడటం లేదు. బట్టలు మాసి దుమ్ము రేగుతూ ఉన్నవి. తల రెండురోజుల క్రింద దువ్వుకొన్నట్లుగా, జడ తలలో ఇముడకుండా చీకిరిపాకిరిగా రేగి ఉంది.

తనను చూడకుండానే ఒక నిట్టూర్పు విడుస్తూ తలవాల్చుకొనే తలుపుసందునుంచి చీపురు తీసి, ముంగిలి ఊడవటానికి ముందుకు వస్తోంది.

"ప్రభా!..."

తలఎత్తిచూసింది. మొగం తెలతెల వెలవెలబోతూ ఉంది. మొగమంతా ఒళ్లంతా పేలి, దుమ్ముకొట్టుకొని, ఆ కంగారులో ఎజ్జబడి కందగడ్డలాగ అయింది. ఆ క్షణంలో మునుపటి అందంలో శతాంశము కనబడటం లేదు. కాని ముఖలక్షణాలను ఆవరించుకొన్న నైరాశ్యం, మునుపటికన్న వెయ్యిరెట్లు మనస్సును కలిచివేస్తూ ఆమె వైపుకు నడిపిస్తూంది.

"రాఘవా!_" ఆమెముఖంలో మళ్లీ చిరునవ్వు పెకల్చుకొని వస్తూ ముఖాన్ని ఆవరించుకొంటూంది. ముఖం మళ్లీ మునుపటి రమణీయకతను కల్పించుకొంటూంది. ఆ అసంస్కృతకేశపాశం కూడా, అంతలో రామణీయమే అయింది.

* * *

ఇంట ఇంకెవ్వరూ లేరు. ముసలామె మంచములో పడివుంది. కాని ఏమంత సుస్తీగా లేదు. కన్ను కనబడదు మాట సరిగ్గా వినబడదు. ఏదో ఆమెధ్యాసలో గొణుగుతూమాత్రం ఉంటుంది. ఇంటికి వచ్చే పోయే వారూ ఊరివారెవరూ లేరు. ఇంట్లో పనీ, ముసలమ్మకు సేవా అంతా ప్రభావతే చేసుకొంటూంది.

అతని రాకతో ప్రభావతిలో ప్రథమంగా కొద్ది చైతన్యం వచ్చినట్లయింది. అలంకారానికి కాక పరాయివాళ్ల ముందర ఉద్ధతకు అన్నట్లుగా, స్నానాదికాలు ముగించుకొని, తల దిద్దుకొని, అతనికి ఆతిథ్యాలు చూస్తూంది. సన్నిహితురాలు లాగా లేదు. దూరస్థురాలు లాగునా లేదు.

ఇంటికి ఎరుక ఉన్న చుట్టం వస్తే మామూలుగా చూడవలసిన మర్యాదతో చూస్తూంది. అనురాగ విరాగాలు రెండూ కనబడటం లేదు.

ముసలమ్మ కొత్తమనిషి అలికిడి కనిపెట్టి "వచ్చినవారు ఎవరే అమ్మాయి?" అని కళ్లు మూసుకొనే మంచంలోనుంచి అడిగింది.

"బంధువులు" —అంది ముభావంగా. "మీ అత్తారి వైపువారా! ఏమౌతారు! మీ మరిది గారా?" ఆవిడధోరణిలో ఆవిడ గొణుగుతూనే ఉంది. ప్రభావతి జవాబు చెప్పకపోవటం తను అనుకొన్నది నిజమాటవల్లనే అన్నట్లుగా ధోరను తీగసాగించుకొంటూంది. ఆతిథ్యం విషయాలన్నీ అమ్మాయికి పురమాయిస్తూంది.

ప్రభావతి ఉత్తరం వ్రాసినట్లే ఊసు తేలేదు. ఆమె తెచ్చేదాకా ఆగుదామని తనూ ఆగాడు.

చీకటి పడిపోయింది.

"భోజనానికి లే!"

అతను తలవాల్చుకొనే భోజనం చేశాడు. అతని కదే. మనస్సులో చిరాకుగా ఉంది. కొత్తదనంతో ప్రవర్తిస్తుందో, అతిపరిచయంతో చూస్తూందో అవగాహన అవటం లేదు.

వసారాలో ముందుఅరుగుమీద అతనికి మంచం పక్క వేసి, మంచినీళ్లూ అవీ పెట్టి దీపం పుచ్చుకొని నుల్చుంది.

తలుపు వేసికొంటున్నాను. మంచి నీళ్లక్కడే ఉంచాను.

నిశ్చేష్టుడై ఆమెవంక చూస్తున్నాడు. దీపం వెలుగు ఆమెమొగంమీద పడుతూంది. ఏ భావమూ పరిస్ఫుటం కావటం లేదు. ఏదో ఒక మహాదీనావస్థ మాత్రమే మొగంలో గోచరిస్తూంది. కాని తనపట్ల ఈ ప్రవర్తన ఏమిటి! చిరుకోపంకూడా వచ్చింది.

"ప్రభా!_"

మాటాడకుండా తలెత్తి చూసి, తల దించేసుకొంది.

"ప్రభా! నావల్ల అపరాధ మేమిటి?"

మాట్లాడలేదు.

ఒక్కచూపు చురచుర చూసి,

"వెళ్లివస్తా!" అని లేవబోయాడు.

"వద్దు పడుకో!" - జాలిగా దీనంగానే అంటూంది. తలుపు వెయ్యకుండానే దీపం లోపల పెట్టి చీకటిపడ్డ ద్వారబంధంలో వచ్చి నుల్చుంది.

"పడుకో, రాఘవా!"

"ప్రభా! ఏమిటిది! నే నేంచేశానని నామీద ఈ కోపం - మరి నన్ను కనబడమని కూడా వ్రాశావెందుకు?"

హీనస్వరంతో అంటూన్నది.

"నీమీద కోపం లేదు రాఘవా!"

"మరి?"

"ఏమీ లేదు."

ఆమెచేయి పుచ్చుకొన్నాడు. ఆమె కదల లేదు. చేయి విదుల్చుకోలేదు.

చేయి వదిలేశాడు.

"సరే పోయి పడుకో!" అంటూ కోపంతో, మంచంమీద అటు తిరిగి పడుకొన్నాడు.

ఆమె వచ్చి మంచంమీద కూర్చుని, అతని బుజంమీద చెయి వేస్తూ ఒకనిట్టూర్పువిడిచింది.

"నీమీద కోపం కాదు రాఘవా! నెమ్మదిగా నాపరిస్థితి అంతా నీకు చెప్తాను. నా మనస్సు ఏదోగా ఉంది."

ఆమెను కౌగలించుకొన్నాడు.

ఆమె ఔననలేదు కాదనలేదు.

"రాఘవా! నేను నాభర్తఇల్లు వదిలి వచ్చేశాను!"

"ముసలమ్మగారికి జబ్బుగా ఉండి కాదా వచ్చింది?"

"కాదు. వచ్చాకే అమ్మమ్మకు జబ్బని తెలిసింది"

రాఘవరావు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. ఆమెనడుంచుట్టూ చెయ్యి అల్లాగే ఉంది. ఏ కారణంచేత వచ్చేసిందో స్ఫుటంగా తెలియలేదు.

అతను అడుగదలచుకొన్న ప్రశ్న ఒక్కటీ అడగలేకపోయాడు. ఆమె తనంతట తను మాట్లాడటంలేదు. నిశ్శబ్దంగా ఇద్దరూ అల్లాగే కూర్చుని ఉండిపోయారు.

———

చేయసాధ్యము కావచ్చును.

రాధాకృష్ణన్‌గారు 'రాజకీయ' పదవిని నిర్వహించుట కిదే ప్రథమము. అయినను వారికి వివిధరంగములందు అపార అనుభవము గలదు. కనుక ఈ రాయబారమునందు కృతకృత్యులు కాగలరని, అందుకు భారత విదేశాంగ శాఖ అన్నివిధముల తోడ్పడునని ఆశించుచున్నాము. వారి రాయబార ఫలితము పైననే ప్రాచ్యఖండమున శాంతి తద్వారా ప్రపంచశాంతి ఆధారపడియున్నది. కనుక ఒక్క భారత దేశమే గాక అఖిలప్రపంచము వారి కృషిని అత్యంత శ్రద్ధాసక్తులతో పరిశీలించుచుండును.

ప్రాచీనగ్రామసభల న్యాయపరిపాలనము

శ్రీ కోన వేంకటరాయశర్మ

గ్రామమే భారతవర్షముయొక్క ప్రాణము. మతరాజకీయవిప్లవము లెన్ని ఘటించి భీకరాకృతిని దాల్చి దేశమును దార్మాలుసేయ నుంకించినను, అన్యదేశీయు లొకరి తరువాత నొకరు దేశముపయి దండెత్తివచ్చినను-గ్రామము మాత్ర మేమాత్రము కదలికలేకయె దేశముయొక్క కట్టుబాటుల వేళ్లూని నిలుచు సర్వాంగసుందరమై తనరారుచుండెను. "ప్రతిష్ఠితా ప్రతిష్ఠితా ముద్రితా శాసితా తథా, చతుర్విధా సభా ప్రోక్తా సభ్యాశ్చైవ తథావిధాః" "ప్రతిష్ఠితా పురే గ్రామే చలానామా ప్రతిష్ఠితా, ముద్రితా ధ్యక్షసంయుక్తా రాజయుక్తా చ శాసితా" అని బృహస్పతిస్మృతియందుండుటవలన సభ ప్రతిష్ఠితా ప్రతిష్ఠితముద్రితశాసితములని నాల్గు విధంబులనియు, పట్టణమున గ్రామమున నెలకొలుపబడినది ప్రతిష్ఠితమనియు, నిలుకడగా నుండనిది యప్రతిష్ఠితమనియు, నధికారయుక్తమైనది ముద్రితమనియు, రాజయుక్తమైనది శాసితమనియు దెలియనగుచున్నది.

"కులాని శ్రేణయశ్చైవ గణాశ్చాధికృతో నృపః, ప్రతిష్ఠా వ్యవహారాణాం గుర్వేభ్యస్తూత్తరోత్తర" మ్మని నారదస్మృతియందుండుటను బట్టి కులసంఘములు శ్రేణీసంఘములు గణములు ముద్రితములు శాసితములు ననునవి యున్నట్లు తెల్లమగుచున్నది. ఇవి న్యాయసభలనియు కులమునకన్న శ్రేణియు, శ్రేణికంటె గణమును, గణమునకన్న రాజకృత సంవిత్తును, రాజకృత సంవిత్తునకంటె రాజసభయు, - నధికార బల దర్పములు గలిగియున్నవనియు, నారదమహర్షి యభిప్రాయము. నారదస్మృతికి వ్యాఖ్యాన మొనర్చిన యసహాయుడు "గ్రామే దుష్టః పురే యాతి పురే దుష్టస్తు రాజని, రాజ్ఞా దుష్టః కుటుష్టోవా నాస్తి పౌనర్భవో విధిః" అని వ్రాసినాడు గ్రామ సభాధ్యక్షుని నిర్ణయ మసంతృప్తిగా నుండు నెడల పౌరసభాధిపతికి *Appeal* చేసి తెలుపుకొనవచ్చును. పౌరసభాధికారి తీర్పు బాగుండదని తోచినచో రాజకృతసంవిత్తునకు దెలియజేయవలయును. యాజ్ఞవల్క్య మహర్షి "నృపేణాధికృతాః పూగాః శ్రేణయోఽథ కులానిచ, పూర్వం పూర్వం గురు జ్ఞేయం వ్యవహార విధౌ నృణామ్" అని వచించెను.

కులసంఘమే ప్రథమన్యాయసభ. ఈ సభయందలి సభ్యు లందఱును బంధువులే! ఈ పారిషదులు స్వల్పవిషయముల బరిశీలించి తీర్పు జెప్పుదురు. కులసంఘమునకంటె మిక్కుల యధికారముగలది శ్రేణీసంఘము. శ్రేణి యనగా "శ్రేణయో నానాజాతీనా మేకజాతీయ కర్మోపజీవినాం సంఘాతః" అని మితాక్షరమున జెప్పబడి యుండుటనుబట్టి వివిధజాతులకు జెందినను ఏకవృత్తి నవలంబించు శిల్పుల సంఘమునకు శ్రేణీసంఘమని యర్థము. శ్రేణీసంఘమునకన్న 'పూగ' యను సంఘము ప్రాముఖ్యమైనదని "పూగాః సమూహా భిన్న జాతీనాం భిన్నవృత్తీనామేకస్థాన నివాసినాం యథా గ్రామనగరాదయః" అను మితాక్షర వచనము చాటుచున్నది. వివిధజాతులకు జెంది వివిధవృత్తుల నవలంబించుచు నొకే గ్రామమునగాని యొకే పట్టణమునగాని నివసించు సభను 'పూగ' యని యందురు. కావున స్థానికపరిపాలనమున నితర సంఘముల కంటె పూగసంఘము ప్రశస్తి వహించినదని తెలియనగుచున్నది.

కేచిద్దేశాధిపత్యం కతిచన శిబికా
చామరచ్ఛత్రశోభాం
కేచిద్రాజ్యం స్వకీయం కతిచన విభవై
ర్విగ్రహారా నుదారా
న్విందంతే లోకరక్షా విధిమహితమహో
భాగధేయే ఒన్న వేమ
క్షోణీపాలే సభాయాం సకలగుణనిధా
రత్న సింహాసనస్థే."

అన వేమారెడ్డి వానపల్లి శాసనము, ఈశాసనము శా. శ. 1300 ల నాటిది. ఇది యన వేమునాస్థానమున నిరంతరము జరుగు కార్యప్రణాళికను దెలుపుచున్నది. పరిపాలనావిధానమున కంతకును గ్రామమే ప్రాతిపదికగ నుండి యుండెను.

ఇవ్విధముగ గ్రామసభ లేర్పడి న్యాయ పరిపాలన మేరీతిగ గొనసాగించుచుండెడివో సంక్షిప్తముగ సూచించెదను.

గ్రామనిర్మాణమున వీధులలో 'మంగళవీథి' యనునొకవీధి యున్నట్లు 'మానసార' మను గ్రంథమున జేర్కొనబడినది. ఇవ్వీధి గ్రామమంతటను జరివేష్టించి యుండును. గ్రామాభ్యుదయ మభిలషించి పురోహితుడు మంత్రమును జపించుచు ప్రదక్షిణముల నొనర్చుటకును గ్రామరక్షకులు రక్షణోద్యోగమున దిరుగాడు నిమిత్తమును. - ఈ మంగళవీథి యుద్దేశింపబడినదని 'హావెల్' అను నతడు తన "*A study of Indo - Aryan civilisation*" అను గ్రంథమున వ్రాసియున్నాడు. గ్రామసంరక్షణమునకును దోషుల బట్టికొనుటకును నేరముల గనిపట్టుటకును గ్రామాధికారియె బాధ్యుడని మనుస్మృతియందు జెప్పబడినది. తన గ్రామమున జరిగిన దోషములను దనపై యధికారికిని, అతడు తనపై యధికారికిని, - ఇటులనె యాయా యధిపతులు దెలియజేయుచుండవలెనని—

"గ్రామస్యాధిపతిం కుర్యా
ద్దశగ్రామపతిం తథా
వింశతీశం శతేశం చ
సహస్రపతి మేవ చ.
గ్రామే దోషాన్ సముత్పన్నాన్
గ్రామికః శనకైస్స్వయమ్,
శంసే ద్గ్రామ దశేశాయ
దశేశో వింశతీశినే."

—మను, అ 7. శ్లో 114, 116.

అను వచనముంబట్టి తెలియుచున్నది. దేశ సంరక్షణమునకయి యేర్పాటుపబడిన సైనికులు దోషులబట్టికొనుట యందును, దేశమున శాంతి భద్రతలు నెలకొల్పుటయందును, గ్రామాధికారికి దోడ్పడువారు. ఇట్టిసైనికులు రెండేసి, మూడేసి, అయిదేసి గ్రామములకు నడుమ స్థానము లేర్పఱచికొనెడి వారని "ద్వయా స్త్రయాణాం పంచానాం మధ్యే గుల్మ మధిష్ఠితమ్, తథా గ్రామశతానాంచ కుర్యాద్రాష్ట్రస్య సంగ్రహ"మ్మను మనుస్మృతి (అ 7. శ్లో 11.) వాక్యము విదితమొనర్చుచున్నది. ఇంతియకాక జన సమ్మర్దముగల సభాభవనములు, చలిపందిరులు, పతరువులు, చతుష్పథములు (నాలుగు త్రోవలు గలియు చోట్లు), అంగడులు లోనగు ప్రదేశములందును, జీర్ణగృహములు, అరణ్యములు, ఉపవనములు, జీర్ణోద్యానవనములు లోనగు స్థలములందును, జోరులబాధ లేకుండుటకై సైనికుల గొందఱను గాపుంచి మఱికొందఱను గావలికి బంపవలెనని—

"సభాప్రపాపూపశాలా
వేశ మద్యాన్న విక్రయాః
చతుష్పథాశ్చైత్య వృక్షాః
సమాజాః ప్రేక్షణానిచ
జీర్ణోద్యానా న్యరణ్యాని
కారుకావేశనాని చ
శూన్యాని చాప్యగారాణి
వనాన్యుపవనానిచ
ఏవం విధా న్నృపో దేశా
న్గుల్మైః స్థావర జంగమైః
తస్కర ప్రతిషేధార్థం
చారైశ్చాప్యనుచారయేత్."

—మను, అ 9. శ్లో 264, 65.

అను వాక్యములంబట్టి తెలియుచున్నది. కాని గ్రామముల సంఖ్య యధికమై జనసంఖ్య పెరిగిన కాలది, సాంఘిక వ్యవహారాదులు బలపడిన కాలది, రాజ్యతంత్రమున బరిణామ ముదయించినది. అందువలన గ్రామవ్యవహారముల జక్క జెట్టుటయె గ్రామాధికారివిధి యయ్యెను. అక్కడ తన దోషముల గనిపట్టుటకయి 'యామికు' డనువాడు ఏర్పడియెను. గ్రామాధికారి యు నీ యామికుడును జేరి గ్రామమున రాజకృద్ధర్మముల నిర్వహించు రాజప్రతినిధులుగ నుండిరి.

యామిక ధర్మములు :

అధికారి గ్రామాధిపతియే! ఆతని యాజ్ఞల నొదలనిడి యాచరణయందు బెట్టునది యామికుడు. ఈ యామికుని ధర్మములు శుక్రనీతిసారమున జక్కగా వివరింపబడినవి. ఇతడు ప్రత్యహము గావలిగాయుచు నింట్ల వరుసకు దుది మొదల నెందేని దన యునికి నేర్పఱచికొని గ్రామమును విడచి వెడలువారిని, గ్రామమునకు వచ్చువారిని, - జాగరూకతతో బరిశీలించుచుండవలెననియు, కీర్తికాములను సత్స్వభావముగలు యట్టివారినిమాత్ర మడ్డునెట్టక విడువవలెననియు, దక్కటివారిని వారి స్వంత హామీమీద విడువదగుననియు,—

"దినేదినే యామికానాం
ప్రకుర్యా త్పరివర్తనమ్."

—శుక్రనీతి, అ 1. శ్లో 289.

"గృహపంక్తి ముఖే ద్వారం
కర్తవ్యం యామికైస్సదా."

(అ 1. శ్లో 290(

"నిర్గచ్ఛంతి చ యే గ్రామాత్
యే గ్రామం ప్రవిశంతి చ
తాన్ సుసంశోధ్య యత్నేన
మోచయేద్దత్త లగ్నకాన్
ప్రఖ్యాత సృత్తశీలాంస్తు
హ్యవిమృష్య విమోచయేత్
వీథివీథిషు యామార్థే
ర్నిశి పర్యటనం సదా
కర్తవ్యం యామికైరేవ
చోరజార నివృత్తయే."

—శుక్రనీతి, అ 1. శ్లో 291, 92, 93.


అను శుక్రనీతి వచనములంబట్టి యామిక ధర్మము పరిపూర్ణవికాస మందినదని యూహింపదగును. గ్రామములోనుండి ప్రజల సొత్తును బరిరక్షించుచు, గ్రామమును గాపాడుచు, దద్రక్షణము నేమరకుండు నీయామికునకు గృహస్థులే భృతి నిచ్చి పోషించువారని "తైస్సద్వృత్తింతు కృణుయాత్ గృహస్థభృత్యపోషితైః" (అ 1. శ్లో 90.) అను శుక్రనీతి వచనమువలన దెలియుచున్నది.

మనదేశమునం దన్నసత్రములు ధర్మశాలలు లోనగునవి పూర్వము నుండియు నూరూర గలవు. దూరముగానుండు గ్రామముల నడుమ నొక్కొక చోట పాంథశాలలు వినిర్మించుటయును పూర్వము కలదు. పాంథశాల లనునవి యిప్పటి పాంథశాలలవలె కేవల శాలామాత్రములే గాక ప్రజలకును బాంధవులకును బలుతెఱగుల నుపకారకములై యుండెడివి. ఇవ్విషయమున—

"గ్రామద్వయాంతరే చైవ
పాంథశాలాం ప్రకల్పయేత్,
నిత్యం సమ్మార్జితాం చైవ
గ్రామపైశ్చ సుగోపితామ్,
తత్రాగతం తు సంపృచ్ఛేత్
పాంథశాలాధిప స్సదా,
ప్రయాతోఽసి కుతః కస్మాత్
క్వ గచ్ఛసి ఋతం వద,
ససహాయోఽసహాయో వా
కిం శస్త్రం కిం సవాహనః,
కా జాతిః కిం కులం నామ
స్థితిః కుత్రాస్తి తే చిరం,
ఇతి పృష్ట్వా లిఖేత్సాయం
శస్త్రం తస్య ప్రగృహ్య చ,
సావధానమనా భూత్వా
స్వాపం కుర్వితి శాసయేత్,
తత్రస్థాన్ గణయిత్వా తు
శాలాద్వారం పిధాయ చ,
సంరక్షయే ద్యామికైశ్చ
ప్రభాతే తాన్ ప్రబోధయేత్,
కుర్యాత్సహాయం సీమాంతం
తేషాం గ్రామ్యజన స్సదా."

అని చెప్పబడియుండుటను గమనించిన రెండు గ్రామములకు నడుమ పాంథశాలను.

(26-వ పేజీ చూడుడు)



సియా: చతుర్వర్గవ్యూహం: 4

కమ్యూనిస్టు కూటమి

[ఆంధ్రారాత్]

ఏనాలో కమ్యూనిస్టు విజయాలవల్ల ప్రపంచ రాజకీయ స్వరూపమే మారిపోయింది. సియాలో నేడది బలవత్తరమైన దనేది నిస్సంహం. నైసర్గికంగా సన్నిహితమైనవీ, రాజకీయంగా సహకారం మైత్రి నెరపుతున్నవీ న్ని రాజ్యాల కూటానికి చీనా కమ్యూనిస్టు నికదళాలు అగ్రశ్రేణియై పురోగమిస్తున్నాయి. విరోధవర్గాలలో లేని ఐకమత్యం, సర్గికసౌకర్యం వీని కున్నది.

ఈ కమ్యూనిస్టు రాజ్యకూటమిలో చేరినవి వియట్ రష్యా, ఔటర్ మంగోలియా, త్తర కొరియా, కమ్యూనిస్టు చీనా. బహుశా హోచిమిన్ స్థాపించిన వియత్‌నమ్ రిపబ్లిక్ డా వీనిలో చేరి ఉండవచ్చును.

ఈ కమ్యూనిస్టువర్గాన్ని గురించి నిర్ణయాలు సేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం. ఎందుల్లనంటే వివిధదేశాలలోని కమ్యూనిస్టుపార్టీల ధ్య సంబంధ బాంధవ్యాలు ఎప్పుడూ అజ్ఞాంగానే ఉన్నాయి. ఈ రహస్య మైత్రి సహకారాలనుగురించి కొన్ని స్థూలమైన విషయాలుమాత్రం గ్రహించవచ్చును.

కమ్యూనిస్టువర్గంలోని అంగాలన్నీ ఒకే వగల కర్ర అనుకోకూడదు. ఔటర్ మంగోయా, ఉత్తర కొరియా ప్రభుత్వాలు సోవిట్ రష్యా ఆధ్వర్యంక్రింద స్థాపించబడినాయి. సియా వ్యవహారాలపట్ల మాస్కో విధానంలో ప్పుడే మార్పులు వచ్చినా ఈదేశాలలో ఇట్టే తిఫలిస్తాయి. చీనా కమ్యూనిస్టుల భావతత్వం స్కో తత్వంతో అతి సన్నిహితంగా ఉన్నటికీ, వారు విజయాలు సాధించారంటే తిక సంవత్సరాలుగా చీనా పల్లెప్రాంతంలో సిన బ్రహ్మాండమైన కృషి కుదిఫలితం. వ్యవహారవిధానంలో, ముఖ్యంగా విదేశాంగవ్యవహాల్లో - చీనాకమ్యూనిస్టులు పాతస్టాలినిస్టు ద్ధతుల్నే అనుసరిస్తున్నమాట నిజమే. కాని రి అంతరంగిక వ్యవహారాల్లో సోవియట్ ష్యాప్రభావం వీసమైనా కనిపించదు సరిదా వారి జాతీయతత్వం స్పష్టంగా నిపిస్తుంది.

హోచిమిన్ ఆధిపత్యం క్రిందనున్న వియత్‌మ్ రిపబ్లిక్ అసలు ఈవర్గంలో ఉందని ఖచ్చింగా చెప్పడానికి వీలులేదు. ఆసియాలో ఈరిపక్ బొత్తిగా దిక్కు లేకుండా ఉంది.

డా॥ హోచిమిన్ మాస్కోలో శిక్షణపొందవాడే. మార్క్సిస్టు విధానాన్ని విశ్వసించేడే. కాని ఇప్పుడు స్టాలినిస్టు మాత్రం కాడు. మెరికా కాంగ్రెస్ నివేదికలోని విదేశాల మ్యూనిస్టునాయకుల జాబితాలోకూడా ఇతని రు లేదు.

వియత్‌నమ్ కమ్యూనిస్టుపార్టీ ఒకప్పుడు ద్దయి పోయింది. దాని స్థానే ఒక మార్క్సిస్టు ర్గం అక్కడ మిశ్రపక్ష ప్రభుత్వంలో అల్పసంఖ్యాకవర్గంగా మాత్రమే ఏర్పడింది. 1948 ర్చిలో కలకత్తాలో జరిగిన (కమ్యూనిస్టుల) యువజన మహాసభలో విప్లవోద్యమానికీ, ఛిన్నకరమైన కార్యక్రమాలకీ వియత్‌నమ్ తినిధులు అంగీకరించలేదు. ఇటీవల న్యూస్ పత్రికా సంపాదకుడు హెరాల్డ్ జాక్సన్‌తో రేడియో ఇంటర్వ్యూలో ప్రశ్న డా॥ హోచిమిన్ ఇచ్చిన సమాధానాలు త్రంగా ఉన్నాయి. "వియత్‌నమ్‌పై ఫ్రెంచివారు చేస్తున్న యుద్ధాన్ని నిరోధించడానికి ఫ్రెంచి కమ్యూనిస్టులు ప్రయత్నించారేమో కు తెలుసునా?" అని ప్రశ్నించాడు జాక్సన్. దీనికి లేదు అని స్పష్టంగా సమాధానచ్చాడు. డా॥ హో. అతడు మార్షల్ ప్రణాళికగానీ, టిటోనుగాని విమర్శించడానికి నిరాకరించాడు. అమెరికా రష్యాల ప్రభావాలకు ఎగా నక్కరలేకుండా వియత్‌నమ్ రిపబ్లిక్ స్వేచ్ఛగా వృద్ధిచెందగలదనీ, తన దేశం ఎవరికీ తలవంచి నడువవలసివస్తుందన్న భయం తన కెన్నడూ లేదనీ తన అభిప్రాయం ప్రకటించాడు.

ఇటువంటి భావాలు గలవారు ద్రోహులనీ, సంస్కరణవాదులనీ స్టాలినిస్టులు నిరసిస్తారు. కాని వియత్‌నమ్ అధ్యక్షుడు క్రమక్రమంగా కమ్యూనిస్టువర్గం వైపుకు మొగ్గవలసివస్తున్నది. బావ్‌దాయ్ ఆధ్వర్యంకింద ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నెలకొల్పడంలో ఫ్రెంచివారికి అమెరికా సహాయపడుతోంది. దక్షిణాసియాలోని మితవాద జాతీయపక్ష దేశాలు (ఇండియా మొదలైనవి) వియత్‌నమ్ రిపబ్లిక్‌పట్ల పూర్తిగా నిరాదరణ కనపరిచాయి. ఇటీవల సయాంలోని వియత్‌నమ్ కాందిశీకుల్ని ప్రభుత్వ ప్రతినిధివర్గాన్ని సయాం అతివాద జాతీయ నాయకుడైన ఫిబుల్ సంగ్రామ్ ప్రభుత్వం తిప్పలు పెట్టింది. అందువల్ల చీనా కమ్యూనిస్టులు వియత్‌నమ్ సరిహద్దు దాపులకు వచ్చే సమయంలో వారు ఆయుధసామగ్రి నిచ్చి సహాయపడితే వీ రంగీకరిస్తే ఆశ్చర్యపడనక్కరలేదు. అయితే ఇటువంటి సహాయం కోసం వియత్‌నమ్ రిపబ్లిక్ చీనా కమ్యూనిస్టులతో సంధిచేసుకుందని ఫ్రెంచి ప్రచారశాఖ చేస్తున్న ప్రచారాన్ని నమ్మడానికి తగిన ఋజువు లేదు.

కమ్యూనిస్టువర్గంలోని రాజ్యాలలో ఆర్థిక సహకార సమరసాలు పెంపొందుతున్నట్లు రూఢిగా కానవస్తోంది. మంచూరియా ఎగుమతి దిగుమతి వ్యాపారాలకు ఉత్తరకొరియా ఉపయోగపడుతోంది. జపాన్‌వారు నిర్మించిన యాలూనది హైడ్రో - ఎలక్ట్రిక్ ప్రాజెక్టువల్ల ఉత్పత్తి అవుతున్న విద్యుచ్ఛక్తిని ఉత్తర కొరియా, మంచూరియాలు పంచుకుంటున్నాయి. కొంత సోవియట్ రష్యాలోని వ్లాడివాస్టక్ రేవుకికూడా సప్లై అవుతున్నట్లు వదంతు లున్నాయి. చీనాకమ్యూనిస్టుల పాలనలో ఉన్న మంచూరియా, సోవియట్ సైబీరియాలమధ్య వస్తుమారకం నడుస్తున్నట్లుంది కూడా. ఇందులో ముఖ్యమైనది మంచూరియా గోధుములకి సోవియట్ రష్యా గాసొలీన్ మారకం ఇస్తోంది. సోవియట్ - కొరియన్ కార్పొరేషన్లు రెండుపెద్దవి ఉత్తరకొరియాలో స్థాపించబడినాయి.

రాజకీయరంగంలో కూడా సహయోధ్యత పెంపొందుతోంది. అప్పుడప్పుడు అతిశయోక్తులు, స్వకపోల కల్పనల్తో మేళవించి పీపింగ్ రేడియో, పయంగ్ యాంగ్ రేడియోలు (కమ్యూనిస్టుచీనా, ఉత్తరకొరియాలవి) ప్రపంచ వ్యవహారాలనుగురించి మాస్కో రేడియోనీ, టాస్ (రష్యన్) వార్తా సంస్థనీ అనుసరిస్తున్నాయి. అమెరికా గోడమీద పిల్లివలె పొంచిచూస్తుండగా అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాలు రెండింటిలోనూ రష్యా ఒక్కతే శత్రుపక్షాల నెదిరించి జయించిందని చెప్పడం పయంగ్ యాంగ్ రేడియోకి మామూలు.

ఈ మధ్య ప్రతినిధివర్గాలను పంపమని ఈరాజకీయ మైత్రి బాంధవ్యాలనీ దేశాలు బలపర్చుకున్నాయి. ఏప్రిల్ మాసంలో పీపింగ్ నగరంలో జరిగిన చీనాయువజనకాంగ్రెస్ సమావేశానికి కొరియన్ యువజన ప్రతినిధివర్గం వెళ్లింది. వారు స్వదేశం తిరిగి వెళ్ళినప్పుడు తమనాయకుడు కిమ్ సంగ్‌ను మావ్‌ట్సెటుయంగ్ చాలా ప్రశంసించాడనీ, త్వరలోనే కొరియాదేశం స్వాతంత్ర్యంప్రాప్తింపచేసుకొని ఉత్తరకొరియా ఆధ్వర్యంక్రింద ఏకమవుతుం దని చూచే జోస్యం చెప్పాడనీ ప్రచారం చేశారు.

ఈదేశాలతో మాస్కో అధికారరాజ్యాంగ వ్యవహారాలు వివిధరకాలు గా ఉన్నాయి. ఔటర్ మంగోలియా మాస్కోతో ఆర్థిక రాజకీయ, సైనిక వ్యవహారాలన్నిటికీ సంబంధించిన మైత్రి సంధి ఒకటి చేసుకుంది. రష్యావర్గ దేశాలచేత మాత్రమే గుర్తించబడిన ఉత్తర కొరియా ప్రభుత్వం మార్చి మాసంలో మాస్కోతో పది సంవత్సరాల ఆర్థిక ఒడంబడిక చేసుకుంది. ఈ ఒడంబడికలో సైనికసహాయం ప్రసక్తియే లేదు. కాని రహస్యంగా సైనిక సహాయానికి కూడా ఒక ఒడంబడిక జరిగిందని కొందరు చెప్తున్నారు. కమ్యూనిస్టు చీనాను మాస్కో అధికారరీత్యా గుర్తించలేదు. ఇంకా కొమింటాంగ్ ప్రభుత్వంతోనే అధికారరీత్యా సంబంధాలున్నాయి. మాస్కో, పీపింగ్ నగరాలమధ్యగల సాన్నిహిత్యం అధికారరాజ్యాంగవిషయిక మైనది కాదు. సిద్ధాంతాలకు సంబంధించినది మాత్రమే. ఈ బాంధవ్యం ఎంత గాఢమైనదో కనిపెట్టడం చాలా కష్టం.

ఈ కమ్యూనిస్టు రాజ్యాల మధ్య సైనిక సహకారం ఎంతవరకూ ఉంది అనే విషయంపైన దీర్ఘచర్చలు జరుగుతున్నాయి. ఉత్తరకొరియాకీ చీనా కమ్యూనిస్టులకీ మధ్య పరస్పరసహాయపు టొడంబడిక జరిగిందని అమెరికాదక్షుతగల దక్షిణకొరియా రిపబ్లిక్ నాయకులు చెప్తున్నారు. ఈ ఒడంబడిక 1946 వ సంవత్సరంలోనే జరిగిం దంటున్నారు. మంచూరియాలో చీనా కమ్యూనిస్టులకు సహాయంగా ఉత్తర కొరియా సైనికదళాలు యుద్ధంలో పాల్గొన్నాయనీ, ప్రతిఫలంగా దక్షిణకొరియా రిపబ్లిక్‌ని రూపుమాపడంలో ఉత్తరకొరియాకు తోడ్పడగలరని చీనా కమ్యూనిస్టులు వాగ్దానం చేశారనీ చెప్తున్నారు. ఇది నిజమే కావచ్చును. కాని నిరూపించడానికి ఆధారా లేమీ లేవు. చీనా కమ్యూనిస్టు సైనికదళాలలో కొరియావాసు లున్నారు. కాని వీరు మంచూరియాలో నివాస మేర్పరుచుకున్న పదిలక్షలమంది కొరియన్ల నుంచి సైన్యంలో చేర్చుకోబడినవారు కావచ్చును.

చీనా కమ్యూనిస్టులు వియత్‌నమ్ రిపబ్లిక్ ప్రభుత్వాల మధ్య సైనిక సహాయపు టొడంబడిక జరిగిందని ఫ్రెంచివారు ప్రచారంచేసిన వార్తకిగాని, ఉత్తరకొరియా, చీనా కమ్యూనిస్టులు, బర్మా కమ్యూనిస్టులమధ్య సైనిక సహాయపు టొడంబడిక జరిగిందని చీనా కొమింటాంగ్ ప్రచారంచేసిన వార్తకిగాని నిరూపించగల ఆధారా లేమీ లేవు. ఈ వార్తలు ప్రచారంచేసే ఈ రెండు ప్రభుత్వాలూ కూడా కమ్యూనిస్టు ముప్పు అధికంగా ఉందనిచెప్పి అమెరికావల్ల ఆర్థిక సైనిక సహాయాలను అపేక్షించుచున్నవే. ఉత్తరబర్మాలోనూ, ఉత్తర వియత్‌నమ్‌లోనూ చీనా దేశీయుల గుంపులు దాడి చేస్తున్న మాట నిజమే. కాని గూఢచారుల వార్తల్నిబట్టి ఈ గుంపులు ఏ రాజకీయాలకీ సంబంధించినవి గావనీ, సరిహద్దులో చెలరేగుతున్న దోపిడిమూకలుమాత్రమే ననీ తెలుస్తోంది.

అంటే చీనాకమ్యూనిస్టులు తమ సరిహద్దుల్లో ఉన్న కమ్యూనిస్టుమిత్రులకి సహాయం చెయ్యరని చెప్పడం కాదు. చీనాకమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీకి చెందిన కమ్యూనిస్టు తత్వవేత్త జెన్ పైషి ఏప్రిల్‌లో ఒక ఉపన్యాసంలో "చీనా విప్లవ ప్రాబల్యం ఆధారంతో, అప్పుడే ఆగ్నేయాసియాలోని అనేక కోట్లకొద్దీ ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నారు" అన్నాడు. (ఇతని ఉపన్యాసాన్ని మాస్కో పత్రిక ప్రావ్‌డా వివరంగా ప్రచురించింది.) కోట్లకొద్దీ ప్రజలు పోరాడుతున్నమాట అబద్ధమే కాని చీనా కమ్యూనిస్టుల విజయాలవల్ల దక్షిణాసియాలోని దాదాపు 40 లక్షలమంది కమ్యూనిస్టులకు ప్రోత్సాహం కలుగుతున్నమాట నిజం. ఆగ్నేయాసియాలోని వివిధదేశాలలో వ్యాపించియున్న కోటిమంది చీనాదేశీయులు వామపక్షాలకు తిరుగుతున్నారు. అయితే చీనాకమ్యూనిస్టు లెంత విజయం పొందుతున్నప్పటికీ దక్షిణ చీనా సరిహద్దు ఇంకా వారికి 700 మైళ్ళ దూరం ఉంది. దేశంలో భాగంలోని దూరసరిహద్దులింకా మూడువేల మైళ్లున్నాయి. ఈ పరిస్థితిలో చీనాలో తమ స్థితిని బలపరుచుకోనిదే వారు ముందు తొందరపడి అన్యులకు సహాయం చేస్తారనేది సంభవం కాదు.

ఆసియా కమ్యూనిస్టువర్గానికి మాస్కో కాకుండా, పీపింగ్ నగరం కేంద్రమౌతుందని ఎడ్గార్ స్నో మొదలైన చీనా వ్యవహార నిపుణులు చాలామంది జోస్యం చెప్తున్నారు. ఆసియా సమస్యలని మార్క్సిస్టు సిద్ధాంతాల ననువర్తింపచేసినవారు మొట్టమొదటగా మావ్‌ట్సెటుంగ్ ప్రభృతులేననడంలో సందేహం లేదు. వారి పాతిక సంవత్సరాల పోరాటంలోనూ వారు తమ అధికారాన్ని బలాన్నీ స్థిరపర్చుకోడమే కాకుండా, మాస్కో ఎంతమంది కమ్యూనిస్టు నాయకుల్ని సృష్టించగలిగిందో వారు కూడా ఆసియాలోని ఇతర దేశాలలో అంతమంది నాయకుల్ని సృష్టించగలిగారు. ఉదాహరణకి ఉత్తరకొరియా కమ్యూనిస్టుల్లో అగ్రనాయకు లైదుగురూ యెనాన్‌లో (యుద్ధకాలపు చీనా కమ్యూనిస్టుల ప్రధాన నగరం) శిక్షణ పొందినవారే. ఉత్తరకొరియా సైన్యాధిపతి బోయన్‌గమ్, ఉప సైన్యాధిపతి కిమ్ టుబాంగ్ ఇద్దరూ చీనా కమ్యూనిస్టు సైన్యంలో అనేక సంవత్సరాలు నాయకులుగా ఉన్నవారే. యెనాన్‌లోనే స్థాపించబడిన కొరియన్ ఇండిపెండెన్సు లీగ్‌కి నాయకత్వం వహించినవాడు కిమ్‌టుబాంగ్. జపాన్ కమ్యూనిస్టు ప్రధాన నాయకుడు శాంజోనొసాకా యుద్ధకాలంలో తన జపాన్ ప్రజాసముద్ధరణ సమితిని యెనాన్‌లోనే స్థాపించాడు. వియత్‌నమ్ నాయకుల్లో డా॥ హో తరువాత ముఖ్యనాయకుడైన వోగుయెన్‌జియప్ యుద్ధకాలంలో యెనాన్‌లోనే దాగినట్లు చెప్తారు. 1925 తరువాతనుంచీ డా॥ హోచిమిన్ చీనాకమ్యూనిస్టు నాయకుల్తో సన్నిహితమైత్రి నెరపాడు.

ఈ మైత్రి బాంధవ్యాలకు విజయాదర్శం తోడయింది. చీనాతో చాలా పోలిక ఉన్నందువల్ల ఆసియాకమ్యూనిస్టులందరూ - ఇతర ఆసియావారు పక్షనాయకులుకూడా - చీనా ఆదర్శాన్నే రష్యా ఆదర్శంకంటె అధికంగా పరిశీలిస్తున్నారు. చీనా తరువాత చీనా కమ్యూనిస్టుల కరపత్రాలు అత్యధికంగా ప్రచారమౌతున్నది భారతదేశం కావడం హేతురహితం కాదు.

మాస్కోకి బదులు పీపింగ్ కేంద్రంగా ఆసియా కమ్యూనిస్టు రాజ్యకూటమి ఏర్పరచాలనే సమస్య ఇంకా రాలేదు. వాషింగ్‌టన్ వలెనే మాస్కోకూడా విరోధి అని పీపింగ్ తలిచినట్లయితే ఈ సమస్య తలెత్తుతుంది.

ప్రపంచం ప్రస్తుతరీతిని రెండువిరోధవర్గాలుగా చీలి ఉన్నంతవరకూ అటువంటి అవసరం కలుగదు. సోవియట్ అమెరికన్ యుద్ధమే సంభవించి అమెరికన్లే విజయం పొందినట్లయితే వారు రష్యన్ నాయకుల్నే గాక తమను కూడా అధికారంనుంచి తొలగివస్తారని చీనా కమ్యూనిస్టునాయకుల అభిప్రాయం.

ప్రస్తుతం చీనాకమ్యూనిస్టునాయకులు అమెరికానీ, వలసలు పాలిస్తున్న సామ్రాజ్యవాదప్రభుత్వాల్నీ మాత్రమే కాక, ఆంగ్లో అమెరికన్ వర్గంవైపు మొగ్గుతున్న ఆసియా రాజ్యాల్ని కూడా హద్దు లేకుండా దూషిస్తున్నారు. ఇండోనీషియాసమస్యపై ఢిల్లీలో జరిగిన సమావేశాన్ని గురించి మాస్కో రేడియో అది "పరదేశాలను పీడిస్తున్న పాశ్చాత్య రాజ్యాలను బలపర్చడానికి ఆంగ్లో - అమెరికన్ వర్గం పన్నిన తంత్రం" అని విమర్శించినప్పుడు, చీనా కమ్యూనిస్టు రేడియోకూడా నెహ్రూ, సుకర్నో, క్విరనోలను విమర్శించి, వీరు ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదులకు ఆసియాను అమ్ముతున్న దుర్బలమనస్కులైన బూర్జువాలు అని దూషించింది. పాశ్చాత్యసామ్రాజ్య ప్రభుత్వప్రాబల్యాన్నీ, ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్య వర్గంతో చేరుతున్న ఆసియాదేశాల జాతీయవాదుల్నీ ఎదిరించి పోరాడుతున్న కమ్యూనిస్టుల పట్లనే వారు ఆదరాభిమానాలు ప్రకటించారు.

ఇప్పుడు ఆసియాలో పక్షోత్షుయుద్ధం చీనా సరిహద్దుప్రాంతాల్లో కేంద్రీకృతం కాక తప్పదు. ఇది ప్రపంచంలోని సర్వసంపత్సమృద్ధమైన ప్రాంతాలలోనే మేలైనది. ఇక్కడే ప్రజల సమస్యలతి క్లిష్టమైనవి. అస్థిరత కల్లోలం ఇక్కడే అధికం. ఈప్రాంతం ఇప్పుడుఆంగ్లో-అమెరికన్‌వర్గంవైపే మొగ్గుతున్నప్పటికీ, చివరి కేమవుతుందో గ్రహించడం దుర్ఘటం. ఈ ప్రాంతంలో పరిస్థితి మారిపోయినట్లయితే, చీనావిప్లవం వల్లనే చలించిపోయిన విరోధరాజ్యకూటబలాల సమతులా సిద్ధాంతం, ప్రపంచ పరిస్థితి తారుమారైపోతాయి.

కార్యశూరుడు:

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

ఆగస్టు 23 తో ప్రకాశంగారికి 77 ఏళ్లు నిండాయి. 78 లో అడుగు పెట్టారు. ఈ 77 ఏళ్ల జీవనంలో రకరకాల అనుభవాలు, రాజకీయాలు, సాహసచర్యలు రసవత్తర ఘట్టాలు, జయాపజయాలు ఇమిడి ఉన్నాయి. నిరుపేదస్థితిలో పరాయిపంచల గడిపినా, అపార భాగ్యసంపద లనుభవించినా, తిరిగి సర్వమూ కోలుపోయినా, ఆపైన అధికారంలో శిఖరాన్నందుకున్నా తిరిగి పతనమైనా అన్నిటా ప్రకాశం విశిష్టవ్యక్తిత్వం గోచరమౌతుంది. ఆయన పుట్టినప్పటికీ ఇప్పటికీ దేశం స్వరూపం పోలికే లేకుండా మారిపోయింది. అయినా ప్రకాశంలోని వ్యక్తిప్రతిభ నిశ్చలంగా ప్రకాశిస్తూనే ఉంది.

అదొక అపూర్వ జాతకం అంటారు పెద్దలు. నిజానికి ఇప్పుడు ఆంధ్రదేశం జాతకమే అల్లా ఉంది. ప్రకాశం జాతకంలోనూ, ఆంధ్రదేశం జాతకంలోనూ ఒడిదుడుకులు ఒకేరీతిగా ఉన్నాయి. గుణగణాల్ని బట్టి చూసినా ఆంధ్ర జాతి విశిష్టలక్షణాలు ఆయనలో మూర్తీభవించి ఉన్నాయని చెప్తే అందులో అతిశయోక్తి లేదు. ప్రకాశంగారిని ఆంధ్రదేశం ఆరాధిస్తున్నా, అనుచరులు అపజయంలో కూడా ఆయన్నే అంటిపెట్టుకుని ఉన్నా, ప్రతికక్షులు ఆయన్ని నిరసించి పగబట్టినా, ఈ విశిష్ట లక్షణాలవల్లనే.

"మొదట్నించీ పౌరుషంగా నిర్లక్ష్యంగా బతికిన ఘటం." దుందుడుకుతనం కానివ్వండి, జగడం కానివ్వండి "చేసే ప్రతి కార్యంలోనూ ఒక న్యాయం ఉన్నదనే విశ్వాసం" ఆయన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా మొండిగా నిలబెట్టగలిగేది. ఇవి ఆయన స్వీయచరిత్రలో వ్రాసుకున్నారు. సమయోచిత పరిజ్ఞానం, వివేకం న్యాయధర్మాలకు తరువాతనే నంటారు ప్రకాశంగారు. తాను న్యాయమని తలచినదానికోసం పరాజయం కలుగుతుందని తెలిసికూడా పట్టుదలగా నిలిచి అదే విజయమంటారు. ఇది అవివేకమంటారు తమిళులు. ఇదే ఆయన్ని రాజకీయరంగంలో అనేకమార్లు బోల్తాలు కొట్టించింది. ఈ లక్షణానికే ఆంధ్రదేశం అంతా ఆయన్ని ఆరాధిస్తుంది. ఆయన ప్రతికక్షులు కూడా దీనికే ఆయన్ని గౌరవిస్తారు.

ప్రకాశంగారు 1872 ఆగస్టు 23 వ తేదీని కంచుమర్రులో మేనమామల ఇంట్లో జన్మించారు. వీరి తండ్రిగారి ఊరు టంగుటూరుకీ ఒంగోలుకీ మధ్యనున్న తోట్లవల్లూరుగ్రామం. వీధిబడుల్లో చదువులికి ఈయన్ని గంజికావిడి పట్టవలసివచ్చేది. పెద్దబావగారివద్ద మాత్రం కొంత చదువు వొంటబట్టింది. ధాతకరువులో తండ్రిగారు కుటుంబపోషణకోసం ఊరు విడిచి నాయుడుపేట చేరవలసివచ్చింది. నాయుడుపేటలో ఇంగ్లీషుస్కూల్లో చేరినతరవాత ప్రకాశంగారికి పోకిరిపిల్లల్తో స్నేహం లభించింది. చిలిపిపనులమూలంగా స్కూల్లో దేహశుద్ధి తరుచు జరుగుతుండేది. రెండుసార్లు స్కూల్లోనుంచి వెళ్లగొట్టారు. పెద్దల ప్రాపకంవల్ల మళ్లీ చేరారు. తాలింఖానాల్లో చేరి వస్తాదుల్తో స్నేహం చేశారు. వీరి పన్నెండోయేట తండ్రి మరణించారు. తల్లి బంధువులమాట పెడచెవిని పెట్టి, సోదరుల ప్రాపుకే అంటిపెట్టుకోకూడదనే పట్టుదలతో, స్వయంగా సంసారాన్ని పోషించుకోడానికి ఒంగోలులో స్వయంగా హోటల్ పెట్టింది. అప్పుల నెదిరించి, 'పూటకూటివాళ్ల'ని అధిక్షేపించినా సహించిన ఆ తల్లి పట్టుదలను, సాహసాన్నీ, స్వాభిమానాన్నీ ప్రకాశం పుణికి పుచ్చుకున్నారు.

ఒంగోలు స్కూలులోనే ప్రకాశంగారికి నాటకాలతోనూ ఇమ్మనేని హనుమంతరావు నాయుడుగారితోనూ పరిచయమేర్పడింది. స్కూలుజీతం కట్టే తాహతు లేకపోయినా చదవాలనే పట్టుదల ఉండేది. ప్రకాశంగారి విద్యాభ్యాసంకోసం పాటుపడినవారు నాయుడుగారు. అటు చదువులోనూ వెనకపడకుండా, ఇటు నాటకాల్లోనూ జట్టీలోనూ మేటిఅనిపించుకుని స్కూలు చదువు సాగించారు. నాయుడుగారు కుటుంబస్థితి సరిగాలేక రాజమహేంద్రవరం వెళ్లినప్పుడు, కేవలం సరదాకి, ఆ బస్తీనీ గోదావరి నదినీ చూడ్డానికే ప్రకాశంగారు తల్లివద్ద సెలవుపెట్టి నాయుడుగారివెంట వెళ్లారు. చివరికి వారివద్దనే ఉండి వారి సహాయంతోనే రాజమహేంద్రవరంలో చదువు సాగించారు. అక్కడ కూడా నాటకాలూ జట్టీలూ ఆయనవెంట వెళ్లాయి. వయస్సుతో బాటు జట్టీలు పెద్దవైనాయి కూడా. నాటకాల పిచ్చి ఎక్కువై మెట్రిక్యులేషన్ పరీక్ష తప్పింది. తరవాత ప్రైవేట్‌గా పరీక్షకుకట్టిపాసయ్యారు. ఆకాలంలో మెట్రిక్యులేషన్ పాసయితే చాలు మంచి ఉద్యోగాలు దొరికేవి. అయినా నల్లలాంగు కోటుమీద కలిగిన మోజుచేతా, (ఆనాటి) ప్లీడర్ల మాదిరిగా కర్ర తిప్పుకుంటూ దర్జాగా నడవాలనే కుతూహలంచేతా, నాయుడుగారి అండ ఉన్నందువల్ల కాలేజీచదువు సాగించారు. రాజమహేంద్రవరం కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే



కాకినాడ వెళ్లి నాటకాలు వెయ్యడం రౌడీజట్ల తగాదాల్లోపడి తన్నులు తినడం జరిగాయి. కాలేజీచదువులంటే ఇప్పటి సరదాలు వేరు అప్పటి సరదాలు వేరు. ఇప్పుడు సూట్లు బూట్లు వేసుకుని సహాధ్యాయినుల చూపులకోసం కాపలా కాయడంతోనే, కాలమంతా గడిచిపోతుంది. అప్పుడు నాటకాలు వెయ్యడం వస్తాదుల్లాగా తయారై దారులు కాసి కొట్లాడుకోవడం సరదాలు. ఇందులో ప్రకాశంగారు పరిపూర్ణప్రజ్ఞులైనారు. కొందరు అమాయక యువతుల హృదయాల్ని కలవరపరిచారట. తాలింఖానా జట్ల కొట్లాటల కేసుల్లో కూడా ఇరుక్కున్నారు. ఇటువంటిజీవితం న్యాయమేనా అని అప్పుడప్పుడు మనస్సుకి తట్టినా, అటువంటి భావాల్ని దిగదొక్కి, ఇదే జీవితస్వారస్యం అని పునశ్చరణ చేసుకుని ముందుకి దూకేవారు.

దుర్భరదారిద్ర్యంలో కూడా ఈ నిర్లక్ష్య జీవనం, సాహసప్రమాదాలతో నిండిన పౌరుష జీవనం యువకుల్ని సులువుగా ఆకర్షించడం సహజమే. అయితే విశేష మేమిటంటే వయస్సు ముదిరిన తరవాత కూడా ఇటువంటి నిర్లక్ష్య జీవనం గడపడం, ధైర్యంతో స్థానికబలం గల వారినందరినీ ఎదిరించి ఎన్నిమార్లు పరాజయం కలిగినా తిరిగి తలెత్తి మరింతపౌరుషంతో పోటీచెయ్యడం. ఇటువంటి ధీరలక్షణాలున్న వారిని ఆంధ్రలోకం ఆకాశాని కెత్తుతుంది. ప్రకాశంగారు కళాశాలచదువు ముగించి చెన్నపట్నంలో లాకాలేజిలో చదివి సెకండ్‌గ్రేడ్ ప్లీడర్‌షిప్పు సంపాదించి రాజమహేంద్రవరంలో ప్రాక్టీస్ పెట్టాడు. అయితే నల్లలాంగ్ కోటు తొడిగాకేకాని చేతికర్ర పుచ్చుకుని ఊరికే ఉండడం ప్రకాశంగారికి అసాధ్యం. మున్సిపల్ రాజకీయాల్లో చొరబడ్డారు. ఆంధ్రదేశంలో రాజమహేంద్రవరం మున్సిపాలిటీ బహుపురాతనమైనది. ఆనాడు దేశంలో చెప్పుకోదగిన నాయకులంతా రాజమహేంద్రవరంమున్సిపాలిటీ ప్రసాదించినవారే. న్యాపతి సుబ్బారావుపంతులు మొదలైన హేమాహేమీల్ని ఎదిరించి వారిని తిప్పలు పెట్టి తాను తిప్పలు పడ్డాడు ప్రకాశంగారు. అనేకసార్లు ఓడిపోయి కొంతకాలానికి మున్సిపల్ కౌన్సిలరు అయినారు. ఆతరవాత మున్సిపల్ చైర్మన్ అయినారు. కాని ఆయన ఎన్నిక అధికారరీత్యా మూడుమాసాలు ఆమోదం కాకుండా చేశారు ప్రతికక్షులు. చైర్మన్‌గా పనిచేసే కాలంలోనే ఒక కేసుసందర్భంలో ప్రకాశంగారు చెన్నపట్నం వెళ్లినప్పుడు 'నువ్వెందుకు బారిష్టరు కాకూడదు' అని యథాలాపంగా సూచించారు ఒక బారిష్టరుగారు. వెంటనే నిర్ణయానికి వచ్చి లండన్ వెళ్లాడు.

లండన్‌లో లండన్ ఇండియన్ ఎసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. అక్కడ దాదాభాయి నౌరోజీ, రమేశచంద్రదత్తు, మొదలైనవారి పరిచయం ఏర్పడింది. ఆ సంఘానికి చెందిన గ్రంథాలయంలో రాజకీయస్వాతంత్ర్యాన్ని గురించిన గ్రంథాలు చదివేవారు. అప్పుడే లాలాలజపతిరాయ్, శ్యాంజీకృష్ణవర్మ మొదలైనవారితో సన్నిహితమైత్రి ఏర్పడింది.

లండన్‌లో చదువు పూర్తి కాగానే యూరప్ సంచారం చేశారు. అప్పుడే స్విట్జర్లండు, డెన్మార్కు మొదలైనదేశాల్లో గృహపరిశ్రమలు వ్యవసాయ పరిశ్రమ సహకారకార్యక్రమాలు పరిశీలించారు. స్విట్జర్లండ్‌లో గడియారాల పరిశ్రమ ముఖ్యమైనది. అది కూడా ప్రధానంగా గృహపరిశ్రమగానే ఉంది. డెన్మార్కులో పశువుల పెంపకం, వ్యవసాయ పరిశ్రమల్లో సహకారవిధానం చక్కగా వ్యాప్తి చెందింది. ప్రకాశంగారు ఉత్పత్తి వినిమయదారుల సమష్టి సహకార సంఘాల పద్ధతినిగురించి డెన్మార్కులోనే మొదటగా విన్నారుట. అప్పటినుంచీ భారతదేశానికి సహకారవిధానమే సవ్యమైన ఆర్థిక పరిష్కారమార్గమనే స్థిరాభిప్రాయం ఆయన కేర్పడింది. వస్త్రోత్పత్తి గృహపరిశ్రమగా వృద్ధిచెందగలదనే విశ్వాసం కలిగింది.

తిరిగి వచ్చి చెన్నపట్నంలో ప్రాక్టీస్ పెట్టారు. స్థానికబలం గలవారిని ఎదిరించి నిలిచారు. అపజయాలకు లక్ష్యపెట్టక పట్టుదలతో ప్రాక్టీస్ పెంచుకుంటూ వచ్చారు. అపారంగా ధన మార్జించారు. ప్రకాశంగారి రాజకీయాలతో పరిచయం సూరత్ కాంగ్రెస్‌తో ప్రారంభం. తిలక్ పక్షపాతి. అతివాదవర్గంతో చేరారు. ఆతరవాత గాంధీజీసిద్ధాంతాలు ఈయన్ని బాగా ఆకర్షించాయి. 1921 లో గాంధీజీ ఆదేశంపైన చెన్నపట్నంలో న్యాయవాదవృత్తిని విరమించినవారిలో ప్రకాశంగారు ప్రథముడు. కాంగ్రెస్ రాజకీయాల్లో ఉన్నప్పుడే శ్రీరాజగోపాలాచారిగారితోనూ చిత్తరంజన్ దాస్ గారితోనూ మైత్రి ఏర్పడింది. న్యాయవాద వృత్తి విడిచిపెట్టగానే స్వరాజ్య అనే ఆంగ్ల దినపత్రిక ప్రారంభించారు. అప్పటికి కాంగ్రెస్ ఉద్యమాన్ని, వాదాన్నీ ప్రతిఫలింపచేసే పత్రిక ఒక్కటీ చెన్నపట్నంలో లేదు. అందువల్ల పత్రిక ప్రారంభం కాగానే ప్రజల ఆదరాభిమానాలు లభించాయి. పత్రికానిర్వహణలో కూడా ప్రకాశంగారు పట్టుదల సాహసం ప్రదర్శించారు. ఆర్థికంగా బలంలేకపోయినా పత్రిక పట్ల ప్రజల విశ్వాసం అపారంగా ఉండేది. ఈ పత్రికలో ప్రకాశంగారికిందపనిచేసిన కోటంరాజు రామారావు, ఖాసాసుబ్బారావు, కృపానిధి ప్రభృతులు నేడు పత్రికా ప్రపంచంలో ఉన్నతిని పొంది అగ్రగణ్యులని పేరుపొందారు.

ఆ తరువాత సత్యాగ్రహాలు, కాంగ్రెస్ నిర్మాణకార్యక్రమ ప్రచారం, కారాగార వాసాలు చరిత్ర ప్రసిద్ధాలే. లాఠీఛార్జీలయి, కారాగార వాసానికి వెళ్లడంఅంటే కాంగ్రెస్ వాదులకి పుణ్యతీర్థయాత్రలాగో, వనభోజనాల లాగో ఉండేవి. కాని ప్రకాశంగారి తరహా వేరు. కారాగారాల్లో యోగసూత్రాలూ ద్రవ్యసమస్యలూ చదివేవారు. కారాగారంలో ఉన్నప్పుడు కూడా భోజనంకోసం ఎన్నడూ చెయ్యిచేసుకోవలసిన అవసరం లేకపోయింది.

రాజకీయ రంగంలో కూడా ప్రకాశంగారు సాహసాలకు పట్టుదలకు పోయి కొంత హాని తెచ్చిపెట్టుకున్నారు. అయితే హాని కలిగినా పరాజయం పొందినా ప్రకాశంగారివలె ధీరభావంతో సహించి పట్టుదలతో తలచిన కార్యాన్ని సాధించేవారు బహుకొద్దిమంది ఉంటారు. చెన్నపట్నంలో సత్యాగ్రహం సందర్భంలో ప్రకాశంగారు ధైర్యసాహసాలు ప్రదర్శించి కీర్తి నార్జించారు. పోలీసులు తుపాకులు గురిపెట్టి కాల్చడానికి సిద్ధపడినప్పటికీ గుప్పెడు ఉప్పుకోసమని ముందడుగువేసి జనాన్ని నడిపారు. పోలీసులు కూడా విస్తుపోయారు. అప్పుడే వారికి ఆంధ్రలోకం ఆంధ్రకేసరి అని కీర్తినామమిచ్చింది.

కాంగ్రెస్ పార్లమెంటరీ కార్యక్రమాని కంగీకరించాలని వాదించినవారిలో వీ రొకరు. ఎన్నికలు వచ్చాయి. చెన్నపట్నంనుంచి శాసనసభకి ఎన్నుకోబడ్డారు. శ్రీరాజగోపాలాచారిగారి ప్రభుత్వము రెవిన్యూమంత్రిగా పని చేశారు. జమీందార్ల రద్దుకి ప్రకాశంగారు చేసిన కృషి అపారం. త్వంలో పూర్వపత్రాలన్నిటినీ తిరగవేసి జమీందార్లకు జమీందారీ భూములపై యాజమాన్యపు హక్కులు లేవనీ, పన్ను వసూలు హక్కులు మాత్రమే ఉన్నాయనీ నిరూపించారు. జమీందారీలను గురించిన ప్రకాశం వేదిక వారి కృషికి నిదర్శనం. ద్వితీయప్రపంచసంగ్రామసమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా నిచ్చాయి. తిరిగి కాంగ్రెస్ నాయకులు అప్పటి మంత్రులు కారాగారవాసులైనారు. మళ్లీవిడుదలైనారు. రెండోసారి కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచినప్పుడు రాజగోపాలాచారిగారు రంగంనుంచి విరమించారు. ప్రకాశంగారు ప్రధాని కాకుండా

(20-వ పేజీ చూడుడు)

మన రాష్ట్రం మన దేశం

★ మధ్యతరగతి జనం జీవనోపాధి
★ విద్యాలయాలలో భాష-రాధాకృష్ణన్ సూచన

జనసామాన్యంకోసమే ఆధునిక రాజకీయాలు పుట్టాయంటారు. పూర్వకాలంలో బలాబలాల ననుసరించి రాజులు మారినా ప్రజల జీవనం నిరాటంకంగా కొనసాగిపోయేదనీ, ప్రజలను పరిపాలనా వ్యవహారాల్లో వదంతులు వినడం వ్యాపింప చెయ్యడంతప్ప అన్యత్రా జోక్యం ఉండేది కాదనీ, ప్రజాస్వామ్యయుగంతో ప్రజలకు పరిపాలనలో జోక్యం ఏర్పడిందనీ కూడా చెప్తారు. అంటే ఇప్పుడు పరిపాలించడం, పరిపాలించబడ్డం కూడా ఒకేసారి "సామాన్యజనుడి" పైన పడిందన్నమాట. అప్పటినుంచీ ఈ సామాన్య జనుడి సముద్ధరణ రాజకీయ నాయకులకు ఉపన్యాస విషయం, జీవితాశయం అయింది.

బ్రిటిష్‌ప్రభుత్వం ధర్మమా అని దేశంలో మరొక వర్గం తలెత్తింది. వారిని "మధ్యతరగతి జనులు" అంటున్నారు. వీరిని 'సుమాస్తా తరగతి' అంటే బాగుండిపోయేదే, కాని మధ్యరకం డాక్టర్లు, ప్లీడర్లు, టీచర్లు మొదలైనవారు కూడా ఈ తరగతిలో చేరతారు కాబట్టి, 'సామాన్య జనుడికీ,' భాగ్యవంతుడికీ మధ్య వేళ్లాడుతూఉన్న వీరిని మధ్యతరగతివారనే అందాం. వీరు చేతులు చాచి పై అంతస్తుకి ఎగబాకడానికి ఎంత ప్రయాసపడినా దేశీయార్థికస్థితి వీరిని కాళ్లు పట్టుకుని అంతకంతకి దిగలాగేస్తోంది. కొందరు వర్తకులు, హోటల్ యజమానులు పైకి ఎగబాకేసి మేడలెక్కి కూచోగలుగుతున్నారు. వీరిని మినహాయించి మిగతా వారిని మధ్యతరగతివారనవచ్చును,

ఈ మధ్యతరగతి వారి ముఖ్యలక్షణం ఏమిటంటే భేషజం. వీరు చేసేపని-ముఖ్యంగా గుమాస్తాగిరీ. వీరు అవసరవస్తువుల్ని ఉత్పత్తి చెయ్యరు. అనవసర (విలాసానికి పనికివచ్చే) వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యరు. రెండింటినీ కొని తెచ్చుకుని అనుభవిస్తారు. వీరి ముఖ్య కృషి టన్నులకొద్దీ కాగితాలు వ్రాసి పారెయ్యడం. (ఉత్పత్తిలోకి సంతానం ముఖ్యం. సంతానోత్పత్తి పేదలు కార్మికకర్షకులకంటేనూ, భాగ్యవంతులకంటేనూ ఈతరగతి వారిలో అధికం) వీరి ఖర్చుల్లో కెల్ల పెద్దఖర్చు పెళ్లిళ్ళకి. ఇంటిపెద్ద కనీసం రెండుసంవత్సరాల ఆర్జన ఒక్కొక్క కూతురుపెళ్లికి వినియోగించవలసి వస్తుంది. ఆర్జన, ఆస్తిపాస్తులు ఉన్నవానికంటె అధికంగా చెప్పుకోడం వీరి ముఖ్యలక్షణం. కులాచారాల్ని వొదిలేసినా, అన్యకులాలకు చెందిన నైనందువల్ల వృత్తులవరికి పోరు. కార్మికవర్గంలోవలె స్త్రీలు ధనార్జనకోసం ఇల్లు విడిచి రారు. మతాచారాలపట్ల శ్రద్ధాభక్తులు, విశ్వాసం సన్నగిల్లినా పండగలూ, పబ్బాలూ మృష్టాన్న భోజనాలతో జరుపుకోవలసిందే. అపరకర్మలకి సంతర్పణలు జరపవలసిందే.

ఇంతవరకూగల ఆర్థిక వ్యవస్థలో ఇవన్నీ కష్టంలేకుండా సాగిపోయేవి. ఇప్పుడు వస్తువుల ధరలు పెరిగిపోయి, మునుపు గృహవ్యయం అంతా కలిపితే ఇప్పుడు పాలఖర్చుకైనా సరిపోకపోయేసరికి, ఖర్చు ముందుకు ఆదాయం వెనక్కు లాగుతున్నాయి. ఖర్చులు తగ్గించుకోలేక అప్పుల్లోపడ్డం సంభవించింది.

ఈ మధ్యతరగతిజనుడినిగురించి కూడా ఈ మధ్య రాజకీయనాయకులికి చింత కలిగింది. భారతప్రభుత్వం (బ్రిటిష్ వారి హయాంలో) ఈ తరగతి వారి స్థితిగతుల్ని విచారించడానికి నిశ్చయించారు. అప్పుడు కేంద్రప్రభుత్వనియామకంలో ఉన్న గుమాస్తాల ఆదాయాలు ఖర్చులు గురించి వివరాలు సేకరించారు. 1945 లో రు 150 పైనా రు 300 లోపునా ఆదాయాలుగల వారి గృహవ్యయాల్ని పరిశీలించారు. దాదాపు నూటింట 20 వంతులు తప్ప మిగతా 80 వంతులమందీ అప్పుల్లో పడ్డారట. 1949 సంవత్సరానికి ఈ 20 మందిలో మరెంతమంది అప్పుల్లో పడ్డారో తెలియదు. ఆదాయానికి దగినట్లు ఖర్చులు తగ్గించుకోడం వీరికి చేతగావడం లేదట.

మధ్యతరగతివారు వృత్తికర్మలు చేసుకోవడం అవసరమని గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు సలహా ఇచ్చారు. శరీర పరిశ్రమ అవసరమైన వృత్తుల్ని సంకోచం విడిచి అవలంబించాలన్నారు. ఎటు చూసినా మోటార్ మెకానిక్కులుతప్ప మధ్యతరగతి వారిలో శరీరపరిశ్రమ చేసేవారు ఆట్టే కనిపించరు.

కార్మిక కర్షకుల ఆర్జన వృద్ధి కావడం వల్ల (వస్తువుల డిమాండ్ ఎక్కువై ధరలు పెరిగాయనీ, మధ్యతరగతివారి వృత్తి ఉద్యోగాల్లోకి క్రమక్రమంగా అన్ని కులాలవారూ ప్రవేశిస్తున్నారనీ, అందువల్లనే మధ్యతరగతివారిలో నిరుద్యోగం పెరిగి, ఆర్జనప్రమాణం తగ్గి వారి ఆర్థికస్థితి హీనమయిందనీ రాజగోపాలాచారిగారు చెప్పారు. ఇది కొంత నిజమే కావచ్చును. కాని మధ్యతరగతివారు వృత్తిపరిశ్రమల్లో చేరితే నిరుద్యోగసమస్య మితిమీరిపోవడం తథ్యం. మనదేశంలో పరిశ్రమలకిగాని వ్యవసాయానికిగాని సైన్యాలకిగాని బలగం లోపమైనది ఏకాలంలోనూ లేదు. పోతే పరిశ్రమలకిప్పుడు నిపుణులైన కార్మికులు కొరవైనారు. అందువల్ల, నిపుణుల శ్రేణికి శిక్షణ ఇప్పిస్తే కొంతవరకూ నిరుద్యోగసమస్య తీరుతుంది. దేశీయవస్తూత్పత్తీ పెరుగుతుంది. ఈ శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం అధికకృషి చెయ్యవలసి ఉంటుంది. ఇందులోకి ఈ మధ్యతరగతివారూ చేరతారు. కార్మికవర్గంలోనివారూ చేరతారు. అయితే ఈ శిక్షణకిముందు కొంతకాలం విద్యాభ్యాసం అవసరం. ఇక్కడే మధ్యతరగతివారికి ఇతరులకంటె అవకాశాలధికం. దేశంలో వస్తూత్పత్తికి వీరు తోడ్పడ్డానికి ఇదే మంచి మార్గం.

విద్యాబోధన భాష:


ఒక పెక జాతీయభాష నిర్ణయించడంలో తర్జనభర్జనలు జరుగుతుండగా విశ్వవిద్యాలయ సంస్కరణవిచారణసంఘం నివేదికను సమర్పించింది. హిందూస్తానీకి బదులు హిందీ పరిపాలన నిమిత్తం జాతీయభాషగా నిర్ణయించడానికి నెహ్రూ ప్రభృతులు అంగీకరించారట. అయితే ఇంగ్లీషునే 15 సంవత్సరాలవరకూ ఉపయోగిస్తూ ఈలోగా జాతీయభాష నభివృద్ధిపరిచి క్రమంగా ఇంగ్లీషుస్థానే వినియోగించాలని నిర్ణయించదలచినట్లు తెలుస్తోంది. శాసననిర్మాణం, న్యాయవిచారణ మొదలైనవాని దృష్ట్యా ఇది తప్పక అవసరం. ఇంగ్లీషుభాషని 15 సంవత్సరాలు కాదు పదిసంవత్సరాలైనా వాడరాదని వాదించేవారికి పై విచారణ సంఘనివేదిక ఎదురయ్యింది.

ఈ విచారణసంఘానికి అధ్యక్షులు సర్వేపల్లి రాధాకృష్ణగారు. సభ్యులు డర్హాం విశ్వవిద్యాలయ (ఇంగ్లండ్) వైస్ ఛాన్సెలర్, ఒక అమెరికన్ విశ్వవిద్యాలయాధ్యక్షుడు, టెన్నెస్‌వాలీ అథారిటీ పూర్వాధ్యక్షుడు. భారత ప్రభుత్వ విద్యాశాఖా కార్యదర్శి ఈ సంఘానికి కార్యదర్శి. ఈ సంఘం దేశంలోని ముఖ్య విశ్వవిద్యాలయాలను సందర్శించి, సమగ్రమైన నివేదికను తయారుచేసి భారతప్రభుత్వానికి ఈ వారమే సమర్పించారు. నివేదకవివరాలింకా పూర్తిగా తెలియవు. డా॥ రాధాకృష్ణగారు పత్రికాసమావేశంలో కొన్ని ముఖ్యసూచనలు తెలిపారు. వీనిలో ముఖ్యమైనది విద్యాబోధనభాషకు సంబంధించినది.

భాషవిషయంలో రెండు ముఖ్యాంశాలను విచారణసంఘం దృష్టిలో పెట్టుకున్నది. 1. విద్యాభ్యాససౌకర్యం, 2. జాతీయభాషాభివృద్ధి.

జాతీయభాషగా హిందీని (దేవనాగరిలిపిలో) వృద్ధిపరచాలని ఈ నివేదికలో సూచించబడింది. పరిపాలనాయంత్రాంగమూ, విద్యాలయాలూ హిందీభాషను వృద్ధిపరిచేవరకూ ఇంగ్లీషునే ఉపయోగించాలి. ప్రపంచ భాషల్లో అగ్రస్థానం వహించి వాఙ్మయాభివృద్ధికి, విజ్ఞానాభివృద్ధికి, భౌతిక శాస్త్రాభివృద్ధికి దోహదమిచ్చిన ఇంగ్లీషు భాషను అభ్యసించవలసిన అగత్యం ఎప్పుడూ

(20-వ పేజీ చూడుడు)




మాతృభాషలో విద్యనేర్పాలని తీర్మానించిన వివిధరాష్ట్ర విద్యామంత్రుల సభ

మద్రాసు రాష్ట్ర ఆస్థానకవులు

మద్రాసు ప్రభుత్వము, తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ, సంస్కృతాలలో, శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, శ్రీ యం గోవిందపాయి, శ్రీ నమక్కల్ రామలింగపిళ్లె, మహా మహోపాధ్యాయ కె. యస్. కృష్ణమూర్తి శాస్త్రిగార్లను, ఆయాభాషలలో ఆస్థాన కవులుగా నియమించి, ఈ ఆగస్టు 14 న సభచేసి వారికి ఆస్థానకవి బిరుదు సన్నదు లిచ్చారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిలుగారు మద్రాసుకు రాగల స్థితిలో లేనందున వారి తరఫున బెజవాడ గోపాలరెడ్డిగారు, వారికి గౌరవ పురస్సరముగ ప్రభుత్వ బిరుదాన్ని బెజవాడలో అందచేయగలందుకై ఆ లాంఛనాలను స్వీకరించారు.

తెలుగువారికి వెంకటశాస్త్రిగారి జీవితమూ, కవిత్వమూ, పరిచితాలే తక్కిన నల్గురు ఆస్థాన కవుల పరిచయాలు కూడా కొద్దిగా కొద్దిగా కలుగజేసుకొందాం.



కన్నడకవి శ్రీ గోవిందపాయి

స్వతంత్ర భారత ప్రభుత్వంలో కన్నడ భాషలో ఆస్థానకవిగా ఉండే గౌరవం ప్రప్రథమంగా శ్రీ గోవిందపాయిగారికి దక్కింది.

గోవిందపాయిగారిది, దక్షిణకర్నాటజిల్లాలోని మంజేశ్వరం. దక్షిణకర్నాటజిల్లా పూర్వము ఇప్పుడూ కూడా కన్నడకవుల ఉనికికి ప్రసిద్ధి చెందిన జిల్లాయే. రత్నాకరవల్లి, పర్తిసుబ్బా, ముద్దన్న కవులు, కన్నడ భాషను తమ కావ్యాలతో అలంకరించి, కొత్తకొత్త కవిత్వపు పోకడలకు పేరుపడి, ఒకొక్క రొకొక్క ప్రత్యేకతతో, ఆధునిక కర్నాట కవులకు మార్గదర్శకులై పేరు పొందారు. అందరిలోనూ ముద్దనకవి గద్యపద్య రచనల రెండింటిలోనూ విస్తృతంగా పేరు దెచ్చుకొన్నాడు. శ్రీగోవిందపాయి కవిత్వాన్ని ఆదిలోనే గుర్తించి, మంచి ప్రోత్సాహమిచ్చినవాడు ముద్దన్నకవిగారు.

శ్రీపాయి తన 16 వ ఏట, షేక్స్పియర్ నాటకాలను జీర్ణించుకొని, "వ్యాల్యునైటు" అన్న నాటకంలో రెండంకాలవరకు, పద్యపాదాలలో కర్నాటభాషలోకి అనువదించాడు. ఈ అనువాదాన్ని చదివి, ముద్దన్నకవి చాలా మెచ్చుకొని ఈ శిష్యునికి మంచి ప్రోత్సాహ మిచ్చాడు. 1902 లో సువాసిని" అన్న మంగళూర్ పత్రికలో ఈయనఖండకావ్యాలు రెండు ప్రకటిత మయ్యాయి. ఈయన ప్రతిభ ఆ కావ్యాలలోనే గోచరించసాగింది. ఆ నాటి నుంచి తరుచు కన్నడ పత్రికలన్నింటిలోనూ ఈయన రచనలు ప్రచురిత మాతూనే వచ్చాయి.

ఆధునిక కన్నడసాహిత్యంలో ఈయనకు ప్రముఖస్థాన మున్నది. కర్నాటకభాషలోని పేరుగల పత్రిక లన్నింటిలోనూ ఈయనరచనలు ప్రచురిత మైయే ఉంటాయి. ప్రత్యేకసంచికలవారంతా ఈయనపద్యాలో, పరిశోధక వ్యాసాలో, ఏదో ఒకటి తమ సంచికలలో అవసరంగా చేర్చుకొనేవారు.

ఒకరు తనను స్తుతించటము ఈయనకు నచ్చదు. ఎక్కువగా ఇల్లు కదలడు. కవిత్వసంచారాలు, లేనే లేవనవచ్చును. అందుచేత ఈయనతో ప్రజలకు ప్రత్యక్షపరిచయం చాలా కొద్ది.

గోవిందపాయి 23 మార్చి 1883 న మంజేశ్వరంలో మాతామహుల ఇంట జన్మించాయి. దక్షిణకనరాజిల్లాలో మంగళూర్‌కు 11 మైళ్ల దూరాన ఉంటుంది మంజేశ్వరం. తండ్రి తిమ్మపాయి. తల్లి దేవకమ్మ. వీరి వంశం సాకార్ బాప్పాయ్ కుటుంబం అని పేరున మంగళూర్‌లో ప్రసిద్ధిలో ఉన్న కుటుంబం. పంచగౌడులలో ఒకరైన సరస్వతి బ్రాహ్మణ వైష్ణవులు. వీరి పూర్వులు 16 వ శతాబ్దంలో పోర్చుగీస్‌వారి మతహింసలబారినుండి తప్పించుకోటానికై, గోవానుండి తరలివచ్చి, ఉత్తరదక్షిణ కన్నడ జిల్లాలలోనూ, దక్షిణాన కన్యాకుమారి అగ్రందాకానూ, చెదిరి నివాసాలు ఏర్పరుచుకొన్నారు.

మంజేశ్వరంలో ప్రాథమికవిద్యను ముగించుకొని హైస్కూలుచదువుకై గోవిందపాయి మంగళూరు వెళ్లారు. హైస్కూలుచదువు అయి మంగళూర్ కాలేజీలోనే ప్రవేశించారు. 1901 లో మంగళూరుకన్య శ్రీమతి కృష్ణాబాయి కౌమత్‌ను పెండ్లాడారు. తండ్రి మరణంవల్ల మూడేళ్లు చదువు ఆపుకోవలసి వచ్చింది. తర్వాత మళ్లీ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చేరి. బి. ఏ. లో ఇంగ్లీషులో ఘనుగా పాసయారు. సంస్కృతంలో కూడా అత్యధికంగా మార్కులు వచ్చాయి. కండ్లజబ్బువల్ల, అభిమానశాస్త్రంగా తీసుకొన్న గణితశాస్త్రంలో పరీక్షకు కూర్చోటానికి అస్కారం లేకపోయింది. ఆ వరుసను దేహంలో అనారోగ్యమూ, గృహంలో సన్నిహితుల వియోగాలు ఆయనకు సంభవించాయి. చివరికి బి. ఏ. పూర్తిచేసుకొనే ప్రయత్నంనుంచే ఆయన విరమించారు.

ఈయన కన్నడకవిత్వంలో ప్రాసనియమం లేకుండా పద్యాలువ్రాసి ప్రచురించినవారిలో ప్రథముడు. తక్కిన చాలా భాషల కవిత్వాలలో లేని ప్రాసనియమం కన్నడంలో మాత్రం ఎందుకా అని ఈయన ఎదురు తిరిగారు. దానితో ఒక పెద్దదుమారం రేగింది. కాని గోవిందపాయిగారు ఏమీ చలించలేదు. షేక్స్పియర్ సానెట్ రీతులను కూడా కన్నడ సాహిత్యంలోకి ఇమిడ్చారు.

1928 లో "గోమత, జైనస్తుతి" అని కర్నాటదేశంలో గోమటేశ్వర విరాడ్విగ్రహాత్రయాన్ని గూర్చి స్తుతిచేస్తూ కావ్యం రచించి, ప్రచురించారు. పుస్తకరూపంలో ఆయనరచన రావటం అదే ప్రథమం. ప్రాస లేని సంస్కృత వృత్తఛందస్సులలో ఆయన ఆ కావ్యం రచించాడు. 1930 లో తన ఖండకావ్యాల నన్నిటినీ సేకరించి, ఓమర్ ఖయ్యాం 'రుబాయితీ'లోని మొదటి 50 గీతాలను కూడా కలిపి, "గిల్లివిందు"—"చిలుకపిండు" అన్న పేరున ప్రచురించారు. 1931 లో యేసుక్రీస్తు అంతిమ దినాలనుకూర్చి, గొల్గోతా అనే కావ్యం ప్రారంభించి, పత్రికలలో భాగాలు ప్రచురిస్తూ, 1937 లో పుస్తకరూపాన్ని ప్రచురించారు.

పాళీభాషలో బౌద్ధసాహిత్యాన్ని ఎక్కువ చదవటంతో, బుద్ధదేవునిపై కావ్యం రాయాలని అనిపించి, "వైశాఖి" అనే కావ్యాన్ని రచించారు. ఈ కావ్యాలన్నీ ఎక్కువ మాత్రాఛందస్సులలోనే రచింపబడ్డాయి. ప్రకృతివర్ణనలో ఈయన అందివేసిన చేయి. సాంస్కృతిక దృక్పథమూ, పరమత సహిష్ణుతా, ఇత్యాది గుణవిశేషాలతో ఈయన రచన వర్ధిల్లుతూ ఉంటుంది. ఇంకా పుస్తకరూపం అందుకోకుండా, కన్నడపత్రికలలో ప్రచురించబడ్డ అనేక ఖండకావ్యాలు ఈయనవి సంపుటీకరించవలసినవి ఉన్నవి. "నందదీప" మని స్వభార్యావియోగాన్ని వర్ణిస్తూ ఏబది అరవది పద్యాల దాకా ఉన్నాయి.

జాతీయఉద్యమాన్ని ప్రతిబింబింపజేస్తూ అప్పటప్పట రచింపబడ్డ కావ్యాలు ఈయనకు జాతీయోద్యమాలలో స్థానం చేకూర్చాయి. "క్విట్ ఇండియా," "గాంధీజీ హత్య" సందర్భాలలో ఉత్తమమైన ఖండకావ్యాలు రచించి జాతీయ కవులలో అగ్రగణ్యుడైనాడు.



శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి

తన పూర్వుల చరిత్రను పరికించటంలో గోవిందపాయిగారు చారిత్రకపరిశోధకులైనారు. గోవా పోర్చుగీసుచరిత్రను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నిక, "సారస్వతుల" పేర్లన్నీ తెలుసుకొనేందుకు శాసనాలు తిరగవేయసాగారు. "గత చరిత్ర వెలుగులు" అని ఆంగ్లంలో వ్యాసాలు వ్రాశారు.

1926 నుంచే "హిందూ ఇండియా"ను గురించి ఆంగ్లంలోనూ కర్ణాటచరిత్రను గురించి కన్నడంలోనూ పరిశోధకవ్యాసాలు వ్రాశారు. ఇవి శతాధికంగా ఉన్నాయి. క్రీ. శ. రెండవ శతాబ్దంలో గ్రీకు ప్రహసనాలలో కన్నడభాషా ఘట్టాలను పరిశోధించి, విశదీకరించారు. గ్రీకు కోరస్ పద్ధతిలో "ఏకలవ్య" కథను ఏకాంక గీతిగా నాటికగా రచించారు. గోవిందపాయిగారు కవే, పరిశోధకుడే కాక, ప్రాచ్యపాశ్చాత్య భాషలలో ఇరువై రెండింటిలో ప్రవేశం కల భాషావేత్త.



శ్రీ నమక్కల్ వి. రామలింగంపిళ్లె

భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని, స్వాతంత్ర్యేచ్ఛనూ, కవిత్వానికి ముఖ్యవస్తువుగా చేసికొని, తమిళనాడులో జాతీయోద్యమాన్ని తమ గేయకవితలతో ఉజ్జ్వలం చేసిన ఆధునిక తమిళ కవులు భారతి, నమక్కల్ రామలింగంపిళ్లె లిద్దరూ, తమిళకవులశ్రేణిలో అగ్రస్థానం వహిస్తారు.

రామలింగంపిళ్లెగారు, గాంధీసిద్ధాంతములను హృద్గత మొనర్చుకొన్నవారు. సత్యాహింసలు, నిష్కామకర్మ, ప్రజలలో ఐక్యత, ఖాదీ, చరఖా, మద్యనిషేధము, హరిజనోద్ధరణము, గ్రామోద్ధరణము, మొదలగు సమస్త గాంధేయసిద్ధాంతములందును సంపూర్ణ విశ్వాసము కలవారు. ఇవన్నీ కూడా ఆయనకవితకు వస్తువు లయ్యాయి.

1889 లో, సేలంజిల్లా నమక్కల్ తాలూకాలో, ఒక మధ్యతరగతికుటుంబంలో రామలింగంపిళ్లెగారు జన్మించారు. తండ్రి శ్రీ వెంకట్రామాపిళ్లె, మోకనూర్ గ్రామఠాణాలో హెడ్‌కనిష్టేబు. ఆ తల్లికి వరుసగా ఏడుగురూ కుమార్తెలే. ముందెప్పుడో ఒక మగబిడ్డ పుట్టి, కొన్ని క్షణాలుమాత్రం బ్రతికి చనిపోయాడు. ఏడుగురు కూతుళ్ల తర్వాత మగబిడ్డ కలగటం తలితండ్రులకు చాలా సంతోషం సమకూర్చింది.

రామలింగంగారి చిననాడే భవిష్యదభ్యుదయసూచకమైన తెలివితేటలు కొంత కనిపించాయి. కాని కవిత్వంలోకన్న చిత్రలేఖనంలో ఎక్కువ అభిమానం కనబడేది. ఒక్క లెక్కలు తప్ప తక్కిన చదువులన్నీ బాగానే వచ్చేవి.

సేలంస్కూలులో మెట్రిక్యులేషను ప్యాసయి, తిరుచిరాపల్లి కాలేజీలో చేరారు. ఆటల్లో చదువుల్లో కూడా కొంత పేరు తెచ్చుకొన్నారు. కాని మరుసటి సంవత్సరమే చెవిజబ్బువలన చదువు మానుకోవలసివచ్చింది. తరువాత పెద్ద లాపరేషను చేయించినా కూడా, ఆ చెముడు పూర్తిగా పోలేదు.

కాలేజి వదిలాక, తన పెద్ద అప్పగారి కుమార్తె, శ్రీమతి ముత్తమ్మాళ్‌ను రామలింగంగారు వివాహమాడారు. ఆ దాంపత్యము రాను రానూ చాలా అనుకూలదాంపత్యంగా పరిణమించింది. కాని పెండ్లయిన పదునాలుగేళ్లకుకూడా వారికి సంతానం కలుగలేదు. ఆమె చెల్లెలినే మరొక కన్యనుకూడా వివాహం చేసుకోవలసిందని బంధువులు ప్రోత్సహించారు. కాని ప్రథమకళత్రం బ్రతికుండగా ఆయన రెండో పెళ్ళి చేసికోనని పట్టు పట్టారు. అంతలో ఆమె చనిపోయింది.

రామలింగంపిళ్లె తాలూకాఆఫీసులో గుమాస్తా పని చేశారు. తర్వాత ఉపాధ్యాయవృత్తి అవలంబించారు. ఆ తర్వాత చిత్రలేఖనం వృత్తిగా అవలంబించారు. 1912 లో జార్జిరాజు పట్టాభిషేకానికి ఢిల్లీదర్బారులో "పట్టాభిషేక" చిత్రాన్ని ప్రదర్శించి, స్వర్ణపతకం బహుమానంగా పొందారు.

అప్పుడప్పుడు కవిత్వంలో కృషి చేస్తూండేవారు. కాని పట్టుమని కూర్చుని వ్రాసిన పద్యాలు ఆట్టే ఉండేవి కావు. 1914 నుంచు కాంగ్రెసులో చేరారు. మహాత్ముని నాయకత్వాన సత్యాగ్రహం ప్రారంభమవటంతో ఒక్కసారిగా జాతీయకవిత్వం ఆయనలో పె

(22-వ పేజీ చూడుడు)

కథానిక:

కాందిశీకుడు

శ్రీ బులుసు వేంకటరమణయ్య

అవి కాశ్మీరంలో యుద్ధంజరిగే రోజులు!

పాకిస్తానుసేనలకూ, కాశ్మీర - యూనియన్ సేనలకూ పోరాటం చాలా తీవ్రంగా జరుగుతూ వుంది; రెండుపక్షాలకీ గెలుపులూ, వోటములూ విభిన్నప్రాంతాల్లో కలుగుతూ వున్నాయి. కాని యూనియన్‌సరిహద్దుప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులూ. సిపాయిలూ తగిన బందోబస్తు చేసి, ఇతరులని లోపల ప్రవేశించనివ్వకుండా, అనుమానం వున్న మనుషులమీద వోక కన్ను వుంచే వుంటున్నారు.

సాయంకాలం; అది శీతకాలం కావడం చేత చలి ఎలాంటి మొండివాళ్ళ నయినా గజగజ లాడించి విడిచి పెడుతున్నది. ఇంట్లోంచి బయటికి వస్తే మంచువలె గడ్డకట్టి కూర్చోవలసి నదే; అలాంటి సమయంలో ఒక జీపులో కొన్ని అవసరమైన వసువుల నుంచుకొని రెండవక్యాంపునుంచి మొదటిక్యాంపునకు సరదార్ భగవత్సింగూ, మిత్రుడు కురూపూ వెళ్లుతున్నారు. కురూప్ డ్రైవింగులో ఆరితేరినవాడు; వయస్సులో సింగుకంటే చాలా చిన్నవాడు; అతిధైర్య, సాహసాలు కలవాడు; అంచేత అలాంటి సమయంలో కూడా మీద వచ్చిపడు తున్న మంచుగడ్డలని తప్పించుకుంటూ చాలా ఎత్తుగా వున్న ఘాటీరోడ్డుమీంచి తన రథాన్ని విడిచిపెడుతున్నాడు.

కారు రెండుమైళ్ళపైచిలుకు నడిచింది. తర్వాత మరి కదిలింది కాదు; కురూప్‌ప్రయత్నం వ్యర్థమైంది; తీరా చూస్తే ప్లగ్గులు చెడిపోయి వున్నాయి; రేడియేటరు చాలా వేడి అయివుంది; మరమ్మత్తు చేస్తేనేగాని, ప్రయోజనం లేదు; రోడ్డుమీద వుండి పని చెయ్యడానికి సాధ్యం కాలేదు. ఏదేనా ఆశ్రయం - కుటీరం లాంటిదన్నా వుంటేనేగాని ఆ మంచులో నిలవడం అసాధ్యం!

వారా చుట్టుపక్కల చూశారు. నల్భైగజాల దూరంలో ఒక చిన్నకుటీరం కనబడింది; 'బతుకు జీవుడా' అనుకుంటూ అవసరమైన పనిముట్లతో ఆవేపు పరిగెత్తారు మిత్రులిద్దరూ.

ఆ కుటీరం చేరి చూసేసరికి, దాని తలుపు వేసి వుంది; దబదబా తలుపు కొట్టేసరికి, తలుపు మెల్లిగా వెనక్కి జరిగింది; అది వోక శూన్య కుటీరం! లోపల యెవ్వరూ లేరు. అప్పుడు వాళ్లు అర్థం చేసుకున్నారు అది మిలిటరీ క్యాంపువారి చిన్నకుటీరమంటూ. మట్టిపూసిన దాని కొడకల గోడలూ, జింకు పైకప్పూ అవీ, ఆ సంగతిని తెలుపుతూనే వున్నాయి.

భగవత్సింగు లోపల ప్రవేశించి జేబులోని అగ్గిపెట్టె తీసి వెలిగించాడు; అతనికి ఒకమూలని సగం కాలిన కొవ్వువత్తి కనబడింది. అతనికి చాలా సంతోషం అయింది; చీకటిలో ఎలా పని చెయ్యడం? అని అనుకుంటూ వుంటే దీపం దొరికిం దని చాలా సంతోషం కలిగింది. అది ఒక గంటదాకా వెలుగుతుంది; ఆలోగా పని పూర్తి కావచ్చును.

'ఈ రాత్రి మరి ప్రయాణం చెయ్యలేము; మంచుగడ్డలు గుట్టల్లాగ రోడ్డుకి అడ్డ మవుతూ వుంటాయి; వాటిని తప్పించుకుని, యిరుకుగా వున్న ఘాటీరోడ్డులో ప్రయాణం చాలా దుస్తరం' అన్నాడు కురూప్.

'..........'

'డ్రైవింగుకు భయపడి కాదు, నేను చెప్పడం! మీకంటె వయస్సులో చిన్నవాడ నవడం చేత, నేను చలినీ, మంచునీ సహించగలను. మీకే కష్టంగా వుంటుందని చెప్తున్నాను. వెచ్చగా యిక్కడ రాత్రిని గడిపి, పొద్దున్నే పోతే మంచిదేమో!'.

'మరో సంగతి; మనం ప్లగ్గులూ, అవీ బాగు చేసుకునే బయలుదేరతా మనుకోండి! మళ్లీ దారిలో రథం నిలిచిపోతే యేం చెయ్యడం! అక్కడ యిలాంటి కుటీరమన్నా వుంటుం దని యేం నిశ్చయం!'

'కురూప్! నువ్వన్నది బాగానే వుంది! మన వుద్యోగధర్మాన్ని మరచిపోకూడదు. మనకి యెన్ని చిక్కులు వచ్చినాసరే, వాటిని లక్ష్యం చెయ్యకూడదు. తుదకు ప్రాణాలు పోయినా సరే- మన గమ్యస్థానాల్లోనే కళేబరాలని పడవేసి మరీ ప్రాణం విడవాలి. నిజమైన భారతీయ సైనికుడి ధర్మం అదీ' అన్నాడు భగవత్సింగు.

అతను పనిముట్లను ముందుంచుకొని కురూప్‌తో- 'గాలి జోరుగా వీస్తున్నది. నువ్వు తలుపు గడియపెట్టి, కిటికీమాత్రం తెరచివుంచి కొంచెం రెస్టు తీసుకో' నాకు మెకానిజం బాగా తెలుసు; నేను వీటిని బాగు చేస్తాను. నువ్వు రథం నడుపుదువుగాని' అని చెప్పి, తనపని ప్రారంభించాడు.

కురూప్ ఒక బీడీ ముట్టించి పచారుచేస్తూ కిటికీలోంచి ప్రకృతిని పరిశీలిస్తున్నాడు. అతని మనస్సులో మరేమీ ఆలోచనలు లేవు; నిర్విచారంగా, అతను బీడీమీద బీడీ ఆహుతి చేస్తున్నాడు.

ఇంతలో ఎవరో ఆ తలుపును దబదబా కొట్టారు; కొంచెంసేపటిదాకా ఎవరూ తలుపు తియ్యలేదు. 'చాలా చిక్కులో వున్నాను; కొంచెం ఆశ్రయం కావాలి' అని వినబడగా భగవత్సింగే లేచి వెళ్ళి తలుపు తీశాడు.

అప్పుడు ఒక పొడుగాటి మనిషి, కళ్ళద్దాలతో, ఒక హేటుతో ఉన్నిదుస్తులతో లోపల ప్రవేశించాడు. బొల్లి శరీరంనిండా వ్యాపించి వుండడంచేత, ముఖమూ, చేతులూ (అవే కనబడుతూ వుండడంచేత) చాలా తెల్లగా వున్నాయి.

'మీకు వచ్చిన ఆపద యేమిటి?' అనే అర్థంతో సింగు అతనివేపు చూశాడు.

తాను ఆశ్రయించినవారు మిలిటరీవాళ్ళవడం చేత - బతికి పోయా ననే అభిప్రాయంతో దీర్ఘంగా నిశ్వసిస్తూ అతను 'నేను చాలా దూరాన్నుంచి - పాకిస్తానువాళ్ల చేతుల్లోంచి తప్పించుకుని వస్తున్నాము. అదృష్టవశాత్తూ నా కొక కారు దొరికింది. మూడుమైళ్ళ దూరంలో దాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. చెడిపోవడం చేత.' అని అన్నాడు.

సింగు తనపని చేసుకుంటూనే వింటున్నాడు; కురూప్ నిదానించి చూస్తున్నాడా వ్యక్తిని, పరిశోధకుడిలాగ.

'ఈదగ్గిరగా వున్న కారు మీదేనను కుంటాను. నేను యీ రాత్రే మొదటిక్యాంపు దాటి యూనియనులో వున్న గ్రామం చేరుకోవాలి. మీరు దయచేసి నన్ను అక్కడికి దిగబెట్టాలి. మీ మేలు మరిచిపోను.' అన్నాడు.

'భయం లేదు; ఈ రాత్రి యిక్కడే గడపి వుదయాన్నే మీరు వెళ్ళొచ్చు. ఇక్కడ శత్రువుల భయం ఏమీ లేదు. కళ్లు మూసుకుని మరీ వెళ్లవచ్చు.

'అలా కాదు. ఈ రాత్రే నేను. వెళ్లి తీరాలి. మా వాళ్లు నాకోసం బెంగపెట్టు కుంటారు, దయయుంచి......'

అలా అంటూ వుండగానే డబడబ మనే పెద్ద శబ్దం అయింది. అదేమిటో అంటూ గబగబా ఆ కొత్తవ్యక్తి కిటికీదగ్గిరికి పోయి చూశాడు! వాన పడుతున్నది.

'అమ్మో! పెద్దవాన పడుతున్నాదే' అంటూ అతను డబుల్ న్యూమోనియా వచ్చినవానివలె చాలా భయపడుతూ వచ్చి సింగువద్ద ముణుచుకుని కూర్చున్నాడు.

ఈ వ్యక్తిని పరిశీలిస్తున్న కురూప్ ఒక చిన్న నవ్వు నవ్వుకున్నాడు.

'ఫరవాలేదు; ప్లగ్గులూ అవీ బాగు చేశాను; వాన ఉద్ధృతం తగ్గేక మనం ప్రయాణం చెయ్యొచ్చు; అంతగా తగ్గకపోతే యీ రాత్రి యిక్కడే కాలం గడుపుదాం; పొద్దున్నే పోవచ్చు' అన్నాడు సింగు.

'ఈ వానను చూస్తే నాకూ అదే మంచిదని యిప్పుడు తోస్తున్నాది.' అన్నాడా వ్యక్తి.

'ఈ రాత్రి యెలాగన్నా వూరు వెళ్లి తీరాలన్నారుగదా! మరి అవసరం అట్టేలేనట్టే గదా!' అన్నాడు కురూప్.

'వెళ్ళవలసిందే! వర్షమయితే యెలా వెళ్ళడం' అంటూ ఆ వ్యక్తి కొంచెం గొణిగాడు.

మరో పావుగంట గడిచింది.

వర్షం వెలియలేదు; కాని ఉద్ధృతం కొంత తగ్గింది.

సింగు సామాను మూటకట్టాడు. కురూప్ మోటురు దగ్గిరికి దారి తీశాడు.

వాళ్ళిద్దరూ కాందిశీకుడ నంటూ చెప్పిన ఆ వ్యక్తివైపు చూశారు.

'ఇంతవర్షంలో రాలేను బాబూ, ఈ రాత్రి యెలాగో యీ గుడిసెలోనే గడుపుతాను' అని అత నన్నాడు

వారు కారు దగ్గరికి వెళ్ళి, ప్లగ్గులనీ వాటినీ సరి చేశారు; బండి స్టార్టవడానికి సిద్ధంగా వుంది.

ఇంతలో ఒక టార్చిలైటువెలుగు వారిమీద పడింది. ఆ లైటు వేసినవాడు పత్తేదారు కరంసింగు.

అతన్ని పోల్చి భగవత్సింగు నవ్వేశాడు.

'హలో. భాయీసాబ్! మీ కీ చుట్టుపక్కల యవరన్నా ఒక మనిషి కనబడ్డాడా! ఒక ఆసామీ శత్రుపక్షంవాడు మన ఆచూకీ తియ్యడానికి రెండురోజులనుంచీ అనేక వేషాలతో తిరుగుతున్నాడు' అన్నాడు పత్తేదారు సింగు.

'పొడుగ్గా నల్లగా వుంటాడు; వూలుదుస్తులు ధరిస్తాడు. బొచ్చుటోపీ;' అందుకున్నాడు అతని పక్కనే నిలిచి వున్న తాబేదారు ధరంవీర్.

'కళ్లజోడు ధరించి వున్నాడా?' అన్నాడు కురూప్.

'లేదు;' అన్నాడు ధరంవీర్.

కురూప్ కుటీరంవైపు చెయ్యి చూపించి 'అందులో పరిశోధించండి' అన్నాడు.

పత్తేదారు తన యిద్దరుతాబేదార్లతోనూ, ఆ గుడిసెవైపు వెళ్లాడు.

భగవత్సింగుకు ఇదేమీ అర్థం కావటం లేదు.

'ఏమి, కురూప్! వాళ్లని మతాబా కాల్పించావే! పాపం! ఆకాందిశీకుణ్ణి కొంపతీసి వీరు పట్టుకోరు గద! పాపం అమాయకుడు! వర్షమంటేనే బెదిరిపోయే పిరికివాడు!' అన్నాడు సింగు.

'పాపం! వాడి అమాయకత్వాన్ని మీరే మెచ్చుకోవాలి!'

'అయితే పత్తేదారుకి కావలసిన వ్యక్తివాడే నంటావా?'

'సందేహం లేకుండా!' మీరు గమనించలేదు; కాని, నేను కనిపెడుతూనే వున్నాను వాడి వాలకం? అదంతా వేషం! మేకప్! నల్లదేహానికి తెల్లరంగు పూశాడు; పోలిక తెలియకుండా వుండేటందుకు హేటూ, కళ్లజోడూ పెట్టాడు; మొదట- అర్జంటుగా పోవాలనీకూడా వర్షం రావడంచేత- మేకప్ కరిగిపోయి రహస్యం బయటపడుతుం దని గుడిసెలోనే కూర్చున్నాడు అంచేతే- వర్షమంటే అంత భయం!

'అరి వీడి తస్సా గొయ్యా! అయితే- అంత ధైర్యంగా ఎలా తలుపులు తట్టే డంటావు!'

'వాడు గుడిసెవెనకాతల దాగుకున్నాడు, మనం వస్తూవుండడం జూసి; మనం తలుపులు వేసుకున్నాక, ద్వారందగ్గిరకి వచ్చి మనమాటలు విని, ధైర్యం తెచ్చుకున్నాడు; నేను కిటికీలోంచి చూస్తూనే వున్నానుగా! రోడ్డుమీద నుంచి వాడు రానేలేదే!'

జీపు స్టార్టయింది.

భగవత్సింగు వెనక్కి చూశాడు; టార్చిలైటు సాయంతో పత్తేదారూ, అతని తాబేదార్లూ ఆ నూతనవ్యక్తిని కట్టి యీడ్చుకురావడం చూచాయగా అతనికి కనబడింది!

కథానిక:

"రిక్షావాలా"

శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు

"పిల్లా! నేను పట్నం పోతా!"

"నువ్వు పట్నంపోతే నా గతి ఏమవుతుంది మామా?"

"మనవూరు పాడుబడింది. కలిగినవాళ్లల్లా పట్నానికి ఎగబాకారు. ఏదో సంసారం గడవాలంటే నేను పట్నం పోక తప్పదు-"

"అయితే నీతో నేనుగూడా వస్తా మామా."

"నేను పోగానే పట్నంలో కొలువు దొరుకుతుందో లేదో—నువ్వు యిప్పుడే నాతో వస్తే యిద్దరం అష్టకష్టాలు పడవలసి వస్తుంది. అందుకోసం, నేను పోయి కొలువు చూసుకున్నతరువాత నేనే వచ్చి నిన్ను పట్నం తీసుకుపోతా."

"లేదు మామా నన్ను వదలి పెట్టి పోకు— నువ్వు లేకపోతే నేను బతకలేను— ఈ కసాయి వాళ్లు నన్ను బతకనివ్వరు-"

అవి మతపాక్షికత్వం ప్రబలంగా వ్యాపించి ఉన్న రోజులు. అప్పట్లో దోపిడులు, గృహదహనాలు, సంస్థానం అంతటా చెలరేగుతూ ఉండినవి. కాని రామచంద్రపురం ఒక కుగ్రామం. సంస్థానానికి ఒక మారుమూలలో ఉంటుంది. అందువల్ల అక్కడికి మతపాక్షికత్వజంఝామారుతం ఇంకా వీచలేదు. ఇప్పుడో అప్పుడో గ్రామం, మతావేశపరులయిన గుండగులకు బలి అవుతుం దని ప్రజలు భయపడుతూ ఉండినారు- ఫలాని పల్లెటూరును దోచుకున్నా రనీ, ఫలాని గ్రామానికి నిప్పంటించార నే వార్తలు రోజూ ఆ గ్రామానికి కొల్లలుగా చేరుతున్నాయి. రైతులకు పంటలమీద శ్రద్ధ తగ్గింది. తదితర అలగాజనానికి గ్రామ వృత్తులపైన నైరాశ్యం కలిగింది. ధనవంతులు గ్రామాన్ని వీడి పరదేశ పంచలను పడుతున్నారు. బీదసాదలకు, గ్రామాన్ని వీడి వెళ్లడంమాట అటుంచి, కరువు కాటకాలవల్ల, అల్లరిమూకల ఘాతుకకృత్యాల వల్ల బ్రతుకు నీడ్వడమే దుర్భరమైపోయింది. పాపం బీదవారు ధనాభావంతో పరప్రాంతాలకు వెళ్లలేక గుడిలో మెల్ల అని బ్రతికి బట్ట కడితే చాలు ననే భావంతో పట్నవాసాలకు చేరుకుంటున్నారు. పాపం ఎంకడు పరిస్థితులన్నీ గమనించి, పట్నానికి వెళ్లి జీవనోపాధిని చూసుకోవడమే శ్రేయస్కర మని భావించాడు. భార్యాభర్తలు యిద్దరూ వెడితే, కూలీనాలీ దొరకక, నానా అవస్థలపాలు కావలసి వస్తుందేమో ననే భయంకొద్దీ, భార్యను అప్పటి మట్టుకు ఊళ్లోనే వదిలి వెళ్లడం మంచి దని నిశ్చయించుకొని ఆమెను ఒప్పించడానికి పూనుకున్నాడు.

"పిల్లా! మనం ఇక ఈఊళ్లో ఉండలేము. మనకు తెలిసినవాళ్లల్లా పట్నవాసాలకు చేరుకున్నారు. పట్నానికి వెళ్లిన, వాళ్లను వెతికి, కూలో, నాలో సంపాదించి, ఒక నెలరోజుల తరువాత నేనే స్వయంగా వచ్చి నిన్ను తీసుకొని వెడుతా! అంతవరకు నువ్వు ఏదో విధంగా ఓపికపట్టి ఈఊళ్లోనే ఉండడం మంచిది. లేకపోతే పట్నంలో యిద్దరమూ పొట్టగడవక నానా కష్టాలూ పడవలసి వస్తుంది."

"మామా! మనకు కష్టాలు ఏమైనా కొదవా! 'కో'అంటే కోటికష్టాలు వచ్చి పడుతాయి. కష్టాలను ఈడ్వడం తప్పదు- అందువల్ల, యిద్దరం ఒకే చోట ఉండి వాటిని ఎదుర్కోవడం మంచిదని నాకు తోస్తున్నది."

"అది నిజమే— కాని మనదగ్గర ప్రస్తుతం డబ్బేమీ లేదు. వెళ్లీ వెళ్లడంతోనే యితరుల పైన పట్నంలో ఆధారపడవలసి వస్తుంది. మన మెన్నడూ దేహీ అని ఇతరులను యాచించి యెరగము. మగవాడిని నేను ఎన్నికష్టాలైనా సద్దుకుంటాను. కాని నువ్వు ఈ అవస్థలన్నీ పడలేవు. అందువల్ల నువ్వు ఇక్కడే వుండిపోవడం మంచిది."

"మామా! అయితే నువ్వు ఎన్నిరోజులకు వస్తావు?"

"పిల్లా నేను మాత్రం నిన్ను వదిలి ఎక్కువ రోజులు వుండగలనా నాలుగురాళ్లు సంపాదించడంతోనే ఇక్కడికి వచ్చి వాలనూ?"

ఎంకి కాపురానికి వచ్చి, తీరా ఒక సంవత్సరమైనా కాలేదు. అంతలోకే. ఈ అల్లరు ఉప్పెనకుమల్లె వచ్చిపడ్డాయి. చల్ల కదలకుండా గడుస్తున్న సంసారం, ఒక్కమాటె తలక్రిందు లైంది. బ్రతుకు నీడ్వడమే కష్టంగా పరిణమించింది. భర్త వెళ్లకతప్ప దని తెలియడంతోనే, అఘాటుపాటున ఎంకి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. ఎంకడి ఎడబాటు, ఎందుకో దుర్భరంగా తోచింది. పెద్దపెట్టున గొల్లుమంటూ ఎంకి, ఎంకడి కండలుతీరిన

(25-వ పేజీ చూడుడు)

పండ్ల పరిశ్రమ

ఈనాడు కాయగూరలను, పండ్లను ఫలరసాలను, నిలువఉండునట్లు చేసి, టిన్నులకు డబ్బాలకు ఎక్కించి, చెడిపోకుండ కాపాడటం వ్యవసాయక పరిశ్రమలలో ఒక ముఖ్యపరిశ్రమగా తయారయింది. జనుల ఆరోగ్యాన్ని దేహపుష్టిని కాపాడేందుకు ఫలరసాలు చాలా అవసరమని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఒక ఋతువులో మాత్రమే లభించగల ఫలసాయాలని, సర్వకాలాలకు అనుకూలంగా ఉండేట్లు నిక్షిప్తపరిచి, ప్రజలకు ఆరోగ్యకరమైన భోజనం లభించేట్లు చేసే ప్రయత్నంలో, ఈ పరిశ్రమ ఈ మధ్య బాగా వృద్ధి పొందింది. అదీకాకుండా, కొన్ని దేశాలలో కొన్ని ఋతువులలో మాత్రమే దొరకగల ఫలసంపదను, టిన్నులలో శాశ్వతంగా చెడిపోకుండా భద్రపరిచి అన్ని దేశాలకూ అన్ని కాలాలకు పనికివచ్చేటట్లు పంపిణీలు చేసేందుకు ఆయాదేశాలన్నిటా ఈ పండ్ల పరిశ్రమల కంపెనీలు వెలిశాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండు తదితర దేశాలలో ఈ పరిశ్రమ చాలా వృద్ధిపొందింది. జీవన ప్రమాణాలు హెచ్చుగా ఉన్న ఈ దేశాలలో ప్రజలు తమ భోజనంలో ఎక్కువ ఈ "టిన్నుల ఫ్రూట్స్"ను, డబ్బాలలో భద్రపరచిన ఫలాలను ఫలరసాలనే, ఎక్కువ వాడుతారు. కాయగూరలు కూడా ఇల్లా టిన్నులలో భద్రపరిచి అమ్మటం కూడా ఇక్కడ విరివిగా ఉంది. ఫలరసాలే కాకుండా, వాట్లతో చేసే, మురబ్బాలు లేహ్యాలు, చోష్యాలు, అన్నీకూడా వీరికి టిన్నులలో లభించే ఉపులుపాటు, ఈ కంపెనీల మూలంగా ఎక్కువగా కుదిరింది.

మన మామిడికాయలు, నిమ్మ, నారింజ, జామ, అనాస, పనస, ద్రాక్ష, మొదలైనవాటి బద్దలను రసాలకూ, ఈవిధంగా టిన్నులలో భద్రపరిచి చాలా లాభం పొందవచ్చు. దేశంలోని ఆహారసమస్యను తీర్చేందుకు కూడా ఇల్లాంటి కంపెనీలు బయలుదేరితే చాలా ప్రయోజనకరం కావచ్చును

పండ్ల పరిశ్రమ వృద్ధి కావాలంటే, ముందు కొన్ని పక్కవాటు పరిశ్రమలు కూడా వృద్ధి పొందాలి. టిన్నురేకుల పరిశ్రమ, గాజుపరిశ్రమ, మొదలైన డబ్బాలు సీసాలూ తయారుచేసే పరిశ్రమలు కూడా ఈ ఫల, ఫలరసాలను భద్రపరిచేందుకు అవసరమౌతాయి.

మన రాష్ట్రంలో

మనరాష్ట్రంలో ఈ పరిశ్రమలు ఇంకాచాలా బాల్యస్థితిలో ఉన్నాయి. పండ్లను డబ్బాలకెక్కించటం, మురబ్బాలు, రసాలు, హల్వాలూ తయారుచేయటం, ఇది చేసే ఫ్యాక్టరీలు ఒకటి రెండుకన్న ఎక్కువ లేవు. ఊరుగాయలు డబ్బాలకెక్కించి అమ్మే చిన్న చిన్న కంపెనీలు రాష్ట్రమంతటా అక్కడక్కడ కొన్ని ఉన్నాయి, కాని అవైనా పెద్దపరిశ్రమలుగా లేవు. ఫలవృక్షసంపద ఇంత ఎక్కువగా కల రాష్ట్రంలో, నిజంగా ఈస్వల్పకృషిని పరిశ్రమ అనేందుకు, తాహతు చాలదు. అన్నిరాష్ట్రాలకన్నా మద్రాసు రాష్ట్రంలో ఫలశాకాల పంటలు ఎక్కువ.

ఆయాఋతువులలో పండే ఫలాలు, ఇక్కడ జనానికి సమృద్ధిగా చాలగా, పైనరాసులు రాసులుగా మిగిలిపోవటం కద్దు. ఇవి నిలవఉండటానికి వీలులేని ఈరూపంలో రవాణాలకుగాని, దాచుకోటానికిగాని పనికిరావు. వీని నెల్లా ప్రయోజనకరంగా చేయాలా అన్న సమస్య గత ఆరేండ్లుగా మద్రాసు ప్రభుత్వదృష్టిని ఆకర్షించింది. మామిడి, నారింజ, నిమ్మ మొదలైన ఫలాలు, ఫలరసాలు కూడా ఉపయోగించేవి అనేకం మనరాష్ట్రంలో మిగుల పండుతాయి. ఈ ఫలరసాలను భద్రపరచే పరిశోధనలు, ఫలాలనుంచి తయారుచేయగల ప్రయోజనకరమైన పదార్థాలేవేవో కనుగొనే పరిశోధనలు చేసేందుకు, వ్యవసాయశాఖవారి ఆధిపత్యంక్రింద కోడూరు (కడపజిల్లాలో) ఒక ప్రభుత్వ ఫలపరిశోధనశాల నిర్మించబడ్డది. ఈ రాష్ట్రంలో విరివిగా పండే పళ్లను డబ్బాలకెక్కించి భద్రపరచటం విషయాలు కూడా అక్కడ పరిశోధనలు జరుపుతున్నారు.

ఈ ఫలాలలోనుంచి తయారయ్యే వివిధభక్ష్యశాక పదార్థాలను కూడా డబ్బాలలో కొద్దికొద్దిగా ప్రభుత్వం అమ్మకానికి పెట్టుతూంది. వాట్ల అమ్మకం చాలా ప్రోత్సాహజనకంగా ఉన్నది.


మనరాష్ట్రంలో పండే పళ్లలో, ఎక్కువగా పండేవి, మామిడి, అరటి, నారింజలు గణనలోకి వస్తాయి. పనస, ద్రాక్ష, అనాస, జామ మొదలైనవి కూడా భద్రపరచవచ్చును.

ఈ పండ్లపరిశ్రమ ప్యాక్టరీలలో తయారయ్యే, ఫలరసాలు, క్రష్‌లు, మొదలైనవి చాలా ముఖ్యమైనవి కూడా ఉన్నయి. సాతుకుడి, నారింజలనుంచి, నారింజరసం, గజనిమ్మరసాలు, లెమన్ స్కాష్, లైమ్‌జ్యూస్ కార్డియల్, అనాస మురబ్బా, ముక్కలరసం మామిడిపండ్ల రసాలు, ముక్కలతోసహా రసం, ఇల్లాంటివన్నీ సీసాలకూ డబ్బాలకు ఎక్కించి భద్రపరిచి అమ్ముతున్నారు. పండ్లరసాలనుంచి తాం ద్ర[illegible] లేహ్యాలు, హల్వాలూ కూడా, శాస్త్ర[illegible] యుక్తంగా, పరిశోధనానుభవాలతో, తయా[illegible] చేసి అమ్ముతున్నారు. ఈ తయారీల ప్రకరణా[illegible] చాలాచోట్ల ఇళ్లల్లో ప్రత్యేక శ్రద్ధలతో పూర్వ[illegible] నుంచీ చేస్తూవచ్చినవిగా ఉంటూన్నవి కూ[illegible] ఉన్నవి. మామిడి, పనస, ఆపిల్, ద్రాక్ష-అల్ల[illegible] ద్రాక్ష-నిమ్మ మురబ్బా, ఇల్లాం[illegible] జంట ఫలరసాల ముక్కల ముకబ్బాలు కూ[illegible] తయారీలో ఉన్నాయి. ఈ పరిశ్రమలన్నీ చా[illegible] లాభకారి పరిశ్రమలే.


ఊరుగాయలు కూడా, పండ్ల పరిశ్రమ[illegible] పాటు డబ్బాల సీసాలలో కెక్కించి అమ్మ[illegible] లకు పెట్టటానికి కూడా మనరాష్ట్రంలో చా[illegible] వీలున్నది. మామిడి, నిమ్మ, దబ్బ, మొదలై[illegible] ఊరుగాయలే కాకుండా కాయగూ[illegible] ఊరుగాయలుకూడా పెట్టవచ్చునని పరిశో[illegible] నలు జరుగుతున్నాయి. వీట్లలో, భిన్నభి[illegible] తత్వాలకూ, ఆరోగ్యాలకూ సరిపడే వి[illegible] రుచులతో ఊరుగాయలు తయారుచేసి అవ[illegible] గలిగేందుకు చాలా అవకాశముంది. ఫల, ఫ[illegible] రసాల భద్రపరిచే పరిశ్రమతో, పక్క పరిశ్ర[illegible] లుగా, నారింజ, నిమ్మ, మొదలగు నూనెల[illegible] తయారుచేసే పరిశ్రమలుకూడా వృద్ధిచేసుకో[illegible] వచ్చు.

మనరాష్ట్రంలో ఈ పరిశ్రమను వృ[illegible] పొందించటం చాలా అవసరం.


(మద్రాసు ప్రచారశాఖ పంపిన జి. యస్. సిద్దప్పగారి వ్యాసం ఆధారంగా. వ్యాసము. చిత్రములు ప్రచారశాఖ వారి సౌజన్యముతో




ఫల పరిశోధకశాస్త్ర ప్రయోగశాలలో కొన్ని ఉపకరణాలు



పండ్లరసాలు తీసేయంత్రము, సీసాలలో రసం ఎక్కించాక కార్కులు బిగించే యంత్రమూ రెండూ చిత్రంలో ఉన్నవి.



ఫలపరిశోధకశాస్త్రప్రయోగశాలలో ఉపకరణాలు



డబ్బాల 'స్కేలింగ్' యంత్రము




ఫలముల, ఫలరసాలనుంచి తయారుచేసిన వస్తువుల టిన్నులు
సీసాలు ఉంచిన స్టోరు



చాందా. జిల్లాలోని విహద్ కాందిశీక పునరావాసకేంద్రం. ముల్తాన్‌నుంచివచ్చినవారు వ్యావసాయిక కుటుంబాలవారికి ... ఇక్కడ వృత్తిచూపించారు. వృద్ధుడు కొంచెం స్థాయి చిక్కి శాంతిగా హుక్కా పీలుస్తున్నాడు.



నిలోఖేరీ కాందిశీకపునరావాసకేంద్రంలో వృత్తివిద్యలు నేర్పుతున్నార



నిలోఖేరీ కాందిశీక పునరావాస కేంద్రస్త్రీలు కుట్టుపనీ, అల్లికపనీ నేర్చుకుంటున్నారు.

★


భారత ప్ర
నిర్మాణ కార



లో ఖేర్ కాందిశీక పునరావాస కేంద్రంలో అనేకమందికి కాందిశీకులకు ఆవాసాలు కల్పించబడివున్నయ్. ఫ్యాక్టరీలలోనూ, కర్మాగారాలలోనూ తమంత తాము ఉద్యోగాలు సంపాదించుకోడానికి అనువుగా సాంకేతిక విద్యలూ, వృత్తి విద్యలూ నేర్పబడుతున్నయ్. కాందిశీకుల కుర్రవాళ్లు ఆటవస్తువులు తయారు చేయటం నేర్చుకుంటున్నారు.



భారతప్రభుత్వంవారు ఖనిజవిధానం ప్రకారం ఒకేవిధ
ఆలోచిస్తున్నారు. గనులవిషయంలో ఏర్పాటైవున్న నిపుణ
గనులలో పనిచేస్తున్న స్త్రీ




ాలీక్కో తయారుచేయటం నేర్చుకొంటున్న కాందిశీకులు.

రాజస్థాన్‌లో రిక్రూటింగ్ ప్రచారం—ఈమధ్య జయపూర్ నెహ్రూ పార్కులో భారత సైన్యంలో ప్రజలు చేరవలసిన అవసరాన్ని వెల్లడించే నిమిత్తం ఒక సైనికసంబంధ ప్రదర్శనాన్ని ఏర్పాటు చేశారు. దీనినిచూడటానికి సర్వసేనాని జనరల్ కరియప్ప, రాజస్థాన్ రాజప్రముఖ్, కూచ్ బీహార్ మహారాజు మొదలైనవారు వచ్చారు.



భుత్వ—క్రమాలు

మ్యాపునా అనే చోట ఇండియన్ ఎగ్రికల్చరల్ ఇన్‌స్టిట్యూట్ వారు 35 ఏళ్లుగా భూసార సంరక్షణను గూర్చి ప్రయోగాలు చేస్తున్నారు. ఇందులో డెన్మార్కునుంచి తెప్పించి ఇండియాలోని పరిస్థితులకు అనుకూలంగా సిద్ధం చేయబడిన నూర్పిడి యంత్రం వున్నది. ఇటువంటి యంత్రాన్ని సిద్ధపరచాలంటే 15 వేల రూపాయలు అవుతున్నది. ఇది ఒకగంటలో 15 లేక 20 మళ్ళ ధాన్యాన్ని నూర్చి ఇవతల పెడుతుంది.



వయోజనవృత్తివిద్యాబోధ



యంత్రసామగ్రి దేశమంతటా ప్రచారంలోకి తీసుకురావాలని సలహాలను భారతప్రభుత్వం గ్రహిస్తున్నది. ఈ పటంలో మైకాను పనిలో నిమగ్నలైవున్నారు.



పట్నాలో నెలకొల్పబడిన కె. కె. కేంద్రం, బీహార్‌లో ఝరియా బొగ్గుగనులలో రక్షణకార్యకర్తలకు చేతిపనులలో శిక్షణ ఇస్తున్నారు.

అనగా అనగా ఒక ఊళ్లో ఒక ముసలమ్మ వుండేది. ఆమె కొక కొడుకుండేవాడు. అతనికి పధ్నాలుగవయేట రాజుకూతురుతో పెండ్లి అయ్యే జాతకముం దని అనుకుంటూ వుండేవారు. అతను పుట్టినపుడు రాజు మారువేషముతో ఎక్కడికో వెళ్లుతూ ఆ వూరు రావడం తటస్థించింది. అపుడే ఒక పిల్లవాడు పుట్టా డని, పధ్నాలుగవయేట రాజుకూతురుతో పెండ్లి అవుతుం దని, ఆ పిల్లవాడు తలపెట్టిన ప్రతిపనీ నెఱవేరుతుం దనీ విన్నాడు. ఆ రాజు బహు నీచుడు. పైపెచ్చు ఈర్ష్య పుట్టింది.

ఏకాయెకిన ఆ పిల్లవాడి తల్లిదండ్రులదగ్గఱకు వెళ్లి ఆదరంగా 'పాపం! మీరు బహుపెదవారిలాగా వున్నారు. ఈ పిల్లవాణ్ణి నా కివ్వండి. నేను కష్టపడి పెంచుకుంటాను' అని చెప్పాడు. మొదట వాండ్లు సమ్మతించలేదు. రాజు బంనారము ఆశ చూపించాడు. 'అదృష్టవంతుడు పుట్టాడు ఏది వచ్చినా వాడి మేలుకే' అని సరిపెట్టుకున్నారు పేద దంపతులు. రాజు పిల్లవాడిని ఒక పెట్టిలో పెట్టె నదిలో వదలిపెట్టాడు. తనకూతురి పీడ విరగడైపోయిందనుకున్నాడు. పెట్టె నీటిలో మునిగిపోవడానికిబదులు నీటిపై తేలుతూ నీటివాలున కొట్టుకుపోతూ వున్నది. ఒక్క చుక్కన్నా నీరు లోపలికి పోలేదు.

పోయి పోయి పెట్టె రాజనగరుదాపుకుపోయి ఆనకట్టదగ్గర ఆగింది. దగ్గఱ మిల్లులో పనిచేసే కుఱ్ఱవాడు చూచి ఒడ్డుకు లాగాడు. డబ్బు దస్కము వుం దని తెఱచి చూచాడు. లోపల చక్కని చుక్కలాంటి పిల్లవాడు కిలకిల నవ్వుతూ వున్నాడు. వెంటనే మిల్లు యజమానికి అప్పగించాడు. అతనికి పిల్లా జల్లా లేరు. ఆప్యాయంగా తీసుకొని భగవంతుడే యీరూపంగా ఒక నలుసు నిచ్చా డని మురిసిపొయ్యారు. ఆ దిక్కులేని పిల్లవాడిని ప్రాణం ఒకెత్తుగా చూసుకుంటున్నారు.

ఇలా ఉండగా ఒక రోజున వానలో తలదాచుకొనడానికి రాజు ఆ మిల్లులోకి వచ్చాడు. చిన్నవాడు నీ కొడుకా అని అడిగాడు రాజు. 'కాదు ప్రభూ, దిక్కులేని బిడ్డ. పధ్నాలుగు యేండ్ల క్రిందట ఒక పెట్టెలో ఆనకట్టదగ్గఱకు కొట్టుకొని వచ్చాడు. పని చేసే కుఱ్ఱవాడు చూచి పట్టి తీశాడు.' అని చెప్పుకున్నాడు మిల్లుయజమాని. తను పెట్టెలో పెట్టి నదిలో విడిచిన పిల్లవాడు వీడే నని రాజు గ్రహించాడు. 'రాణికి ఉత్తరము పంపాలి. ఇతను తీసుక వెళ్లుతాడా? రెండుకాసుల బంగారము యిస్తాను' అని అడిగాడు రాజు. 'తమరి చిత్తము వచ్చినట్లే' అని ప్రయాణానికి సిద్ధం కమ్మన్నాడు చిన్నవాడిని యజమాని. 'నేను వచ్చేటప్పటికి ఉత్తరం తెచ్చినవాడిని చంపి పాతిపెట్టించు.' అని రాణికి ఉత్తరము వ్రాసియిచ్చాడు రాజు చిన్నవాడిచేతికి.

చిన్నవాడు బయలుదేరాడు రాచ

పిల్లలకథ :



అదృష్ట రేఖ

మూలం :
గ్రిమ్

అనువాదం :
శ్రీ అక్కవరం సీతారామయ్య

నగరుకి. దారి తప్పిపోయినాడు. బాగా చీకటిపడేటప్పటికి మహారణ్యమధ్యంలో ఉన్నానని తెలుసుకున్నాడు. ఆచిమ్మచీకటిలో దూరాన మిణుకుమిణుకు మనే వెలుతురు కనుపించింది. వెలుతురు కనుపించేవైపే నడుస్తూ ఒక చిన్న గుడిసెను చేరుకున్నాడు. అక్కడ చలి గాచుకుంటున్న ఒక అవ్వ కనుపించింది. ఇతన్ని చూడడంతోటే కలవరపడి ఎక్కడినుంచి వస్తున్నావు? ఏం కావాలి? అని అడిగింది. మిల్లుదగ్గఱనుంచి వస్తున్నాను. రాణీగారికి ఉత్తరము తీసుకుపోతున్నాను. దారి తప్పాను. ఈ రాత్రికి ఇక్కడ తల దాచుకోనిస్తే సంతోషిస్తాను అని చెప్పాడు. 'ఓరి నిర్భాగ్యుడా! దొంగల గుంపుచేతిలో చిక్కావు. వాళ్లు చూస్తే నిన్ను ప్రాణాలతో పోనివ్వరు' అని అన్నది. నాకేం భయము లేదు, ఆ సర్వేశ్వరుడే నాకు రక్ష. బాగా అలసిపోయి ఉన్నాను. అడుగు తీసి అడుగు పెట్టలేను; అని అక్కడ ఉన్న బల్లమీద పడి సొక్కి సోలి నిద్ర పోయినాడు.

తరువాత కొంతసేపటికి దొంగలు వచ్చి క్రొత్త మనిషి ఎవరని అవ్వను గద్దించారు. పాపం! ఎవరో పిల్లవాడు అడివిలో దారి తప్పాడు. పాపమని నేనే ఇక్కడ ఉండమన్నాను. రాణిగారికి ఉత్తరం తీసుకొని పోతున్నాడట. అని బదులు చెప్పింది అవ్వ. దొంగలు ఉత్తరం తీసి చూశారు. ఉత్తరం తెచ్చినవాడిని చంపమని ఉన్నది. వారు కఠినహృదయులైనప్పటికిని ఆ చిన్నవాడిమీద దయ గలిగింది. ఆ ఉత్తరము చింపి, ఉత్తరం తెచ్చిన వాడికి కూతురు నిచ్చి పెండ్లిచేయమని ఉత్తరము వ్రాశాడు దొంగల నాయకుడు. తెల్లవారగానే ఉత్తరం యిచ్చి రాచనగరుకు దారి చూపించారు. రాణి ఉత్తరం చూచి వెంటనే పెండ్లి వైభవంగా జరిపించింది. పెండ్లికొడుకు రూపసి. బుద్ధిమంతుడు. అందుచేత రాజుకూతురుకూడ అతనితో కాపురం చేయడానికి ఇష్టపడింది.

తరువాత కొన్నాళ్లకు రాజు ఇల్లు చేరాడు. తను అన్న దానికి వ్యతిరేకంగా జరిగి వుంది. రాణి ఉత్తరము చూపించింది. మోసం జరిగిం దని గ్రహించి చిన్నవాడిని పిలిపించి నేను యిచ్చిన ఉత్తరం యేం చేశావు? బదులు యింకొక ఉత్తరం ఎందుకు యిచ్చావు? అని అడిగాడు. నేను అడవిలో నిద్రపోయేటప్పుడు ఎవరైనా మార్చారో యేమో నాకు తెలియదు. అని బదులు చెప్పాడు. 'ఆలా వీలులేదు. పాతాళగృహములో ఒక పెద్ద బ్రహ్మరాక్షసు డున్నాడు. నా కూతురును చేపట్టేవాడు, ఆ బ్రహ్మరాక్షసుడి తలలోవుండే మూడు బంగారు వెంట్రుకలు తెచ్చి నా కివ్వాలి. నీవు అవి తెచ్చి యిస్తే నా కూతురు నీ దవుతుంది' అని మండిపడుతూ అన్నాడు రాజు. 'బ్రహ్మరాక్షసుడు నా కొక లెక్కా! అలాగే తెస్తాను మూడు బంగారు వెంట్రుకలు అని బయలుదేఱాడు చిన్నవాడు.

పోగా పోగా ఒక పెద్ద పట్టణము వచ్చింది కోటగుమ్మందగ్గఱ వుండే కావలివాడు 'ఏం పనిమీద పోతున్నావు? నీ కేమేమి విశేషాలు తెలుసు? అని అడిగాడు. 'అన్నీ తెలుసు' అని జవాబిచ్చాడు చిన్నవాడు. మా పట్టణాపు నడిబజారులో వుండే బుగ్గబావిలో ఎప్పుడూ సారాయి వూరుతూండేది. ఇప్పుడు నీరు కూడ లేదు. కారణం చెప్పి పుణ్యం కట్టుకోరూ? అని అడిగాడు కావలివాడు. కాని 'మళ్ళీ వచ్చేటప్పుడు చెప్తా' నని ముందుకు వెళ్లాడు చిన్నవాడు. కొంతదూరం పోయేటప్పటికి ఇంకొక పట్టణం వచ్చింది. కోటగుమ్మందగ్గఱ కావలివాడు 'మీ రెవరు?' మీ కేమేమి సంగతులు తెలుసు? అని అడిగాడు. సర్వము 'తెలుసు'. అయితే ఈ పట్టణములో ఒక పెద్ద చెట్టు వుంది. అది బంగారుపండ్లు కాస్తుంది. ఇప్పుడు మాత్రము ఆకులు కూడా లేవు. కారణ మేమిటో చెప్పరూ? అని అడిగాడు కావలివాడు. 'తిరిగి వెళ్ళేటప్పుడు చెప్తా' నని ప్రయాణం సాగించాడు చిన్నవాడు. పోగా పోగా ఒక పెద్ద నది వచ్చింది. అక్కడ పల్లెవా డున్నాడు. 'అయ్యా! మీ రెవరు? మీ కేమేమి విషయాలు తెలుసు?' అని అడిగాడు. 'సమస్తమూ తెలుసు అని జవాబిచ్చాడు చిన్నవాడు. 'అయితే నేను యెల్లకాలము యిక్కడ వుండవలసిందేనా నన్ను యెవ్వరూ విడుదల చేయరా'? అని అడిగాడు. ఇప్పుడు కాదు తిరిగి వెళ్ళేటప్పుడు చెప్తా నని చెప్పాడు చిన్నవాడు.

నది అవతలి ఒడ్డున బ్రహ్మరాక్షసుడి గృహద్వారం కనుపించింది. అంతా పొగచూరి నల్లగా వున్నది. బ్రహ్మరాక్షసుడు ఇంట్లో లేడు. ఇంటి పనులను చూచే అవ్వమాత్రం ఒక పెద్ద పడకకుర్చీలో కూర్చొని వున్నది. 'ఏం కావాలిబాబూ'? అని. సాదరంగాఅడిగింది అవ్వ. రాక్షసుడి తలలో వుండే మూడు బంగారు వెంట్రుకలు కావాలి. లేకపోతే నా భార్య నాకు దక్కదు' అని అన్నాడు చిన్నవాడు. అది అంత తేలికయిన పని కాదు. రాక్షసుడు వచ్చేటప్పటికి నీవు కంటబడ్డావా నీ పని తీరిపోతుంది. నిన్ను చూస్తే జాలి వేస్తున్నది నాకు. సరే! ఏమి చేయాలో నేను చూస్తాలే అని అంటూ చిన్నవాడిని చీమగా మార్చి నా గుడ్డల్లో దాక్కో, సురక్షితంగా వుంటావు అని అన్నది. అంతకంటేనా కాని నాకు మరి మూడు ప్రశ్నలకు కూడా సమాధానాలు కావాలి. ఎందుచేత యెప్పుడూ సారాయి వుండే బావిలో ఇప్పుడు నీరు కూడా లేదు? ఎందుచేత యెప్పుడూ బంగారుపండ్లు కాసే చెట్టుకి ఇప్పుడు ఆకులు కూడా లేవు? దోనెవేసే పల్లెవాడు ఎంతకాలము ఆ పని చేయాలి? "మూడూ చిక్కు ప్రశ్నలే కాని భయపడకు. నేను వెంట్రుకలు లాగేటప్పుడు రాక్షసుడు యేమి చెప్పేదీ జాగ్రత్తగా విను' అని అన్నది.

సాయంకాలానికి రాక్షసుడు ఇంటికి వచ్చాడు. వచ్చీరావడంతోనే నరవాసన వస్తున్నదని యిల్లంతా కలయవెదికాడు.

బాల గేయాలు :

'బూచి'

యస్. వి. జోగారావు

పుట్టగోచులు పెట్టిన పూటనుండి
మాధుకరవృత్తి కులవిద్య మాకు; గాన
జోగినై యొక చినిగిన జోలె గట్టి
వాడవాడల నే దిరుగాడుచుందు.
ఒక్కయూర ద్రిమ్మఱుచు నే నొక్క రేయి
ఆవులించెడి యాకలి కాగలేక
'మాధవకబళ మొసగు మమ్మా'
యటంచు
యింటి తల్లుల బ్రార్థించుచుంటి నంత—
మింటి కెగదన్ను నొక పెద్ద మిద్దెమీద
చంకలో చంటిపాపకు చందమామ
రూపురేఖల యందాలు చూపి చూపి
బుజ్జగించి యా చిన్నారి బొజ్జకొఱకు
వెండిగిన్నెలోపల నున్న వేడి బువ్వ
కలిపి తినిపించు నొక తల్లి కర్ణపుటము
సోకె నేమో మదీయార్తశోకరవము!
ఆమె 'అబ్బీ' యని పిలచినట్లు లయ్యె—
ఆసతో నా దెసకు పాప మడుగు లిడితి
పిలుపు కాదది బెదరింపుబలుకుగాని—
'చూచినావుర పాపాయి బూచివాని!'

ఏమీ కనుపించలేదు. "నేను ఇల్లంతా వూడ్చి సర్దితే నీవేమో యాగం చేశావు. నరవాసన వస్తున్నదని అనడం నీకు మామూలయింది. పోయి భోజనం చేయి" అని అవ్వ విసుక్కుంది. భోజనం చేసేటప్పటికి రాక్షసుడు అలసిపోయాడు. అక్కడనే అవ్వ తొడమీద తలవాల్చి తలగోకమని నిద్రపోయాడు. అవ్వ సమయము చూచి వెంటనే ఒక బంగారు వెంట్రుక లాగి పక్కన పెట్టింది. ఏమిటది అని అరిచాడు రాక్షసుడు. ఏమీ లేదు కల వచ్చింది. కలలో నీ జుట్టు పట్టి లాగాను అంది అవ్వ. ఏమి కల గన్నావు? నడిబజారులో వుండే ఎప్పుడూ సారాయి వూరే బావిలో ఇప్పుడు నీరు కూడా లేదు. దీనికి కారణమేమంటావు? ఇంతేనా? బావిలో రాయిక్రింద ఒక గోదురుకప్ప వుంది దానిని ఎవరైనా చంపితే మామూలుగా సారాయి వూరుతుంది. అవ్వ తల గోకడం మొదలు పెట్టింది. తరువాత కొంతసేపటికే నిద్రపోయి కిటికీ తలుపులు వూడిపోయేటట్టు గురకపెట్టడం మొదలుపెట్టాడు రాక్షసుడు. ఇంతలో రెండవ వెంట్రుక లాగింది అవ్వ. అమ్మో! ఏం చేస్తున్నావే అని కోపంతో గర్జించాడు. కోపపడకు నాయనా. కల గన్నాను! ఏమని? ఒకానొక దేశంలో బంగారుపండ్లు కాసే చెట్టుకి ఇప్పుడు ఆకులు కూడా లేవు. ఎందుచేతనంటావ్? ఒక చుంచుఎలుక దాని వ్రేళ్లను కొరికి వేస్తున్నది. ఎవరైనా దాన్ని చంపితే అది యథాప్రకారం పండ్లు కాస్తుంది. లేకపోతే చెట్టుకే మోసం వస్తుంది. ఇంక నన్ను నిద్ర పోనియ్యి. ఈసారి కదిపావా నీ గూబ పగులకొడతా. అవ్వ రాక్షసుణ్ణి శాంతపరచి నిద్రపోయేవరకు తల మర్దన చేస్తూనే వున్నది. తరువాత మూడో వెంట్రుక లాగింది. రాక్షసుడు గావుకేక పెట్టి, అవ్వను చావగొట్టడానికి సిద్ధమైనాడు. చెడ్డ కల వస్తే ఎవరేమి చేస్తారు నాయనా? అని రాక్షసుడిని శాంతపరచింది. ఏమని కల వచ్చిందేమిటి? అని ఉత్సాహంగా అడిగాడు రాక్షసుడు. 'పల్లెవాడొకడు చాలకాలమునుంచి తనే పడవ వేస్తున్నానని తన్ను విడుదల చేయడానికి ఎవ్వరూ రానేలేదని బహుదుఃఖిస్తున్నాడు.' 'పిచ్చివాడు పాపం నది దాటడానికి వచ్చిన వాళ్లలో మొట్టమొదటివాడికి తెడ్డు ఇచ్చినట్లయితే తన దాస్యం తీరిపోతుంది. రెండవవాడే పల్లెవాడవుతాడు.' అని చెప్పి రాక్షసుడు నిద్రపోయాడు.

చేయవలసిన పని అంతా అవ్వ చేసింది. రాక్షసుడు బయటికి వెళ్లగానే చిన్నవాడికి మామూలురూపం వచ్చేటట్లు చేసి "ఇవిగో మూడు బంగారు వెంట్రుకలు. రాక్షసుడు చెప్పిన సమాధానాలను జాగ్రత్తగా విన్నావుకదూ" "ఆహా! నాకు బాగా గుర్తున్నయి." "అయితే నీ పని అయిందన్నమాట. ఇక నీవు బయలుదేఱవచ్చు" అని అన్నది. అవ్వకు కృతజ్ఞత తెలిపి నది దగ్గఱకు వచ్చాడు. ముందు నది దాటి "నదిదాటడానికి వచ్చినవాళ్లలో మొట్టమొదటివాడికి తెడ్డు యివ్వు" అని చెప్పాడు పల్లెవాడి ప్రశ్నకు. ఆకులు కాయలు లేని చెట్టు వుండే పట్టణాన్ని చేరుకున్నాడు చిన్నవాడు. "చెట్టువ్రేళ్లను కొఱికివేసే చుంచుఎలుకను చంపివెయ్యండి. పండ్లు మామూలుగా కాస్తాయి!" అని చెప్పాడు కావలివాడికి. వాడు మెచ్చి రెండు గాడిదలు మోయ కలిగినంత బంగారం ఇచ్చాడు. చిట్టచివరకు ఎండిపోయిన బావి వుండే పట్టణానికి వచ్చాడు. "బావిలో రాతిక్రింద గోదురుకప్ప వుంది. దాన్ని వెతికి చంపండి. మామూలుగా సారాయి వూరుతుంది." అని జవాబిచ్చాడు వాడి ప్రశ్నకి. అతడు మెచ్చి రెండు గాడిదలు మోయకలిగినంత బంగారం ఇచ్చాడు బహుమతిగా. చిట్టచివరకు చిన్నవాడు భార్యను కలుసుకున్నాడు. ఎలాగయితేనేం, భర్త సుఖంగా యిల్లు చేరినందుకు సంతోషించింది భార్య. చిన్నవాడు రాజుకు మూడు బంగారు వెంట్రుకలు ఇచ్చాడు. నాలుగు గాడిదలు మోయకలిగిన బంగారం చూసి రాజు సంతోషించి "షరతులన్నీ నెఱవేఱినాయి. ఇక నీవు నా కూతురును యేలుకోవచ్చు. కాని యింత బంగారము ఎట్లా సంపాదించగలిగావు?" అని అడిగాడు అల్లుణ్ణి. "నేను దాటిన ఒక నది ఒడ్డున పడివున్నది. ఇదంతా ఆ నదిలోని ఇసుకే." కావలసినంత నేనూ తెచ్చుకోవచ్చునా అని అడిగాడు రాజు. "నిరభ్యంతరంగా తెచ్చుకోవచ్చు. అక్కడొక పల్లెవాడున్నాడు. వాడి సహాయంతో నది దాటి నీ సంచులన్నీ నింపుకోవచ్చు." లుబ్ధుడైన రాజు వెంటనే బయలుదేఱి నదిని దాటించమని పల్లెవానికి సైగ చేశాడు. పల్లెవాడు నదినిదాటించి పడవ ఒడ్డు చేరకముందే తెడ్డు రాజు చేతికిచ్చి ఒడ్డుకు దూకి పాఱిపోయాడు. చేసిన పాపఫలితంగా రాజే పల్లెవాడయినాడు. అతనిని విడుదల చేసినవారే లేరు మఱి. చిన్నవాడు రాజుకూతురు సుఖంగా వున్నారు. అదృష్టరేఖ అట్లా వుంది.

పక్షిభాష

-ఆంగ్లం నుండి అనువాదం-

శ్రీ కొ. హ. శివాజీరావు

పూర్వకాలమున అరేబియాలో ఒక గొప్ప వర్తకు డుండేవాడు. అతని కొక కొడుకుండెను. విద్య ధనముకంటె గొప్పదని గుర్తించినవాడవటంచేత వర్తకుడు తన కుమారునికి బాగ విద్య చెప్పించాలని నిశ్చయించాడు.

కొడుకు పదేండ్లవాడాయెను. అతడు తన తండ్రితో మక్కాయాత్రకు బయలుదేరెను. దారిలో ఈజిప్టులోని ఒక గొప్ప పట్టణమును వారు సందర్శించిరి. ఆ పట్టణమున తిరుగుచుండగా ఒక పురాతనగృహమునుండి వింత ధ్వనులు వినబడెను! అవి ఏమియో అని కన్గొనగా అది పక్షుల భాష తెల్పు పాఠశాల యని కన్గొనిరి. తక్షణము వర్తకుడు వాని నందు చేర్పింప నిశ్చయించి అచ్చట నున్న గురువువద్ద చేర్పించెను. తాను తిరిగి స్వదేశమునకు మరలిపోవునప్పుడు కుమారుని తీసుకొనిపోదునని గురువుతో చెప్పి విద్యకుగాను ఆరు సంచుల బంగారము నిచ్చి వర్తకుడు యాత్రకు పోయెను.

రెండేండ్ల తరువాత వర్తకుడు కుమారుని మాట మరచి ఈజిప్టుదారి మరిచిపోయి స్వదేశము చేరెను. ఇంటికి రాగానే భార్య కుమారు డేడీ? అని అడిగెను. ఏమి చెప్పుటకు తోచక వర్తకుడు కుమారుడు సముద్రములో పడిపోయెను. అని చెప్పెను. ఈ మాట విని విచారించెను.

తండ్రి మామూలుగా వర్తకంలో పడి కుమారుని మాట మరిచాడు. జీవితంలో ధనార్జనే వాని పరమావధి. మళ్ళీ పదేళ్ల తరువాత వర్తకుడు యాత్రకు బయలుదేరాడు. ఈ సారి నా కుమారుని కలుసుకోగలనేమో అని అనుకున్నాడు. అదృష్టవశాత్తు అతడా పట్టణం వచ్చాడు. మళ్ళీ పూర్వం తాను చూసిన భవనంనుంచి వింతస్వరాలు వినబడ్డాయి. ఇదివరకు విన్నాడుకాబట్టి గుర్తుపట్టి అక్కడికి వెళ్లాడు. ఇపుడా గృహంలో ఇదివరకు పాఠాలు చెప్పున్న గురువు కనిపించలేదు. వాని స్థానే ఒక యువకుడు బోధిస్తున్నాడు. వాని అనుజ్ఞతో లోనికి ప్రవేశించి ముసలి గురువును చూడాలన్నాడు. ఆ రోజు చలిగా ఉండడంచేత ఆయన రాలేదు. వర్తకుని రాక తెలుసుకొని ఆ చలిలోనే పాఠశాలకు వచ్చి వర్తకుని అభినందించి "చూచారా ఆ పాఠం చెపుతున్నది మీ కుమారుడే, నాక్రింద పది సంవత్సరాలు నేర్చుకున్నాడు. నా తర్వాత నాఅంత వాడయ్యాడు" అని అన్నాడు. తన కుమారుడంతవాడయ్యాడని తెలుసుకొని చాల సంతోషించి కౌగిలించుకున్నాడు. తన కుమారుణ్ణి అంత వాణ్ణి చేసినందుకు ప్రతిఫలంగా మళ్ళీ ఆ గురువుగారికి బంగారము బహూకరించి తన కుమారుణ్ణి తీసుకొని సముద్ర ప్రయాణం సాగించాడు.

వారు ప్రయాణం చేస్తూండగా వారి పడవ తెరచాపకొయ్యమీద మూడు పక్షులు తమలో తామేమిటో మాట్లాడుకొంటున్నాయి. కుమారుడికి పక్షుల భాష తెలుసుగా! అందుకని తండ్రి 'ఆ పక్షులు ఏం మాట్లాడుకుంటున్నాయి?" అని కుమారుణ్ణి అడిగాడు. కుమారుడు జవాబు చెప్పకుండా మౌనంగా ఉన్నాడు. ఈ మౌనం జూచి మిగిలిన వర్తకులు "ఈ పదేళ్లు చదివినదీ యింతేనా?" అని హేళన చేశారు. అప్పుడు కుమారుడు తండ్రితో "నాన్నా అవి మాట్లాడుకున్నది చెప్పమంటే చెప్తాను. కానీ అది మీ హృదయాన్ని గాయపరుస్తుంది" అన్నాడు. ఏమైనా సరే చెప్పాలని వర్తకులూ, తండ్రీ పట్టుపట్టారు. తండ్రివైపు తిరిగి "నేను రాజునవుతాను నీవు నా కూలీ వవుతావు" అని ఆ పక్షు లనుకుటున్నాయి అన్నాడు. ఈ మాటలు వినగానే అందరూ కోపగించుకున్నారు. తండ్రి పెదవి కొరుక్కొని తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం చెయ్యడానికి నిశ్చయించాడు. సాయంత్రం ఆలోచించి ఆలోచించి తన పెట్టెలలో ఒక పెట్టెను ఖాళీ చేసి కుమారుణ్ణి అందులో పెట్టి అర్ధరాత్రి అపుడు సముద్రంలో త్రోసేశాడు. 'పక్షులు జోతిష్యంలో చాల అసమర్థములు' అనుకున్నాడు.

తిరిగి తన యింటికి వచ్చేసరికి తను లేనప్పుడు తన వస్తువులు, యిల్లు అగ్నికాహుతి అయినా యని తెలుసుకొని, కష్టాలు పడుతున్న తన భార్యను చూచి గుర్తుపట్టలేక, ఆమెదుస్థితికి విచారించాడు. తాను, ఆమె, కష్టమైన పనులు చేస్తూ రెండేళ్లు అక్కడే

స్వాతంత్ర్య జ్యోతి:

1949 ఆగస్టు 15

శ్రీమతి పొణకా కనకమ్మ

నవస్వతంత్ర మహామహోత్సవ రథమ్ము
విమలకల్యాణ రాజమార్గముల దిరుగ
వచ్చె దినమణి ప్రాభాతవర్తనముల
అమ్మ! నీచేతి కాగడాయై-వెలుంగ:
విశ్వసాగర కల్లోల వీచిలోన
నవ్యభారత స్వాతంత్ర్యనౌక ద్రిప్పి
విజయతీరాల లంగరు విడియనదిగో
ఖరకరుడు వచ్చె తల్లి! చుక్కానిపట్టి!
ఈ మహానంత యానమందే య్యమోఘ
పరమసౌభాగ్యసీమ జూపగనో? స్వయం
పుష్పకము దెచ్చి యంజలిమోడ్చి, లోక
బాంధవుడు నిల్చెజనని! స్వాగతముల
ఇది స్వతంత్ర మహాజ్యోతి ఈ యశేష
భువనముల కేకదీపిక పుణ్యాభార
తోర్వినుదయించె, ప్రాగ్గోళముజ్వలింప,
జయము! భారత జనయిత్రి!
జయము! జయము!!
సత్యమును ధర్మమును నహింసయును-ప్రేమ
త్యాగమును పంచప్రాణములై స్వరూప
మవతరించిన బాపూ మహాత్మ తేజ
మెపుడుముందయిమము నడిపించుగాక!!

కాలం వెళ్లదోసి, తరువాత ఎక్కడికైనా వెళ్దాం అని నిశ్చయించుకున్నారు.

ఇది యిట్లా ఉండగా, ఆ కుర్రవాణ్ణి పెట్టి సముద్రంలో పడేసిన పెట్టె తేలుతూపోయి పోయి ఒకచోట ఒడ్డునకు చేరుచుండగా, చూచి ఒక పలెవాడు తన వలలో ఈ పెట్టెను పట్టాడు. ఇంటికి వచ్చి చూడగా అం దొక అందమైన పిల్లవాడు ఉండడం వారు చూచి ముందు భయపడి తరువాత అతనూ తమంటివాడే నని గుర్తించి వారికి పిల్లలు లేకపోవడంవలన వానిని తమ కుమారునిగ చూచుకుంటుండేవారు. అతనుకూడా, వారిని తలిదండ్రులకంటె ఎక్కువగా ప్రేమతో చూచుకుంటుండేవారు.

ఆ ఊరి రాజుగారి దర్బారులో ప్రతిరోజు ఉదయం మూడు పక్షులు వచ్చి ఏవో అనుకొని వెళ్తుండేవి. ఈ విషయం ప్రతిరోజూ రాజు గమనించి అర్థం తెలియక, కలవరపడుతుండేవాడు. 'ఎవరైతే ఆ పక్షులు ఏం అనుకుంటున్నాయో వాని అర్థం చెప్తారో వారికి నా అర్ధరాజ్యం యిస్తా; నని చాటించాడు రాజుగారు. చాలమంది ప్రయత్నించి చెప్పలేక తమ తలలను పోగొట్టుకున్నారు. చివరకు రాజు ఆ రాజ్యపు మతాధికారిని పిలిచి అతనితో "ఏడు రోజుల్లో ఆ పక్షులను కునేది విప్పి చెప్పగలవాణ్ణి నీవు కనుక్కోవాలి లేకపోతేనీ తలతీస్తాను" అని చెప్పాడు. అతడు ఏమీ తోచక తిరిగి తిరిగి, చివరకు మన వర్తకుని కుమారుడు చెప్పగల డని విని, వాని యింటికి వచ్చి వానిని తనతో రమ్మని ప్రార్థించెను. పల్లెదంపతులు వానిని వదలలేక వెళ్ల వద్దనిరి. కాని వర్తకుని కుమారుడు వారికి నచ్చజెప్పి రాజదర్బారుకు మతాధికారితో బయలుదేరి వెళ్లెను. రాజుగారిని జూచి 'అయ్యా పక్షుల భాష నాకు తెలుసు. ఆ పక్షులు మాట్లాడుకునేది తెలుసు. కాని నీవు నీ అర్ధరాజ్యము యిచ్చుటకు తయారు గావలసినది'అని అనెను. "నాకేమి అభ్యంతరము లేదు" అనెను. ఇంతమంది ప్రయత్నించారు, వీడు మాత్రం చెప్పగలడా అన్న ధైర్యంతో యిస్తా నన్నాడు. అతను పక్షులు చెప్పేది విని యిట్లా అన్నాడు. రాజా ఆ పక్షులు న్యాయమర్థిస్తున్నాయి. నీ వామహస్తము ప్రక్కన నున్న పక్షి తూర్పునుండి వచ్చినది. నీ కుడి చేతి ప్రక్క నున్న పక్షి పడమరనుండి వచ్చినది. ఈ ఆడపక్షి ఒకప్పుడు పడమరనుండి వచ్చిన పక్షి భార్య. ఆపక్షి దేశాంతరగతమగుటచే ఆడపక్షి ఈ రెండవ దానిని వివాహ మాడినది. ఇప్పుడు మొదటి పక్షి వచ్చినది. ఇప్పుడు ఆడపక్షి నాదంటే నాదని తగవులాడుకుంటున్నాయి. అందుచే నవి న్యాయాభ్యర్థనకు వచ్చాయి అన్నాడు. "మీ కభ్యంతరము'లేని ఎడల నేను తీర్పు చెప్తాను"అని ఆ మొగపక్షులను రెంటిని తమ దిక్కుల వైపు ఎగుర నాజ్ఞాపించి ఆడపక్షిని తన యిష్టము వచ్చినవాని వద్దకు పొమ్మనెను. అది పడమర వైపు నున్న పక్షివద్దకు ఎగురగా అతడే దాని భర్త అని నిర్ణయించెను.

ఇది చూచి రాజు సంతోషించి ఏదియో బహుమతి యీయబోయెను. అర్ధరాజ్య మీయ ననెను. అందుకు కోపించి వర్తకుని కుమారుడు వింత స్వరముల నుచ్చరించి వివిధ పక్షుల నా రాజ్యముపై దాడి పంపెను. వాని నుండి తప్పుకొనుటకు రాజు అర్ధరాజ్యమును వర్తకుని కుమారున కర్పించెను. కొన్ని రోజుల తరువాత రాజుకు జబ్బు చేసి చనిపోవునప్పుడు మిగిలిన అర్ధరాజ్యమును వానికే ధారపోసెను. ఇప్పుడు వర్తకుని కుమారుడు రాజయ్యెను.

ఇప్పటి రాజు అసలు తలిదండ్రులు తమ స్వస్థలమైన అరేబియా వదలి ఈ రాజ్యమునకు వచ్చిరి. చలికాలం సమీపించడంచేత కలపను దాచిపెట్టుడని ఆజ్ఞాపించెను. రాజుతండ్రి ఒక కలపమోయు కూలీగా చేరెను. వాని భార్య రాజనగరులోని బట్టలు ఉదుకు వారలలో ఒకతెగ చేరెను. ఒక రోజున రాజు కూలివారల పరీక్షించుటకు వచ్చి, తన తండ్రిని గుర్తుపట్టి వానిని తనవద్దకు రప్పించుకొని యిట్లు ప్రశ్నించెను. "నీకు కుటుంబము, ఒక పిల్లవాడు ఉన్నాడా?" అతడు 'నాకు భార్య ఉన్నది కాని కుమారుడు లేడు'. అని చెప్పెను. 'నీ భార్య ఎక్కడ నున్నది?'అని రాజు అడుగగా 'మీ నగరులోని చాకళ్లలో ఒకతెగా పని చేస్తున్నది'అన్నాడు. అప్పుడు రాజు ఆమెను గూడా పిలిపించి యిట్లు ప్రశ్నించెను. 'ఏమమ్మా, మీరు మంచి రోజు లనుభవించి నట్లున్నారు. ఈ స్థితికి రావడానికి కారణ మేమి?' అనగా ఆమె "ప్రభూ ఈ కష్టాలు అన్నీ మా కుమారుడు పోయినప్పటి నుండి వచ్చాయి" అన్నది. "ఇప్పుడు నీ కుమారుని గుర్తు పట్టగలవా?" అనెను. 'తప్పకుండా గుర్తు పట్టగలను. వాని ఎడమభుజంమీద అందమైన ఒక పుట్టుమచ్చ ఉంది' అని ఆమె అంది. అప్పుడు రాజు అందరూ ఆశ్చర్యపడేటట్టు తన ఎడమ భుజంమీది పుట్టుమచ్చను చూపించాడు. అది చూడగానే ఆమె సంతోషాతిశయంతో కుమారుని కౌగిలించుకుంది. తండ్రి తనకు చేసినదానిని క్షమించి వారిద్దరితో తనను పెంచిన పల్లెదంపతులతో గూడ కులాసాగా ఉన్నాడు. పక్షులు చెప్పింది నిజ మైందిఅని వర్తకుడు అప్పు డనుకున్నాడు.

దానిమ్మకన్య

శ్రీమతి నిష్ఠల ఇందిరాదేవి

అనగా అనగా ఒక ఊరిలో ఒక రాజుండేవాడు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. రాజు ఆరుగురికి వివాహము చేసి ఏడవ వాడికి కూడ వివాహము చేద్దామని అడిగితే నాకుగురివింద గింజంత ఎరుపు గల భార్య కావాలని కోరెను. రాజు దేశదేశాలు గాలించినా అలాంటి అమ్మాయి లభించలేదు. అప్పుడు కుమారుని పిలిచి నీవే వెళ్లి ఎంచుకొని పెళ్లి చేసుకొమ్మని కొంత ధన మిచ్చి పంపెను. రాజకుమారుడు మంచి గుఱ్ఱము, కత్తి తీసుకొని బయలుదేరెను. అలాగ వెళ్లగా వెళ్లగా పేదరాసి పెద్దమ్మ ఉన్న ఊరు చేరుకొని, పెద్దమ్మకి ఒక వరహా ఇచ్చి సంతృప్తిగా భోజనము చేసెను. రాజకుమారుడు భోజన మైన పిమ్మట ఈ ఊర్లో వింతలు విశేషాలు ఏమి టని పెద్దమ్మ నడిగెను. ఇక్కడ దగ్గరలోనే ఒక దానిమ్మచెట్టు ఉంది. దానికి ఒక్కటే ఫలముంది. ఆఫలము ఎవ్వరూ కోయలేకుండా ఉన్నారు. ఆ ఫలమును ఒక రాక్షసుడు కాస్తున్నాడు. వాడు మధ్యాహ్నము వేటకి వెళ్తాడు. ఆ సమయంలో కోద్దామనే సరికి వెంటనే వచ్చేస్తాడు. అని పేదరాసి పెద్దమ్మ చెప్పగా రాజకుమారుడు నీ కెందుకు నేను తెస్తా నని వెంటనే బయలుదేరి రాక్షసుడు లేని సమయంలో అవలీలగా కోసి పెద్దమ్మకి చూపెను. రాజకుమారుడు ఆ ఊర్లో ఒక చిన్న గదిలో బస చేసెను. అతడు తెచ్చిన దానిమ్మ ఫలము ఒలిచేసరికి పదహారేళ్ళ బాలకుమార్తె వచ్చెను. రాజకుమారుడు తనకు నచ్చిన కన్య లభించినందుకు సంతోషంతో అచ్చటే వివాహము చేసికొనెను. రాజకుమారుని ఇంటి ప్రక్కనే ఒక గ్రుడ్డి కుమ్మరిది వుంది. ఒకనాడు దానిమ్మకన్య నూతికి వచ్చెను. గ్రుడ్డి కుమ్మరిది కూడ నీళ్లకి వచ్చి దానిమ్మకన్య అందము చూచి ఓర్వలేక నీ నగలు, బట్టలు నా కిచ్చి నా నగలు, బట్టలు నీ కిచ్చి ఈ నూతిలో ఎవరు అందముగా ఉన్నారో చూసుకుందా మని కుమ్మరిది దానిమ్మకన్యతో చెప్పే సరికి ఇద్దరూ నగలు, బట్టలు మార్చుకొని నూతిలో చూచుచుండిరి. దానిమ్మకన్య నూతిలో వంగి చూచుచుండగా కుమ్మరిది ఆమెను నూతిలోనికి తోసివేసెను. తరువాత ఆకుమ్మరిది బిందె నీళ్లు పట్టుకొని రాజకుమారునివద్దకు పోగా అతడు దానిమ్మకన్య అనుకొనెనుగాని కుమ్మరిది అని అనుకోలేదు. మరునాడే నూతిలో కలవపువ్వు పుట్టెను. ఎందరు ఆ పువ్వును తెంపుటకు ప్రయత్నించినను జయము పొందలేక పోయిరి. పువ్వు తెంపబడకపోవడ మేమి టని ఆ వూరి రాజుగారు కూడ వచ్చి పువ్వు తెంపబోయేసరికి మీదకి వచ్చినట్లే వచ్చి అడుగునకు పోయెను. అది చూసి ఇందులో ఏదో మోసం ఉన్నా దని ఊర్లో పువ్వు తెంపి యిచ్చినవారికి తన రాజ్యంలో సగం రాజ్యం యిస్తానని చాటింపించెను. ఈ చాటింపు విని ఎందరో రాజాధిరాజులు వచ్చి ప్రయత్నించిరిగాని జయము పొందలేకపోయిరి. ఆఖరికి పేదరాసి పెద్దమ్మ ఊర్లో ఉన్న రాజకుమారుడు నూతివద్దకు వెళ్లి తెంపబోయేసరికి చేతికి అందినట్లు రాగా, అది రాజుగారికి చూపి సగం రాజ్యం సంపాదించెను. పువ్వు తెచ్చి భార్యకు చూపెను. గ్రుడ్డి కుమ్మరిది మళ్ళీ పువ్వురూపంలో ఉన్న దానిమ్మకన్యను చూసి ఓర్వలేక పుష్పమును గట్టిగా నలిపి పారవేసెను. పారవేసిన స్థలములో నవనవలాడుతూ తోటకూర మొలిచెను. రాజకుమారుడు ఆ తోటకూర కోసి కూరవండమని భార్యకిచ్చెను. గ్రుడ్డికుమ్మరిది అంతా తరిగివేళ్లు పెంటపోగుమీదపారవేసెను. అక్కడ ఒక మామిడిచెట్టు మొలిచెను. కొంత కాలానికి ఆ చెట్టుకు ఒకేఒక ఫలము కాయగా, రాజకుమారుడు చూచి దానిని కోసి కత్తితో ముక్కలు చేయగా ఫలమునుండి మాంసవస, రక్తము వచ్చెను. ఇట్టి చెట్టు ఉండకూడ దని చెట్టు పూర్తిగా కొట్టించెను. చెట్టు కొట్టిన స్థలములో మంచము, పరుపు తలగడాలు ఉన్నవి. అక్కడకు మరికొంతదూరములో ఉన్న చెట్టుమీద రెండు రామచిలుకలు ఉన్నవి. రాజకుమారుడు ఇవన్నీ చూచి ఆశ్చర్యంతో మంచముమీద పరుండేసరికి రెండు రామచిలుకలు దానిమ్మకన్య కథంతా చెప్పుకుంటూ యిదంతా గ్రుడ్డికుమ్మరిది చేసిం దని చెప్పగా రాజకుమారుడు చిలకలని పట్టుకుందామనేసరికి అవి ఎగిరిపోయి పదహారేళ్ల బాలకుమార్తె యైన దానిమ్మకన్య మారెను. రాజకుమారుడు చూచి ఆశ్చర్యంతో ఇంటికి తీసుకొనివెళ్లి గ్రుడ్డికుమ్మరి దానిని ముక్కలు ముక్కలు చేయించి దానిమ్మకన్యతో తండ్రివద్దకు వెళ్లి జరిగిన దంతా చెప్పగానే తండ్రి తిరిగి ఎంతో వైభవంగా దానిమ్మకన్యకు కుమారునికి వివాహము చేసెను. కథ కంచికీ మన మింటికీ !

ఉస్మానియా విశ్వవిద్యాలయములో ప్రాంతీయభాషల స్థానము

శ్రీ కృష్ణ

ఉస్మానియా విశ్వవిద్యాలయములో ప్రాంతీయ భాషలను నిర్బంధముగా నేర్పవలె నని విన్నవించుటకై ఆంధ్రసారస్వత పరిషత్తు వారు రెండు పర్యాయములు విశ్వవిద్యాలయోపాధ్యక్షుని సందర్శించిరి. రాయబారమునకు ఆచార్య వీరభద్రుడు నాయకత్వము వహించిరి. ఇతర సభ్యులు: శ్రీయుతులు మాడపాటి హనుమంతరావు, దేవులపల్లి రామానుజరావు, మాదిరెడ్డి హనుమంతరావు, పులిజాల హనుమంతరావు, నర్సింహారెడ్డిగారలు. ఈ రాయబారముల ఫలితముగా, విశ్వవిద్యాలయములో ప్రాంతీయభాషలను నిర్బంధముగా బోధింప వీలు చేయుటకు ఉపాధ్యక్షుడు కొంతవర కంగీకరించెను.

సారస్వతపరిషత్తు కార్యదర్శి శ్రీ. పులిజాల హనుమంతరావు ఉపాధ్యక్షుని సుహృద్భావమునకు కృతజ్ఞత చూపుచూ, ఇంకనూ ప్రాంతీయ భాషలకు ఉచితస్థానము లభింపలేదనియే తెల్పుచున్నారు. పరిషత్తువారు ప్రాంతీయభాషలకు రెండు పరీక్షాపత్రము లుండవలె నని కోరిరి. కాని అకడమిక్ కౌన్సిలువారు ఒకేపరీక్షాపత్రము చాలునని నిర్ణయించిరి. ఇంగ్లీషుకు పత్రము ఇంటర్మీడియేట్‌లో మూడు పరీక్షాపత్రములను, బి. ఏ. బి.యస్‌సి; బి. కాంలలో రెండు పరీక్షాపత్రములను ఉంచుటకు కౌన్సిల్ వారు తీర్మానించిరి. ఇది ప్రాంతీయభాషలకు అన్యాయము అని కార్యదర్శిగారు అసంతృప్తిని వెల్లడించిరి.

జులై 4 తేదీనాడు సారస్వతపరిషత్తువారి రాయబారము ఉపాధ్యక్షుని కలసికొని ఇంగ్లీషులో నాలుగు పరీక్షాపత్రములను రెండుపత్రముల క్రింద తగ్గించుటవలన, రెండవ భాగమైన "వేదాంతము లేక నీతిశాస్త్రము"ను రద్దు చేయుటవలన, ప్రాంతీయ భాషలను సక్రమముగా నేర్ప వీలగును. ఇట్లుచేయుటవలన విద్యార్థులపై పెద్ద భారము పడదు నని శంకింప వీలు లేదని, విన్నవించిరి. ఇంగ్లీషు, హిందుస్థానీలను నేర్పు మిషతో, ప్రాంతీయభాషల నణగద్రొక్కుట కూడదని కూడా పరిషత్తువారు తెల్పిరి. ఇన్ని సబ్జక్టులను బోధించుట విద్యార్థికి భారముగా పరిణమించునేమో అని ఉపాధ్యక్షులవారు శంకను వెల్లడించి, ఆగస్టు ఒకటవ తేదీ నాడు జరుగు అకడమిక్ కౌన్సిల్ సమావేశములో ఈ విషయమై ప్రసంగించుటకు రాయబారనాయకుని ఆహ్వానింతు నని వాగ్దానమిచ్చిరి.

ప్రాంతీయభాషల అవసరము

ఆగస్టు నాడు, ఆచార్య వీరభద్రుడు కౌన్సిల్ ముందు, పరిషత్తువారి వాదము నీరీతిగా వివరించిరి: గత ముప్పది ఏండ్లనుండి విశ్వవిద్యాలయమునందు ప్రాంతీయభాషలు ఆప్షనల్ సబ్జక్టుగా మాత్రమే నేర్పబడుచున్నవి. అందువలన ప్రాంతీయభాషలను చదువు విద్యార్థులు ఒకరిద్దరికంటె ఎక్కువ ముందుకు రాకుండిరి. వందేమాతరం సమ్మెకాలములో, ప్రాంతీయ భాషలను చదువు విద్యార్థులే లేకపోయిరి. ప్రాంతీయభాషలను నిర్బంధముగా నేర్పుట అత్యవసరము. హిందీ జాతీయభాష గాన, దానిని నేర్పవచ్చును. నైజాం కాలేజీలో తమిళము నేర్పబడుచున్నది. దానిని బోధించుటకు కూడా ఏర్పాటులు చేయవచ్చును. అదేవిధముగా ఉర్దూ కూడా ఉండవచ్చును.

తెలుగు, మరాటీ, కన్నడము, తమిళము సంస్కృతమునకు సన్నిహితమైనవి గాన, ఈ భాషలవారు, సంస్కృతమును చదువుటకు అనుమతింపవలెను. అట్లే ఉర్దూ మాతృభాషగా గలవారు పర్షియన్ లేక అరబిక్ చదువవచ్చును.

మాతృభాషను ప్రథమభాగముగా పరిగణింపవలెను. అప్పుడు బోధనాకార్యక్రమ మిట్లుండగలదు.

ప్రథమభాగము : మాతృభాష
రెండవభాగము : ఇంగ్లీషు
మూడవ భాగము: ఆప్షనల్ సబ్జక్ట్సు.

ఇంటర్మీడియేట్, బి. ఏ; విద్యార్థులకు, రెండు పరీక్షాపత్రములు. ఒకపత్రములో పాఠ్యగ్రంథములపై ప్రశ్నలు-మరొక పత్రములో వ్యాసరచన, అనువాదము) ఉండవలెను. బి. యస్‌సి; బి. కాం; వారికి ఒక పరీక్షాపత్రము చాలు. మనకు ఇంక నుంచి ప్రాంతీయభాషలలో బోధింపగల ఉపాధ్యాయులు కావలెను. కాన, ప్రాంతీయభాషల నిమాత్రముగా విశ్వవిద్యాలయములో బోధించుట అవసరము. ప్రాంతీయభాషలలో బోధింపగల ఉపాధ్యాయులను విద్యాశాఖ తయారు చేయలేదు.

"వేదాంతము లేక నీతిశాస్త్రము"లో ఒక పరీక్షాపత్ర మివ్వబడుచున్నది. వీటిని రద్దు చేయుటవలన, వీటి స్థానములో వచ్చుచున్న ప్రాంతీయభాషలకు ఒక పరీక్షాపత్రము దక్కును. ఇది గాక, ఇంగ్లీషులో పరీక్షాపత్రములు తగ్గింపబడుచున్నవి. కాన తెలుగులో రెండు పరీక్షాపత్రముల నిచ్చుటకు అడ్డంకు లేమియూ ఉండనేరదు.

పరిషత్తువారి వాదమును పైవిధముగా ఆచార్య వీరభద్రుడు వివరించినతదుపరి, కౌన్సిల్ సభ్యులు కొన్ని ప్రశ్నలు వేసిరి.

సంస్కృత స్థానము

ప్రశ్న: మాతృభాషలు కావలె నని కదా మీరు వాదించినారు. మరి సంస్కృతము ఎట్లు ఈ భాగమును క్రిందరాగలదు?

శ్రీ వీరభద్రుడు: మాతృభాషకు బదులు సంస్కృతము తీసికొనవచ్చును. ఇది ఒక ప్రత్యామ్నాయముమాత్రమే. భారత దేశీయ భాషలు సంస్కృతమున కతిసన్నిహితమైనవి. సంస్కృతజ్ఞానము లేనివారు దేశీయభాషలలో పాండిత్యమును సంపాదింపలేరు. సంస్కృతము రానివారు తెలుగుభాషలో సమగ్రజ్ఞానమును పొందలేరు. కాని సంస్కృతము వచ్చినవారికి ప్రాంతీయభాష తేలిక. చక్కటి ఉర్దుజ్ఞానము కలిగినవారికి, పర్షియన్ లేక అరబిక్ జ్ఞానముండునని వేరుగా చెప్ప నక్కరలేదు. తీరా ఈ పురాతనభాషలను ఏ కొద్దిమంది విద్యార్థులో తీసికొనెదరు. తీసికొనువారు 10 లేక 15 మంది ఉందురు.

ప్రశ్న : ప్రాంతీయభాషలకే ప్రాముఖ్యత నిచ్చినచో, మిగిలిన భాషలవారి సంగతి ఏమి?

సమాధానము : హైదరాబాదు ప్రాంతీయ భాషలుగా గుర్తింపబడిన మూడు భాషలకు, ఉర్దుకు, జాతీయభాషకు, విశ్వవిద్యాలయములో స్థాన ముండును. అందుకు సంబంధించిన పురాతనభాషలను కూడా నేర్పదగును. ఇతరులకు అవసరమైనచో సాధ్యమైన సౌకర్యములు చేయబడును,

టెక్నికల్ కాలేజీలలో——

ప్రశ్న : ప్రాంతీయ భాషలను, టెక్నికల్ కాలేజీలలో కూడా బోధింప మనెదరా?

సమాధానము : అట్టి ఏర్పాటు చాలా సమంజసమైనది. ఉదాహరణకు, వ్యవసాయకళాశాలలో తయారైన విద్యార్థులు గ్రామములలో పని చేయవలసి యుండును. వారికి ప్రాంతీయ భాషలు రాకున్న పని జరుగుట ఎట్లు? వారు రైతులకు వారి భాషలో పరిస్థితులను వివరింపవలసి యుండును. కాన వారికి ప్రాంతీయభాషలలో శిక్షణ నిచ్చుట అత్యవసరము.

ప్రశ్న: సైన్సువిద్యార్థులకు చరిత్ర, వేదాంతములను నేర్పవలెనని, ఆర్ట్సు విద్యార్థులకు సైన్సును కూడా నేర్పవలె నని ఒక సూచన యున్నది. ప్రాంతీయభాషలను ప్రవేశపెట్టుటకంటె, విద్యాకార్యక్రమమును సరిదిద్దుట అవసరమని భావింతురా?

సమాధానము : మాతృభాషకు ప్రథమస్థానము తప్పదు. అందు కనుగుణముగా విద్యాకార్యక్రమమును సరిదిద్దవచ్చును. ఇతరసబ్జక్టుల పేరు చెప్పి, మాతృభాషల నణగద్రొక్క నక్కర లేదు.

ఒకటిచాలదు.

ప్రశ్న : మాతృభాషలో రెండు పరీక్షాపత్రము లెందుకు? ఒకటి చాలదా?

సమాధానము : ఇంటర్మీడియేట్, బి. ఏ: విద్యార్థులకు రెండు పరీక్షాపత్రము లవసరము. బి. యస్.సి; బి. కాం; విద్యార్థులకొక్క పత్రము చాలును. ఒక పరీక్షాపత్రము, నాటకము, వచనము, పద్యముపై నుండును. మరొకటి వ్యాసము, అనువాదములపై నుండును. ఒకే పత్రములో ఇన్ని అంశములను చేర్చుట అసాధ్యము. పరీక్షాపత్రమంతయు వ్యాసము, అనువాదము మొదలైన వాటిపై నున్నచో, విద్యార్థి గద్యపద్యములను పఠించు నవసరము ఉండకపోవును. ఇంగ్లీషుశాఖవారు ఒకే పరీక్షాపత్రము చాలు నని ముందు నిశ్చయించిరి, తర్వాత మార్పు చేసికొనిరి. ప్రముఖ గ్రంథకర్తల రచనలతో పరిచయము లేని విద్య వలన ప్రయోజనము శూన్యము. ఇంగ్లీషుకంటె, ప్రాంతీయభాషలు తక్కువ వని భావించుట పొరపాటు.

ప్రశ్న: ప్రాంతీయభాషలను ఇంటర్మీడియేట్ వరకు బోధించినచో చాలదా?

సమాధానము : ఈ సూచనను అంగీకరించినచో, ప్రాంతీయభాషలకు విశ్వవిద్యాలయము ఎట్టి సేవ చేయలేకపోవును. యూనివర్సిటీస్ కమిషన్‌వారు, ఇంటర్మీడియేట్ క్లాసులను విద్యాశాఖ క్రింద ఉంచవలె నని సూచింప నున్నట్లును, హైస్కూలుకాలమును మరొక సంవత్సరమెక్కువ చేయవలె నని సూచింప నున్నట్లు తెలియుచున్నది. పైగా స్థానికవిద్యాధికారులు ఇంటర్మీడియేట్‌ను, విశ్వవిద్యాలయమునుండి తొలగింప నిశ్చయించినట్లు కూడా తెలియవచ్చుచున్నది. ఎటువచ్చి, మూడేండ్ల కోర్సు కాబోవుచున్న బి. ఏ; తో విశ్వవిద్యాలయవిద్య ప్రారంభమగును.

ప్రశ్న : ఏదియో యొక భాషను చదివిన చాలదా? మాతృభాషనే చదువవలెనా?

సమాధానము : అవును——మాతృభాషనుగాని తత్సంబంధమైన ప్రాచీనభాషనుగాని విధిగా నేర్పవలె ననియే మా ఆదర్శము. ఇవి మాతృభాషలు కానివారి విషయములో ప్రత్యేకతను చూపవచ్చును.

పాక్షికవిజయము

చివరకు శ్రీ వీరభద్రుడు, ప్రాంతీయభాషలలో అధమము ఒక్క పరీక్షాపత్రము నైనను ఏర్పాటుచేయ విశ్వవిద్యాలయమువారు నిశ్చయించినందులకు కృతజ్ఞత తెల్పిరి. "ఈ ప్రాంతీయభాషోద్ధరణయుద్ధములో సగము గెల్చితిమి. విద్యార్థులీ సౌకర్యమును సక్రమముగా వినియోగింపవలెనని కోరుచున్నాను. మాతృభాషాజ్ఞానముద్వారా విజ్ఞానసముపార్జన సుగమమగును. మన సంస్కృతిని పెంపొందించుకొను నవకాశము కల్గును. ప్రభుత్వమువారు, ఉద్యోగుల నెన్నుకొనుటలో, ఉద్యోగార్థులకు ప్రాంతీయభాషాజ్ఞాన మత్యవసర మని నిర్ణయించుట ముదావహము" అని వీరభద్రుడుగారనిరి.



ట్రయినింగ్ స్కూల్ విద్యార్థినుల స్వాతంత్ర్యోత్సవంలో ప్రథమశ్రేణి.

మనరాష్ట్రం, మనదేశం:

(9-వ పేజీ తరువాయి)

ఉంటుంది. జాతీయావేశంతో ఇంగ్లీషుభాషని తొలగించినట్లయితే ప్రపంచంలో నిత్యం పరిణామం చెందుతున్న విజ్ఞానంనుంచీ, నాగరకత నుంచీ వేరుపడిన ట్లవుతుందని నివేదికలో చెప్పబడింది. దీనివల్ల మన దేశంలో పురోభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. కాలానుగుణంగా ఇంగ్లీషుభాషను ఆదరించక తప్పదని విచారణ సంఘం అభిప్రాయం. ఇతర భాషలనుంచి హిందీలో వచ్చి చేరిన పదజాలాన్ని త్రోసిపుచ్చక, విలీనం చేసుకుని పెంపొందించాలి. సైన్సు మొదలైన వానిలో అంతర్జాతీయ ప్రమాణాలను వాడాలి. వానికి సంబంధించిన పదాలను హిందీలో చేర్చుకోవాలి. వాని వర్ణక్రమాన్ని కొన్ని నిబంధనల ననుసరించి దేశీయ భాషాలిపికి సౌకర్యంగా నిర్ధారణ చేసుకోవాలి. ఉన్నతవిద్యాభ్యాసానికి క్రమక్రమంగా ఇంగ్లీషును మాని జాతీయభాషను ప్రవేశపెట్టాలి. హైస్కూళ్లలోనూ, కళాశాలల్లోనూ విద్యార్థులు మాతృభాషను, జాతీయభాషనూ (హిందీ దేవనాగరిలిపి), ఇంగ్లీషునూ నేర్వాలి. జాతీయ భాషకు దేవనాగరిలిపినే వాడాలి.

జాతీయభాషనూ, ప్రాంతీయ భాషలనూ వృద్ధిపరచడానికి ప్రభుత్వం వెంటనే విజ్ఞాన శాస్త్రవేత్తలతోనూ, భాషావేత్తలతోనూ ఒక బోర్డును నియమించాలి. భారతదేశంలోని సర్వభాషలకూ సామాన్యమైన సైన్సుపదాల్ని నిర్ణయించి, వివిధభాషల్లో సర్వవిజ్ఞాన శాస్త్ర శాఖల్లోనూ గ్రంథాలు రచించడానికి ఈబోర్డు కృషి చెయ్యాలి.

అన్ని హైస్కూళ్లలోనూ, కళాశాలల్లోనూ నిర్బంధంగా జాతీయభాషాబోధనకు అన్ని రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాట్లు చెయ్యాలి. హైస్కూళ్లలోనూ, కళాశాలల్లోనూ ఇంగ్లీషు కూడా చదివించాలి.

పరీక్షలబాధ:

నిజంగా విశ్వవిద్యాలయాలలో ఇప్పుడు తీసుకురావలసిన సంస్కరణ ఏదైనా ఉందంటే అది పరీక్షలపద్ధతే నని విచారణసంఘం చెపుతోంది. అసలు విద్యావిధానానికీ, పరీక్షలకూ పొత్తే లేదని వారు చెప్పారు. ఉద్యోగాలు ఇచ్చేవారిని తృప్తిపరచడానికి పోటీపరీక్షలు పెట్టినట్టుగా ఉందనీ, చదువుల్ని వ్యాపారంతో ముడిపెట్టినట్లుందనీ అన్నారు. గుమాస్తాగిరీకి కూడా డిగ్రీ ఉన్నవాళ్లు కావాలనడంవల్ల దేశంలో విద్యావిధానానికి చాలా కీడు కలిగింది. ఉద్యోగాల లాటరీకి టిక్కట్లు సంపాదించాలనే ఆత్రం ప్రజల్లో ఎక్కువైంది. దీనివల్ల, దేశంలో ఆర్థికదుస్థితివల్ల ఇంక విద్యార్థులస్థితి ఎంతదీనంగా ఉంటుందో గ్రహించవచ్చును. ఈ విద్యావిధానంలో లోకజ్ఞానోపార్జన కొదవైన దిందువల్లనే. శాస్త్రవిజ్ఞానవృద్ధికూడా కుంటువడిం దిందువల్లనే.

ఈ పరీక్షల పద్ధతిని పూర్తిగా మార్చివేస్తేనే గాని, విద్యావిధానం అథోగతిపాలౌతుందని విచారణసంఘం చెప్తోంది. ఒక విషయంగురించి విద్యార్థి ఎంత నేర్చాడో తెలుసుకునే పద్ధతి అవలంబిస్తే విద్యావ్యాప్తి చురుగ్గా జరుగుతుంది. ఆ విషయంలో మారుమూల నున్న వివరాల్ని కూడా జ్ఞాపకం పెట్టుకున్నాడో లేదో, "ఈ ప్రశ్నకి జవాబు రైటా కాదా" అని చూసినట్లయితే బుద్ధివికాసానికి ఆటంకం కలుగుతుంది. అందువల్ల ఈ పరీక్షల పద్ధతిని మార్చి, అమెరికాలో పద్ధతిని అవలంబించాలని నివేదికలో సూచించబడింది. ఈ పద్ధతివల్ల పరీక్షల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. (ఈ రోజుల్లో పరీక్ష ఫీజుల్నీ, సర్వీస్‌కమిషన్ల దరఖాస్తు ఫీజుల్నీ పోగుచేస్తే ఒక రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌ని భర్తీ చెయ్యవచ్చును.) ఈ పద్ధతి పరీక్షలో రెండు ముఖ్యలక్ష్యా లుంటాయి. 1. ఒక సబ్జక్టుని విద్యార్థి ఎంతవరకూ చదివి జీర్ణం చేసుకున్నాడో తెలుసుకోవడం. 2. ఏయేవిషయాల్ని ఎంతవరకూ అభ్యసించగల మేధాశక్తి ఉందో తెలుసుకోడం.

డిగ్రీలకీ ఉద్యోగాలకీ ముడిపెట్టకూడదని కూడా విచారణసంఘం సూచించింది. ఉన్నత ప్రభుత్వోద్యోగాలకి ప్రభుత్వాలు పోటీపరీక్షలు పెట్టాలి. డిగ్రీ లుండాలని నిర్బంధం విధించకూడదు. తరవాత విద్యావిషయాలలో విద్యాలయాలన్నీ సమానమైన ప్రమాణాలు నిర్ణయించుకోవలసిన అవసరం ఉందని కూడా విచారణ సంఘం సూచించింది. పరీక్షల విషయంలో సూచనల్ని దేశం అంతా, ముఖ్యంగా విద్యార్థులు హర్షిస్తారు. కమ్యూనిస్టు లేమనుకున్నాసరే విద్యార్థిసమ్మెలకి మూలహేతువు లేకుండాపోతుంది.

అంతర్జాతీయ బ్యాంక్ ఋణం:

అనేకమాసాలు తర్జన భర్జనలు చేసి చివరికి అంతర్జాతీయబ్యాంక్ భారతదేశానికి రైల్వే రవాణా అభివృద్ధికి 34 మిలియన్ల డాలర్లు (దాదాపు 22 కోట్ల రూపాయలు) ఋణమివ్వడానికి నిశ్చయించింది. ఇదిగాక విద్యుచ్ఛక్తి ఇరిగేషన్ ప్రాజక్టులకీ, భూమి దిక్లమేషన్ కార్యక్రమాలకి అవసరమైన పరికరాల కొనుబడికీ కొంత ఋణ మిస్తుందట. దేని కెంతెంత ఇస్తారో తరవాత తెలుపుతారు. మొత్తం అన్నిటికీ కలిపి ఇచ్చే ఋణం మొత్తం 75 మిలియన్ల డాలర్లు (26 కోట్ల రూపాయలుపై) గా ఉంటుందని మాత్రం చెప్పారు.

రైల్వేరవాణా అభివృద్ధి కిచ్చే ఋణం రైలు ఇంజన్లు, వేగన్లు, కోచ్చిలు, స్పేర్ పార్టులు మొదలైనవి కొనుక్కోడానికే నని చెప్పారు. మనదేశంలో రైలుఇంజన్ల తయారీకి ఫాక్టరీ స్థాపించడానికీ, విదేశాలనుంచి నిపుణుల్ని తెచ్చుకోడానికీ కొన్ని ఇంజన్లు మొదలైనవి అమెరికా కెనడాలలో కొనుక్కోడానికీ భారతదేశములో ఋణ మడిగింది. పరిశ్రమస్థాపన ఇప్పుడవసరంలేదని బ్యాంక్ అధికారులు చెప్పేశారు. వడ్డీ నూటికి 3 వంతులు. కమిషన్ ఒకవంతు. ఈ షరతులు సక్రమంగానే ఉన్నాయని దేశంలో ఆర్థిక నిపుణులు హర్షిస్తున్నారు. ఆసియాలో ఒక దేశానికి అంతర్జాతీయ బాంక్ ఋణం ఇవ్వడం ఇదేమొదలు. ఇప్పట్లో మిగతా దేశాలలో దేనికీ ఋణం ఇచ్చే ఆలోచన ఉన్నట్లు కనబడదు.

ఈబాంక్‌లో 400 మిలియన్ల డాలర్లవాటాలు కొని, ఆరంభంలోనే బాంక్‌లో చేరినందువల్ల భారతదేశానికి కార్యవర్గంలో సభ్యత్వం లభించింది. (బాంక్‌నియమాల ప్రకారం భారతదేశం వాటాధనంలో 20 మిలియన్లుమాత్రమే చెల్లించింది) ఈ బాంక్ డైరెక్టర్లబోర్డులో భారత ప్రభుత్వం తరఫున సర్. బి. యన్. రావుగారు గవర్నరుగా నియమితులైనారు.

[సీతారాం]

శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు

(8-వ పేజీ తరువాయి)

చెయ్యాలని తమిళనాయకులు కొందరు, తెలుగు నాయకులు కొందరు ప్రయత్నంచేశారు.

ప్రకాశంగారి వర్తన దోషభూయిష్టంగా ఉందని కేంద్రకాంగ్రెస్‌కి ఫిర్యాదులు వెళ్లాయి. మీరిపోయిన వయస్సులో అధికారబాధ్యత పైన వేసుకోవడం మంచిది కాదని గాంధీజీ సలహాఇచ్చినప్పుడు, అల్పవ్యత్యాసంతో వయోవృద్ధులైన మీరే కాంగ్రెస్ సంస్థనంతనీ నడపగలుగుతున్నప్పుడు, నేనెందుకు బాధ్యత వహించలేనని ప్రకాశంగారు ఎదురు ప్రశ్న వేశారట. ఈరీతిగా బలవంతులైన నాయకుల్ని ఎదిరించి నిలిచారు ప్రకాశంగారు. ప్రధాని ఎన్నిక సమయంలో చాలా ఆర్భాటం జరిగింది. కేంద్ర కాంగ్రెస్ కార్యవర్గమూ గాంధీగారూ రాజగోపాలాచారిగారిని ప్రధానిగా ఎన్నుకోవలసిందని చెన్నరాష్ట్ర శాసనసభల కాంగ్రెస్ పార్టీకి ఆదేశ మిచ్చారు. ఈ ఆదేశాన్ని ధిక్కరించి నిలిచారు ప్రకాశంగారు. కాంగ్రెస్ పార్టీలో చీలికలు కలతలు ఏర్పడిన ఈకాలంలో కేంద్రకాంగ్రెస్ నాయకత్వాన్నెదిరించి ప్రధాని అయినారు.

ప్రధాని అయిన తరవాత వెంటనే ముఖ్య సంస్కరణలకి పూనుకొన్నారు.

గాంధీయుసిద్ధాంతాల్లో నిధులైనవారినీ, ఆర్థిక నిపుణుల్నీ సంప్రదించి కుటీరపరిశ్రమాభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామజీవనం పైనే దేశభవిష్యత్తు ఆధారపడి ఉంటుందని దృఢంగా విశ్వసించి తత్ప్రకారం గ్రామ్య ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవితం చెయ్యడానికి ప్రకాశంగారివలె కృషిచేసిన నాయకుడుగాని, మంత్రిగాని మరొకడు లేడని చెప్పాలి. చరఖా ఆదర్శాన్ని వాస్తవంగా నమ్మి ఆచరణలో పెట్టడానికి యత్నించినవారు వీరొక్కరేనేమో. దేశంలో ముడిసరుకు లభ్యమౌతుంది. కావలసినంత నూలువడికి వస్త్రాలు నెయ్యడానికి కావలసినంతమంది జనం ఉన్నారు. ఇంక పెద్దపెద్ద మిల్లు లెందుకు? వస్త్రపరిశ్రమని ప్రధానంగా కుటీరపరిశ్రమగా చేస్తే గ్రామాలు ఆర్థికంగా బలపడతాయని ఆయన విశ్వాసం. రైతులకు పనిలేని మాసాలలో ఉపాధి లభిస్తుంది. అనేకమంది పనిలేని కార్మికులకు పని దొరుకుతుంది. ఇదిగాక లోహపాత్రలు కర్రసామానులు, తివాసీలు మొదలైనవాని తయారీకి గ్రామాల్లో ప్రోత్సాహం ఇచ్చినట్లయితే దేశం తిరిగి సంపదతో కలకల్లాడుతుందని గాంధీజీవలె కలలుగన్నారు ప్రకాశంగారు. దేశంలో వస్తూత్పత్తి వృద్ధి కావలసి ఉంది. విదేశాలకు మన వస్తువులు ఎగుమతి చేసుకోవాలి. పూర్వకాలంలో మన కుటీరపరిశ్రమల్లో ఉత్పత్తి అయిన చిత్రవిచిత్ర వస్తువులు గృహోపకరమైన చిన్నచిన్న వస్తువులే విదేశాల నాకర్షించాయి. భారతదేశం కుటీరపరిశ్రమలకే ప్రఖ్యాతి పొందింది. వానిని పునరుద్ధరిస్తే, బస్తీల్లో నాగరకవాతావరణంలో భోగవిలాసా లనుభవించే ఫాక్టరీ యజమానులకు, వ్యాపారులకు గుత్తపోకుండా, ధనార్జనను గ్రామాలవైపుకు మళ్లించవచ్చునని ప్రకాశంగారు ఆశపడ్డారు. ఆర్థికరంగంలో వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని మనసారా విశ్వసించి (గాంధీజీవద్ద ఇచ్చకాలకోసం కాకుండా) ఆచరణలో పెట్టడానికి యత్నించారు.

యూరప్‌లోసహకారకార్యక్రమాలనుమాసి అవే భారతదేశానికి అనువైనవని నమ్మారు. యుద్ధకాలంలో విపరీత లాభప్రమాణాలు రుచిమాసిన వ్యాపారులవైఖరి గమనించి, దేశంలో వాణిజ్యంగతినిమాసి, వారినుంచి ప్రజాసామాన్యాన్ని కాపాడానికి సహకారోద్యమం ఒక్కటే మార్గమని అనేకమంది నాయకులు ఆర్థిక నిపుణులు విశ్వసిస్తారు. దేశంలో కరువు చెలరేగుతున్నా ఆహారపదార్థాల్ని బిగబట్టి కూచుని విపరీతలాభప్రమాణాలు కోరుతున్న వర్తకులు కమిషన్ ఏజంట్లనుంచీ (కరువునుంచీ) ప్రజల్ని కాపాడాలంటే ప్రభుత్వం జోక్యంచేసుకోక తప్పనిస్థితి వచ్చింది. ప్రకాశంగారుఉత్పత్తి వినిమయ సమిష్టి సహకారసంఘాలను నాలుగు తెలుగుజిల్లాల్లోనూ, మలబారు జిల్లాలోనూ స్థాపింపచేశారు. ఈ సంఘాలను సవ్యంగా కార్యనిర్వహణ చెయ్యనిచ్చి పూర్తి అవకాశమిస్తే దేశంలో పెద్ద పరివర్తన రాగలిగేది. ప్రజల దృక్పథంలో కూడా పెద్దమార్పు రాగలిగేది. కాని ఈ కార్యక్రమాలవల్ల వర్తక వ్యాపారులు తమ వృత్తిపోతుందని భయపడ్డారు. మిల్లు యజమానులు తమలాభాల లావు తగ్గుతుందని భయపడ్డారు. ఈ భయాలు నిరాధారమైనవి కావు నిజమే. కాని లాభాలే కేవలం ప్రధానంగా ప్రజల అవసరాలనుగాని నీతినియమాలనుగాని పరిగణించనివారిపైనే సామాన్యప్రజల బ్రతుకు ఆధారపడిఉంటే ఎంతకాలం చూస్తూ ఊరుకోడం? వర్తకవ్యాపారులు అవినీతికి పాల్పడినప్పుడు ప్రజల్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి లేదా? దేశం ఆర్థికజీవనంలో ఒక వర్గాన్ని మరొక వర్గం పీడిస్తుంటే ప్రభుత్వం జోక్యంచేసుకోక తప్పదు. వీనివల్ల వ్యక్తిగత హక్కులకు స్వేచ్ఛా సూత్రాలకూ భంగం కలుగుతోందని వాదించడం బూటకమే అవుతుంది.

నిజానికి ప్రకాశంగారి పతనానికి కాంగ్రెస్ పార్టీలోని కక్షలుకాని, కొందరు కాంగ్రెస్ నాయకుల పదవీవ్యామోహంకాని ముఖ్య హేతువులుకావని నాఅభిప్రాయం. పైన సూచించిన కార్యక్రమాలూ సంస్కరణలే హేతువులు. వీనివల్ల భంగపడేవారంతా శాసనసభ్యుల అండ సంపాదించి, ప్రకాశంగారిని ప్రధానిపదవినుంచి కూలద్రోశారు. అసలు శాసనసభ్యులు మధ్య తరగతికి చెందినవారైనందువల్ల వారికీ, వారి బంధుకోటికీ ఈ సంస్కరణలు అపకారం చేస్తాయి. కాబట్టి శాసనసభ్యులే పట్టుదల వహించారు. బడ్జెట్ ప్రతిపాదించేలోగా ప్రకాశంప్రభుత్వాన్ని కూలదోస్తేనేగాని కొన్ని కార్యక్రమాలు అమలు జరిగిపోతాయని భయపడి, పార్టీనాయకుని ఎన్నికకాలంవరకూ ఆగకుండా, ముందే తొందరపడి, ఆయనపైన విశ్వాసరాహిత్య తీర్మానం ప్రతిపాదించారు. ప్రత్యర్థు లీరీతిగా చేసినందువల్ల వారికే దోషమంతా ఆపాదించరాదు. పరిస్థితుల్ని గ్రహించి, శాసనసభ్యుల ఆత్మాభిమానానికి దెబ్బ తగలకుండా, వారిని తమ సంస్కరణలపట్ల ఆకర్షించవలసిన విధి ప్రకాశంగారిపైన ఉంది. కక్షలకు తావిచ్చినప్పుడు పరిస్థితిని పరిశీలించి కాంగ్రెసువాదులకు కర్తవ్యబోధచేసి వారిని అంగీకరింపచేసి తరువాతనే సంస్కరణలను ప్రవేశపెట్టడం వారికర్తవ్యం. ఐకమత్యంకూడా ఉంటే ప్రకాశంగారు ఈ చిక్కులన్నిటినీ గడిచేవారేనని కొందరు చెప్తూ





★ టిటోపై మాస్కో పగ:

★ సిరియా:

రష్యా యుగోస్లావియాల మధ్య వైరం ముదిరింది. కొమిన్ ఫారం (తూర్పు యూరప్ దేశాలలో స్థాపించ బడిన అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రచారసంస్థ) టిటో ప్రభుత్వాన్ని పడగొట్టాలని పట్టుదలతో ఉంది. యుగోస్లావియాలో టిటో ప్రభుత్వం పై తిరుగుబాటును పురిగొల్పుతోంది. ఆర్థికంగా యుగోస్లావియాను తూర్పు యూరప్ వెలివేసింది.

టిటో ఈ బెదరింపులకు లొంగడం లేదు. యుద్ధ కాలంలో యుగోస్లావియా జర్మన్ల ఆక్రమణలో ఉన్నప్పుడు కర్షకజనాన్ని కూడగట్టుకుని నాజీల నెదిర్చి పోరాటం సాగించాడు మార్షల్ టిటో. నాజీల పతనం అనంతరం ప్రభుత్వం టిటో హస్తగతమయింది. కాని వ్యవసాయదారుల రాజకీయ ప్రాబల్యాన్ని మాస్కో ఎన్నడూ సహించలేదు. టిటో కర్షకపక్షాన్ని బలహీన పర్చడానికి అంతర్జాతీయ కమ్యూనిస్టులు అనేకవిధాల ప్రయత్నాలు చేశారు. కాని టిటో బలాన్ని సడలించలేకపోయారు. ఒకవైపు అమెరికన్ ఆర్థిక కార్యక్రమాల్ని నిరోధిస్తూ (మార్షల్ ఆర్థిక సహాయాన్ని మిగతా తూర్పు యూరోపియన్ దేశాలతోపాటు టిటోకూడా నిరాకరించాడు.) మరొకవంక అంతర్జాతీయ కమ్యూనిస్టుల తంత్రాలను నిరోధిస్తూ కమ్యూనిస్టు రాజ్యకూటంపట్ల టిటో తన విధేయతను నిలబెట్టుకున్నాడు. కాని టిటో జాతీయభావసమ్మిళితమైన అంతర్జాతీయ తత్వం మాస్కోకి నచ్చలేదు. అదీ గాక హంగేరీ, చెకోస్లావాకియాలలోవలె వ్యవసాయదారుల ప్రాబల్యాన్ని క్షీణింపచేసి రాజకీయ యంత్రాంగాన్ని పారిశ్రామిక కార్మికవర్గానికి ధారపొయ్యడానికి టిటో అంగీకరించలేదు. దీనివల్ల కమ్యూనిస్టు ప్రాథమిక సిద్ధాంతానికే ఆఘాతం కలిగినట్లు కొమిన్ ఫారం, సోవియట్ రష్యాలు భావించాయి. రష్యా ఆదినుంచీ అనుసరిస్తున్న విధానాన్ని టిటో కోసం మానుకోడానికి అంగీకరించలేకపోయింది. అలా అంగీకరించేపక్షంలో తూర్పు యూరప్ అంతటా కమ్యూనిస్టుపార్టీ రెండు శత్రువర్గాలుగా చీలిపోతుందనీ, ప్రపంచ విప్లవకర్తగా తమ నాయకత్వం భగ్నమైపోతుందనీ రష్యా భయపడింది. అందువల్ల ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలపట్ల వ్యవహారాలలో టిటో పూర్తిగా రష్యానే బలపరుస్తున్నప్పటికీ, టిటోను శత్రువుగా పరిగణిస్తోంది. యుగోస్లావియాలోని అంతర్జాతీయ కమ్యూనిస్టుపక్షపాతం గలవారినీ, కార్మికవర్గాలనూ టిటోపై తిరుగుబాటుకి రష్యా పురిగొల్పింది. కాని కార్మికవర్గం తిరుగుబాటు చెయ్యలేదు. టిటో అతిజాగ్రత్తతో వ్యవహరిస్తూ వచ్చాడు.

టిటోపై రష్యా, తూర్పుయూరప్ దేశాలు పగబట్టాయి. ఆర్థికంగా కట్టుగట్టాయి. అయినా టిటో ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలవైపు మొగ్గకుండా నిలిచాడు. మొగ్గే పక్షంలో ద్రోహంచేస్తున్నాడని వంకపెట్టి టిటోను అధికారంనుంచి పడద్రొయ్యవచ్చునని సంకల్పించారు. అది కొనసాగలేదు.

గత పదిపది హేనుదినాలనుంచీ పరస్పర దూషణలు, నేరారోపణలు ఆరంభమైనాయి.



ఈ తగవులో ఆంగ్లో-అమెరికన్ రాజకీయ తంత్రజ్ఞుల జోక్యం లేకపోలేదు. టిటో ఏక్షణంలో కలిసివచ్చినా ఆర్థిక సహాయం మిషతో సంప్రదింపులు జరపడానికి సిద్ధంగా కూర్చున్నారు. ఎప్పటికప్పుడు వదంతులు పుట్టించి ప్రచారంచేస్తూ మాస్కో-బెల్గ్రేడ్లమధ్య అనుమానాలనూ, వివాదాలనూ పెంచుతూవచ్చారు.

క్రిందటిపర్యాయం పారిస్‌లో బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి, రష్యన్ విదేశాంగమంత్రుల సమావేశంలో ఆస్ట్రియా-యుగోస్లావియా సరిహద్దు వివాదం యుగోస్లావియాతో సంప్రదించనవసరం లేకుండా పరిష్కారం చేశారు. యుగోస్లావియాకు ఆస్ట్రియా చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహారమొత్తం కూడా అదే రీతిగా నిర్ణయించబడింది. అదివరలో యుగోస్లావియా కోరిన హక్కుల్ని బలపరచిన రష్యా, ఇప్పుడు ఆస్ట్రియాపక్షాన నిర్ణయాలకు అంగీకరించింది. యుగోస్లావియా తనకు అన్యాయం జరిగిందని చెప్పుకున్నా వినేవారు లేకపోయినారు.

ఈ విషయమై యుగోస్లావియా ప్రభుత్వం రష్యాకు తన అసమ్మతి తెలియచేస్తూ ఒక పత్రం పంపింది. రష్యా సమాధాన మిస్తూ తమకు తెలియకుండా ఆస్ట్రియాతో వివాదం గురించి బ్రిటన్‌తోనూ, అమెరికాతోనూ టిటో రహస్యసమాలోచనలు జరిపి రష్యాపట్ల ద్రోహం చేసినందుకు గాను తా మీవిధంగా చేసినట్లు చెప్పారు.

ఇదంతా రష్యా చేసిన తంత్రమేనని నిందిస్తూ టిటో ప్రభుత్వం మరొక పత్రం మాస్కోకు పంపింది. ఆస్ట్రియాతో వివాదంవిషయమై స్వయంగా బ్రిటన్-అమెరికాలతో సంప్రదించుకోవలసిందని అప్పటి రష్యన్ విదేశాంగ మంత్రి మాలటోవ్, ఉపమంత్రి వైషిన్స్కీలు యుగోస్లావియాకు సలహా ఇచ్చారనీ, ఆ సలహా ప్రకారమే యుగోస్లావియా సంప్రదింపులు జరిపిందనీ, ఆ పత్రంలో తెలిపారు.

ఇదిగాక రష్యా మరొక ఎత్తువేత్తింది. యుగోస్లావియాలో సోవియట్ పౌరుల్ని టిటో ప్రభుత్వం నానాహింసలూ పెడుతున్నదని నిందిస్తూ, అది మానకపోతే రష్యా తగు చర్య తీసుకోగల దని బెదరించింది. సోవియట్ పౌరుల్ని హింసపెడుతున్నా రనేది అసత్యమనీ, యుగోస్లావియా ఆంతరంగికవ్యవహారాల్లో రష్యాగాని కొమిన్ ఫారంగాని జోక్యం చేసుకోడానికి వీల్లేదనీ టిటో ప్రభుత్వం సమాధాన మిచ్చింది.

ఈ బెదరింపువల్ల యుగోస్లావియాపై రష్యా తూర్పుయూరోపియన్ ప్రభుత్వాలు సైనిక చర్య తీసుకోదలచినట్లు ఆంగ్లో అమెరికన్ వర్గాలు వ్యాఖ్యానం చేశాయి. దీనికి తగినట్లు రష్యా తన సైన్యాల్ని యుగోస్లావియా సరిహద్దులవద్దకు తరలిస్తున్నట్లు కొన్ని వార్తలు బయలుదేరాయి. రుమేనియా, హంగేరీ, ఆల్బేనియాలు కూడా సైన్యాల్ని యుగోస్లావియా సరిహద్దుల సమీపానికి తరలిస్తున్నట్లు వార్తలు వ్యాపిస్తున్నాయి. ఈ వార్తల వ్యాప్తికి రష్యన్ వర్గాలూ, ఆంగ్లో-అమెరికన్ వర్గాలూ కూడా తోడ్పడుతున్నాయి. వీనికి టిటో బెదిరి తమకు లొంగిపోతాడని రష్యా, తమ శరణు అర్థిస్తాడని అమెరికా భావిస్తున్నాయి.

వీనితోపాటు గ్రీస్ సమస్యకూడా క్లిష్టంగా పరిణమిస్తోంది. గ్రీక్ గొరిల్లాలని ప్రభుత్వ సైన్యాలు సరిహద్దులకరకూ తరుముతున్నాయి. యుగోస్లావియా సరిహద్దుల్లో తలదాచుకోడానికి పారిపోయిన గ్రీక్ గొరిల్లాల్ని (కమ్యూనిస్టులు) యుగోస్లావియా ప్రభుత్వ సైన్యాలు ఇదివరకు వలె కాపాడ్డం మానివేసి వెనక్కి తరిమాయి. ఆల్బేనియా సరిహద్దులో తలదాచుకున్న గ్రీక్ గొరిల్లాలను తరిమివెళ్ళిన గ్రీక్ ప్రభుత్వసైన్యాలు రెండుచోట్ల ఆల్బేనియా సరిహద్దు దాటి లోనికి ప్రవేశించాయని ఆల్బేనియా ప్రభుత్వం తెలిపి, ఈవిషయమై ఐక్యరాజ్యసమితికి చెందిన భద్రతామండలికి ఫిర్యాదు చేసింది. ఎలాగైనా గ్రీక్ ప్రభుత్వసైన్యాలపై బడి తరమడానికి ఆల్బేనియా సాకుకోసం వెదుకుతున్నట్లు కనిపిస్తుంది. ఇందుకు రష్యా ప్రోద్బలం కూడా ఉండవచ్చును.

రష్యాకి ఇప్పుడు ముఖ్యసమస్య మెడిటరేనియన్ సముద్రంలోకి దారితెచ్చుకోవడం. గ్రీస్ కమ్యూనిస్టుల పరమైతే ఏచిక్కులేకపోయేదే. డార్డనెల్స్ విషయమై టర్కీ పట్టుదలగా ఉంది. టర్కీకీ, గ్రీక్ ప్రభుత్వానికీ అమెరికా ప్రత్యక్ష సహాయం ఇస్తోంది. ఇంక యుగోస్లావియా ఆల్బేనియా లున్నాయి. ఆల్బేనియాలో రష్యా పట్ల విధేయతగల ప్రభుత్వమే ఉంది. కాని ఆల్బేనియాతో రష్యాకి హంగేరీ యుగోస్లావియాలద్వారానే సంబంధం ఉండాలి. ఆల్బేనియా ఏడ్రియాటిక్ సముద్రతీరాన యుగోస్లావియాకి దక్షిణాన, గ్రీస్‌కి పశ్చిమాన ఉంది. యుగోస్లావియా రష్యాకి ఎదురుతిరిగిందికాబట్టి ఆల్బేనియా ఉపయోగపడ్డంలేదు. ఆల్బేనియా శత్రుకూటంమధ్య చిక్కుపడినట్లయింది. అందువల్లనే టిటోవిషయమై ఏదో పరిష్కారం త్వరగా జరిగిపోవాలని ఆల్బేనియా తొందర పడుతోంది. టిరానా రేడియో తీవ్రప్రచారం సాగిస్తోంది. టిటోపై రష్యాకు విశ్వాసం ఉన్న దినాలలో, గ్రీక్ మాసిడోనియాను యుగోస్లావియాతో కలపాలని ప్రయత్నం జరిగింది. మాసిడోనియా కలిసినట్లయితే మెడిటరేనియన్ సముద్రానికి దారి చిక్కినట్లే. కాని యుగోస్లావియాతో విరోధం రావడంతో రష్యా ఇప్పుడా మాటే ఎత్తడం లేదు.

గ్రీస్ కమ్యూనిస్టుల పరమయ్యే పక్షంలో యుగోస్లావియాతో నిమిత్తం లేకుండానే రష్యాకి యుక్రేన్ ద్వారా మెడిటరేనియన్ సముద్రానికి దారి చిక్కుతుంది. ఆల్బేనియాని దూరమైపోకుండా కాపాడవచ్చును. అందువల్లనే ఆల్బేనియా గ్రీస్ విషయమై కూడా తొందర పడుతోంది.

యుగోస్లావియాతో వివాదం ముదిరించినందువల్ల రష్యా జాగ్రత్త వహించకపోతే, ఆ దేశ ఆంగ్లో-అమెరికన్ తంత్రజ్ఞుల పన్నాగాలలో పడే ప్రమాదం ఉంది. పరిస్థితి ఇంతవరకూ వచ్చిన తరువాత రష్యా అమెరికాలు పోటీపడి టిటో భవిష్యత్తును త్వరలోనే తేల్చివేస్తారనుకోవచ్చును.

సిరియా

ఆర్థిక రాజకీయరంగాలలో బ్రిటన్, ఫ్రాన్స్ అమెరికాలు ఎంతగా మైత్రి సహకారాలు నెరపినా మధ్యప్రాచ్యంలోకి వచ్చేసరికి వానిమధ్య పోటీ ఏమాత్రం తగ్గలేదని సిరియా రాజకీయాల వల్ల తెలిసివస్తోంది. పెట్రోల్ ఉత్పత్తి పరిశ్రమల సందర్భంలో పోటీలో రహస్యమేమీ లేదు. రాజకీయ రంగంలో మూడుదేశాలు గూఢ తంత్రాలకు దిగాయి.

అమెరికా అండలోఉన్న టర్కీ, పర్షియాలకు పోటీగా మధ్య అరబిక్ దేశాల సమాఖ్య ఒకటి స్థాపించాలని బ్రిటన్ ప్రయత్నిస్తోంది. బ్రిటన్ ధనసహాయంతో రాజ్యపాలనం చేస్తున్న ట్రాన్స్‌జోర్డన్ పరిపాలకుడు అబ్దుల్లా విస్తృత సిరియా రాజ్యస్థాపనోద్యమం ప్రారంభించాడు. అబ్దుల్లా పేరిట ఈ ఉద్యమాన్ని నడుపుతున్నది బ్రిటిష్ రాజకీయ తంత్రజ్ఞులే. పాలస్తీనాలోని ఆరబ్ ప్రాంతాలను ట్రాన్స్‌జోర్డన్‌తో చేర్చి అబ్దుల్లాను హాషిమైట్ రాజ్యాలపాలకునిగా చేశారు. ఇరాక్ సిరియా, లెబినాన్ లన్ని కలిపి విశాల సిరియారాజ్యంగా స్థాపించి అసమాఖ్యకు కూడా అబ్దుల్లారాజ్యంలో చేర్చాలని బ్రిటిష్‌వారి ప్రయత్నం. ఈ ఉద్యమానికి అనుగుణంగా సిరియాలో పరిపాలకుల్ని బ్రిటిష్‌వారు తమ అదుపులోకి తెచ్చుకున్నారు. సిరియాలో ఫ్రెంచివారికి వ్యాపార పరిశ్రమాదులున్నాయి. ఫ్రెంచివారికి బ్రిటిష్ తంత్రాలు కన్నుకుట్టాయి. అమెరికన్లు కేవలం పెట్రోల్ పరిశ్రమే ప్రధానంగా పరిగణించి, టర్కీ సాదీ అరేబియా, ఇరాన్లపైనే దృష్టి కేంద్రీకరించి మధ్య అరబిక్ రాజ్యాల విషయంలో తాటస్థ్యం వహించింది.

ఫ్రెంచివారి ప్రోద్బలం పైన సిరియన్ సైనికాధికారి హుస్నీజయిమ్ సిరియన్ ప్రభుత్వంపై తిరుగుబాటుచేసి పాలనాధికారం హస్తగతం చేసుకున్నాడు. సిరియా అధ్యక్షుడు తనకు మిత్రుడైనా కారాగారబద్ధుణ్ని చేశాడు. విశాల సిరియా స్థాపనోద్యమాన్ని ప్రతిఘటించ గలనని జయిమ్ ప్రకటించాడు కూడా. సిరియాలో ఎన్నికలు జరిపి జయిమ్ తానే అధ్యక్షుడైనాడు. జయిమ్‌తో పోటీ చేసిన వారే లేరు. తిరిగి బ్రిటిష్ తంత్రాలు ఫలించి జయిమ్‌పై మరొక సైనికాధికారి సామీ హీయవానీ తిరుగుబాటు చేశాడు. జయిమ్‌పైనా, అతని క్రింద ప్రధానమంత్రి పైనా మిలిటరీ విధుల ప్రకారం నేరవిచారణ చేసి హత మార్చాడు. తాను సైనికాధిపతియై పరిపాలనను పాత మంత్రులకు ఒప్పగించాడు. దీనివల్ల బ్రిటిష్‌వారు పైకి ఎంత లేదని చెప్పినా వారి ఉద్యమం తీవ్రతరమౌతోందని తెలుస్తోంది. వివిధ దేశాల మధ్య తగవులు పెట్టి స్వప్రయోజనాలు నెరవేర్చుకోడంలో బ్రిటిష్ రాజకీయ తంత్రజ్ఞులు ఆరితేరినవారనీ, తమ తంత్రాల కోసం ప్రజాహితం దేశహితాల్ని కూడా గణించరనీ మరొక సారి ధృవపడింది.

(సూర్యం)

ఉంటారు. కాని ఆ లోక్యమే ఉంటే ప్రకాశంగారు ప్రకాశంగారే అవరు. ముందు వెనకలు చూడకుండా ముందుకు దూకే సాహసం, పౌరుషం, నిర్లక్ష్యం, పట్టువల ప్రకాశంగారి విశిష్టగుణాలు. కాబట్టే మంత్రివర్గవివాదాల కాలంలో ప్రత్యర్థులతో ఆయనకి సమాధానం కుదిరిందికాదు. ఒక వ్యక్తిని మంత్రివర్గంలోకి తీసుకోగలరని మాట ఇస్తే చాలు చిక్కు విడిపోగల తరుణం లభించింది. కాని పట్టుదలకోసం పౌరుషంకోసం నిరాకరించారు. మాట పట్టింపులవల్ల అనేకసార్లు ఉభయపక్షాలమధ్యనా సమాధానం కుదరవలసినది తప్పిపోయింది. లౌక్యం ఆయనలో లోపించవచ్చును. కాని ప్రకాశంగారి ఆ లోపాలనుకూడా ఆంధ్రదేశం గౌరవిస్తుంది. అందువల్లనే ప్రకాశంగారిపట్ల ఆంధ్రదేశానికున్నవి భక్తిశ్రద్ధలే కావు. అవ్యాజమైన అనురాగంకూడా ఉంది. [సీతారాం]

పక్షుల్లోను - జంతువుల్లోను - నాట్యకళ

శ్రీ భైరవభొట్ల రామబ్రహ్మశాస్త్రి

ప్రకృతి సహజంగా పక్షులు, జంతువులు నాట్యం చేయును. ఇది ఆనందంతో కూడిన మనస్సంచలనము కలిగినప్పుడు వచ్చును. అనేక జంతువులలో విలాసక్రీడలు ప్రేమోత్పన్నము లైనవి. ఇవి ప్రథమములో మదనవికారము చూపి నను దాని నధిగమించి ఒక నూత్న దివ్యకళా వికాసము పొందును. ఇది తెలుచు మానవుల కందుబాటులో లేనిది. ఇట్టి కళావిర్భావము జకానాపక్షులలో కలిగినది. ఈ పక్షులన్నియు గుంపులు గుంపులుగా చేరి ఆహారము తినుచున్నవి యనుకొనండి. ఒక సంకేతధ్వని విని అవి ఒక నిర్ణీత స్థలానికి ఎగిరపోతాయి. వీటిలో స్త్రీ పురుషజాతులు రెండును ఉండును. అప్పుడిది చేసే అద్భుతనృత్యము "మిలిటరీ పెరేడు"ను స్ఫురణకు దెచ్చును. అందచందాలతో నున్న జండాలు ఒకదాని ప్రక్కన యింకొకటి పెట్టి నట్లుగా ఈ పక్షులు తమ రెక్కలను పైకెత్తుకొని బారులు తీరి నిలబడును. కొన్ని పక్షులు తమ రంగురెక్కలను నిట్టనిలువుగా ఎత్తి కదలకుండా ఉంచును. మఱి కొన్ని తమ రెక్కలను సగము పైకెత్తి విశేషముగా కంపన ముందించును. ఇంకను కొన్ని వాటి రెక్కలను మెల్ల మెల్లగా క్రిందకు పైకి తప్పకుండా తాళమున కనుగుణంగా ఆడించును.

"లాపువింగు" అనే జాతి పక్షులు చేయు నాట్యము ఇంకను అద్భుతముగా నుండును. ఇవి సామాన్యముగా పగటివేళలలోగాని వెన్నెల రాత్రులలోగాని నాట్యము చేయును. ఇందు ఒకజంట పక్షులు అనగా భార్యాభర్తలు ఇంకొక మొగపక్షితో కలసి నాట్యము చేయును. ఈ భార్యాభర్తపక్షులు మూడవపక్షిని సంతోష పూర్వకచిహ్నములతో మధురాలాపములతో ఆహ్వానించును. ఈ మూడవది ఎవరో, ఏల వచ్చెనో, మాత్రము చెప్పలేము. ఈ మూడవపక్షి ఒక ప్రాతస్నేహితుడయి యుండునా? లేక ఆడపక్షివలె సోదరునివలె బావచెల్లెళ్ళను చూచి వెళ్ళుద మని వచ్చుచున్నదా? లేక ఇంక యేదన్నా బంధుత్వము కలదా? నూత్నవధూవరుల నాశీర్వదించుటకు వచ్చు సంఘములో పెద్దపక్షియా? లేక యీ ఆడపక్షిని చూచి మోహించి వచ్చు పరాయిపక్షియా? లేక వధూవరుల అనురాగాగ్నికి ఆజ్యమై వచ్చు చెలికాడా? లేక ఎమయి యుండును. ఏమైనను ఇది యొక నూత్నకళావికాసము. మూడవ మనిషి లేనిదే భార్యాభర్తల అనురాగములో అలజడిగాని ఆనందముగాని ఉండదు. ఈ మూడవపక్షి వచ్చుట తోడనే అతని నాహ్వానించి వానివెనుక వధూవరపక్షులు చేరును. అప్పుడు మూడును సైనికుల నడకవలె "లెఫ్టు, రైటు" అనునట్లు పదాలు వేసికొనుచూ, అడుగులను కొట్టి ప్రతిధ్వనించు శబ్దాలను పలుకుచూ, చాల ధీమాగా కొంతసేపు నడచును. ఇంక నడచుట ఆగిపోవును. ముందఱ ముక్కుకొనను నేలకు ఆనించుచును అట్లా ఉండి ఒక రాగానుగుణ్యంగా మెల్లగ హీనకంఠస్వరంతో ఒక మధురస్వరాన్ని కొంతసేపు ఆలాపించును. కొంతసేపటికి నాట్యమయి



లుచున్న మూడవపక్షి రెక్కలను నిట్టనిలువుగా ఎత్తును. కదలకుండా నిలబడి ఆపి ఆపి ప్రతిధ్వనించు శబ్దాల నాలాపన జేయును. వాని వెనుక నున్న వధూవరపక్షులు నెత్తిమీది పింఛమును నిటారుగా పెట్టి ముందుకు బాగుగా వంగి పోవును, అప్పుడీ మూడవ అతిథి తన భార్యవద్దకు స్వస్థలానికి వెడలిపోవును. వీరదగ్గఱకు ఇంకొక మూడవ అతిథి వచ్చి కొంతసేపు నాట్యము చేసివెడిలి పోవును.

(24-వ పేజీ చూడుడు)

మద్రాసురాష్ట్ర ఆస్థానకవులు

(10-వ పేజీ తరువాయి)

లుబికింది. సమరాంగణంలో ఆశువుగా రచించినట్లుగా, జాతీయగీతాలతో యువకులలో ప్రబోధము తేగలిగాడు. 1935 లో రాజాజీ "వేదారణ్య" సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు, రామలింగం పిళ్ళెగారు రచించిన గేయం ఇప్పటికీ సమరగీతంగా యువకులలో ప్రచారములో ఉంది. ఆయనది ప్రజలలో తేలికగా వ్యాపించగల కవిత్వం. హృదయోద్వేగం ఎక్కువ. ఆయన గేయాలు, జనసమూహంలో భజన చేస్తూన్నట్లు పాడేందుకు చాలా ఉత్తమంగా తగి ఉంటాయి.



వల్లతోల్ నారాయణమీనన్

కేరళదేశంలో వల్లతోల్ పేరెరుగనివారుండరు. మలబారు కవులలో అగ్రశ్రేణిలో ఈయన నిలుస్తారు. వీరి గ్రంథాలతోటే, వీరితోటీ కూడా జనానికి సన్నిహితపరిచయం ఉంది.

వీరు యావద్భారతదేశంలోనూ, అంతర్జాతీయంగా కూడానూ, ప్రఖ్యాతిగన్న కవులు. పశ్చిమతీరాన్న వీరు పర్యటించని పల్లెపట్టుగాని వీరు ఉపన్యసించని సభావేదికగాని లేదు. "ప్రజాకవి" అనటం సర్వవిధాలా వీరికి తగి ఉంది. పాండిత్యంతో ముకుళించుకొనిపోయి ప్రజలకు దూరంగా ఉండటం కాకుండా, జనమధ్యముందుండి, వారిని అవగాహన చేసుకొంటూ వారిలో ఒకరై జీవితం గడిపారు వల్లతోల్ గారు. కేవలం కవిగానే కాదు వీరి ప్రసిద్ధి. కథాకళి నృత్యపునరుద్ధరణకై "కలామండపం" స్థాపించ దలచి లక్షరూపాయల చందా అవలీలగా సేకరించారు వల్లతోల్ గారు, ఈయన స్నేహితుడనని చెప్పకొనే గౌరవానికి మళయాళప్రజలు ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. అంతటి మైత్రీస్వభావం ఆయనది. మృదుహాస్యధోరణిలో, మందస్మితవదనంతో, స్నేహాలను వృద్ధి చేసుకొంటూ పోతారు వల్లతోల్ గారు.

ఈ మహాకవి జన్మచేతా, సంపర్కంచేతా కూడా, ఉత్తమకేరళ సంస్కృతిని తనలో జీర్ణం చేసుకోగలిగాడు.

దక్షిణ మలబార్‌లో తిరూర్ వద్ద మంగళం ఈయన జన్మస్థానము. కేరళసాహిత్యంలో మహామహులైన మరి ఇద్దరు పూర్వకవులు, ఏజుత్తచ్చన్, మెప్పట్టూర్ భట్ట త్రిపాదు లిరువురూ కూడా ఈ ఊరనే జన్మించారు. భట్టత్రిపాదులు కవియోగి "నారాయణీయం" అనే సంస్కృతశ్లోక సంపుటిని గురువయ్యూర్ స్వామిపై రచించి, తన పక్షవాతవ్యాధిని నివారణ చేసుకొన్నారు.

వల్లతోల్ కుటుంబీకులు వెట్టతు స్వరూపం, సంస్థానంలో దివాన్గిరీలు చేశారు. ఆ ఆస్థానం కథాకళి మొదలైన కళలను పోషించేది. పోర్చుగీస్ వారితో ఈ సంస్థానానికి సంబంధాలుంటున్నాయని మిషతో "జామొరిన్" ఈ సంస్థానాన్ని రూపుమార్చి వదిలిపెట్టాడు.

ఈ కవి తల్లి, శ్రీమతి కుట్టిపరుఅమ్మ కూడా మంచి విదుషీమణి. తండ్రి కటుతోట ముల్లేశర దామోదరన్ మూసద్ గారు. కళాప్రియుడు వాగ్మి.

వల్లతోల్ బాల్యంలోనే మేనమామవద్ద శిష్యరికం కుదిరింది. రాపుని మీనన్ పండితుడు, భిషగ్వరుడు, బ్రహ్మచారి.

ఆ తర్వాత వల్లతోల్ కైక్కలంగార రామ వరియార్ అను సంస్కృత పండితునివద్ద తర్కం చదువుకొన్నారు. ఈ ఉభయుల ప్రభావమూ ఆ బాల్యంలో ఆ జీవితంపైన హత్తుకొంది.

పదునాల్గు పదునైదేళ్ల ప్రాయంలోనే వల్లతోల్ కవిత్వ మారంభించెను. అప్పటికి మళయాళసాహిత్యంలో, కేరళవర్మ, వేన్మని నంబూద్రిపాద్, కథాళి అచ్యుతమీనన్, కొడుంగల్లూర్ తంపూరాన్‌లు దిగ్గజాలు. పూర్వ కవిత్వరీతులతో, కథావస్తువు నడుపుతూ సమస్యా పూరణాలు, ఓతశ్లోకాలూ, శృంగార భక్తి రసాలతో రచించటమే వారికి పనిగా ఉండేది. మొదట వల్లతోల్ కవిత్వమూ ఈ పంథాలోనే నడిచింది. శివదేవుని స్తోత్రము రచించారు. ఆ యీడున అంత చక్కని శైలీ, సౌలభ్యము, భాషాప్రవేశమూ ఉన్న కవిత్వం ఆయనే వ్రాశారు.

ఆ రోజుల్లో మళయాళకవిత్వంలో రెండు రకాలు ప్రముఖంగా ఉండేవి. రాకపోకలన్నిటికీ పడవప్రయాణమే ఉసులుపాటైన మళయాళదేశంలో పడవపాటలకు ప్రసిద్ధి ఎక్కువ. మళయాళీమహాకవులు చాలామంది పురాణకథలను పడవపదాలుగా రచించారు.

"తపతీసంవరణం" మొట్టమొదట ఈలాంటి గేయంగా వల్లతోల్ రచించారు. ఆ కవి ఉత్తమకావ్యంగా ఆ పాట నిలిచింది. తరువాత వాల్మీకిరామాయణము అనువాదం ఆయన్ను మురిపించింది.

జానపదగేయాలు కాక మళయాళీకవుల నాకర్షించిన రెండవ విధానమూ, సంస్కృత కావ్యఫక్కిలో మహాకావ్యరచన. వల్లతోల్ ఈ పద్ధతిలో "చిత్రయోగం" అనే కావ్యం రచించారు. "కవిత్వం మంచిదిగాని కథ చెడ్డది" అని విమర్శ బయలుదేరింది. వాల్మీకిరామాయణము మళయాళంలో రచించటంలో వల్లతోల్‌కు కావ్యశైలి ఘనంగా అవగత మయింది.

రామాయణం పూర్తి అయేటప్పటికి, ఆయనకు చెవుడు సంప్రాప్తించింది. ఎంతకూ కుదరలేదు. "బధిరవిలాపం" అనే కావ్యం ఆయన రచించాడు.

"కవినాదామన్న ఉత్సుకతలో కవిత్వం రచించి మహాత్ముల శ్రవణేంద్రియాలను నొప్పించాను. ఏతత్ఫలంగా నాకీ బధిరత్వం ప్రాప్తించింది" అని ఆయన విలపించాడు. ఇది కవి సమయం తప్ప యథార్థంకాదని మళయాళ సాహితీపరులు అంటారు. ఆయనతోపాటు ఆయన బధిరత్వానికి విలపిస్తారు. స్వాతంత్ర్యోద్యమం ఆయన్ను ఆకర్షించింది. మహాత్మునిపై గీతాలు రచించాడు. "అనిరుద్ధ", "గురునాథ" అనే కావ్యాలలో స్వాతంత్ర్యపిపాసను చిత్రీకరించారు. ఆయనగేయాలు స్వాతంత్ర్యోద్యమప్రచారానికి విరివిగా పనికివచ్చాయి.

ఇప్పుడు వల్లతోల్ నారాయణమీనన్ గారికి 71 సంవత్సరాలు. ఈ కవి ప్రాచ్యసంస్కృత జ్యోతిని ప్రతీచీ ఖండాలకు అందిస్తూ ఇల్లాగే ఇంకా సేవ చేయగలడు.

మహామహోపాధ్యాయ కృష్ణమూర్తిశాస్త్రిగారు

తిరుచినాపల్లి జిల్లా, ముసిరి తాలూకాలో, కట్టుపుట్టూరు వీరి జన్మస్థానము. కులితలై హైస్కూలులో ప్రాథమికవిద్య నభ్యసించారు. స్కూలులో చాలా అల్లరిచిల్లరగా ఉండేవారు. కాని పరీక్షలలో ప్రథమ బహుమానాలు వీరివే. బాల్యంలో వీరి మేధాశక్తికి గురువులు ఆశ్చర్యపోయేవారు.

చిన్నప్పటినుంచి హరికథాకాలక్షేపాలలో మక్కువ అధికం. చిననాడే తల్లిదండ్రులు ఆస్తి గోల్పోయారు. స్కూలుచదువు ఆగిపోవలసి వచ్చింది. శాస్త్రపాఠశాలలో అతికష్టంమీద చేరారు. కారూర్ పాఠశాలలో భువరాఘవాచార్యనివద్ద సంస్కృతం అభ్యసించారు. చిననాడే సహాధ్యాయులకు రఘువంశం పాఠం చెప్పగల ప్రతిభ కృష్ణమూర్తిశాస్త్రిగారికి ఉండేది.



చిన్ననాడే సంస్కృతంలో శ్లోకరచన ప్రారంభించారు. కామకోటిపీఠ శంకరాచార్యస్వామి మొదలైన పెద్దలంతా వీరి సంస్కృత రచనను అభిమానించి చాలా మెచ్చుకొన్నారు. సంస్కృతవిద్యాభ్యాసంలో ఒక గురువునుమించి మరొక గురువువద్ద అభ్యసిస్తూ పర్యటించారు.

శ్రీ లీలా దండపాణి దీక్షితార్ గారికి ప్రభుత్వం మహామహోపాధ్యాయ బిరుదం ఇచ్చినప్పుడు, దీక్షితార్ గారిపై వీరు రచించిన స్తుతిమాలను అందరు చాలా మెచ్చుకొన్నారు. సత్కథాకంఠీరవ, వ్యాకరణ స్థాపక, పండితరాజ, మొదలైన బిరుదాలను కొచ్చిన్ మహారాజా కంకరస్వామి (కామకోటి పీఠ) మొదలైన పెద్దలంతా వీరిపై కురిపించారు.

1946 లో మద్రాసు ప్రభుత్వము వీరికి మహామహోపాధ్యాయ బిరుదం ఇచ్చింది.

వీరి కిప్పుడు 54 ఏండ్లు. మధుర "రామేశ్వర దేవస్థాన పాఠశాలలో" వ్యాకరణ అధ్యాపక ముఖ్యులు. సంస్కృతంలో దాదాపు ఇరువది దాకా శ్లోకమాలికలు రచించారు. "ప్రకృతి విలాసం అనే అష్టకాన్ని, మహాత్మ విజయం" అనే చంపూ కావ్యాన్ని సంస్కృతంలో రచించారు.

భారతదేశపు వ్రాతసిరా పరిశ్రమ

(గత సంచిక తరువాయి)

శ్రీ బ్రహ్మాండం ఆంజనేయులు

వాడుకదారుల అలవాట్లు—నీలకృష్ణసిరాద్రవాలనుంచి సెడిమెంటు ఒక పరిమితిలో మాత్రమే విడుదల అవుతూఉండాలి. సిరాల నుండి అపరిమితంగా సెడిమెంటు విడుదలై అడుగుకు చేరటంవలన సిరాద్రవంలోని వర్ణపదార్థమంతా క్రమంగా తరిగిపోతూ ఉంటుంది. ఇంతేగాక అటువంటి సిరాలు సులభంగా ఫౌంటెన్ కలమునుండి ప్రవహించలేవు. వెల్తురు, గాలి చొరనట్టి బుడ్లలో ఈ నీలకృష్ణవ్రాతసిరాలను నిలవఉంచినట్లైతే సెడిమెంటు ఏర్పడటం చాలా వరకు తగ్గుతుంది. వ్రాతపని పూర్తిఅయిన తరువాతకూడ సిరాబుడ్ల మూతలు తెరచి యుంచకూడదు. సిరాద్రవాల్లో వ్రాస్తూన్న కలం పాళీలను ముంచి అలాగేవదలి మరియొకపనికి పోగూడదు. ఇనుపముక్కలు నీలకృష్ణ సిరాలను విరుగగొట్టుతాయి. ఈ ఆమ్లీకృతమైన వ్రాతసిరాలలో పాళీలవంటి ఇనుపముక్కలను నిలువయుంచినట్లైతే ఆ సిరాద్రవం 'తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదంగా' వేరుపడుతుంది. వ్రాతపని అయినవెంటనే ముంచి వ్రాసే కలముల ఇనుప పాళీలను, గొట్టాలను చక్కగా మంచినీటిలో కడిగి ఉంచుకోటం మంచి అలవాటు. అలాగే ఫౌంటెన్ కలాల్నికూడా సిరా అయిపోయిన వెంటనే చక్కగా మంచినీటితో కడిగిన తరువాత మాత్రమే తిరిగి సిరాతోనింపడం ఒక మంచి లక్షణం.

ఆఫీసులలో మేజాబల్లలమీద నుండేసిరా తొట్లను మూత తెరచి తిరుగుతూన్న గాలి పంకా క్రిందవదలి ఉంచకూడదు. ఇలా వదలితే ఆ సిరాద్రవం తొట్లలోనే ఆరి పేరుకు పోతుంది. అమ్ల స్వభావంగల ఫెర్రోగాలేటు నీలకృష్ణసిరాలకు సున్నం, చాకలిసోడా, చలవసున్నాలవంటి క్షారరసాయనాలతో కూడ సిరాద్రవాలు విరిగిపోతూ ఉంటయి. నీలకృష్ణసిరావ్రాతలు వెలుతురుకు చలించవుగాని చలవ సున్నంవంటి హరిన వాయువును విడుదలచేసే రసాయనములతో పూర్తిగా విరిగిపోతూంటై. దీపపుమసి రంగు పదార్థంగాగల "ఇండియన్ ఇంక్సు" యొక్క వ్రాతలు హరినవాయువుకు ఏమాత్రం చలించవు. కాని ఈ 'ఇండియన్ ఇంక్సు'లో నీటకరిగే సర్బ్బసు, బంక వర్ణవాహకంగా వుండటం చేత వీని వ్రాతలు అతితేలికగా నీటిలో కడుక్కుని పోతూఉంటయి. సర్బ్బసు, బంక నీళ్లలో దీపపు మసిని కలిపి మెత్తగా నూరి ఆ ద్రవానికి బూజుపట్టకుండా లవంగ అరకును చేర్చి ఉత్తర దేశంలో మార్వాడీవర్తకులు ఈ రోజువరకు కూడ ఈ నల్లగా వ్రాసే సిరాలను తయారుచేసి వారి పద్దుపుస్తకాలను, ఉత్తరాలను వ్రాసుకొంటూ ఉంటారు. ఇంతేకాకుండా ఈ యిండియన్ ఇంక్సును ఉపయోగించి దేశపటాలను, పొలముల ప్లానులను, చిత్రలేఖనాలను కూడ చిత్రిస్తూంటారు.

—వ్రాతసిరాల కుండరాని దుర్గుణాలు—

వ్రాతసిరాలు కలముల పాళీలలో అతివేగంగాను, కాగితంమీద అతినెమ్మదిగాను ఆరకూడదు. కలాల్లో గడ్డకట్టి ధారాళ ప్రవాహాన్నడ్డగూడదు. ఆరినమీదట వ్రాతలు వేలి కంటగూడదు. వ్రాత నెమ్మదిగా ఆరటంవలన సిరాద్రవం అతిగా కాగితంలోని కింకి దాని రెండవవైపుకు కూడ చొచ్చుకు పోరాదు. ఫౌంటెన్ కలపు పాళీముక్కుమీద సిరాద్రవం ఆరి గడ్డకట్టరాదు. సెడిమెంటును అతిగా దిగవిడువరాదు. వ్రాతలు నీటితో కడుక్కొని పోరాదు. రంగు వెల్తురుకు వెలువరాదు. సిరాబుడ్లలోనే సిరాద్రవం పేరి గడ్డకట్టరాదు. ఉక్కు పాళీలమీద గాని, బంగారపు పాళీలమీదగాని పేరి నల్లనిపొరలు యేర్పడరాదు. ఇవి ఉక్కు పాళీలనుగాని, కాగితాన్ని గాని కొరకి పాడు చేయరాదు.

వివిధ ఉపయోగాలకు అనువైన

—సిరాలు—

నీలకృష్ణ సిరాలను ఫౌంటెన్, పాళీకలాల కోసమే గాకుండా నకళ్లనుతీసే సిరాలుగాకూడా తయారుచేస్తున్నారు. ఇంతేగాక రబ్బరుస్టాంపు సిరలని, క్షారస్వభావపు వ్రాతసిరాలనీ, వ్రాత కనుపించని సిరాలని బట్టలమీద గుర్తులు వేసే సిరాలనీ చైనీసు ఇండియన్ సిరాలని వివిధ అవసరాలకు పనికివచ్చే సిరాలుగూడ తయారౌతున్నై. నీలకృష్ణ నకళ్లసిరాను మామూలు పాళీ కలపు సిరాకంటె రెండురెట్లు చిక్కదనముతో తయారుచేస్తూ ఉంటారు. ఈనకళ్లసిరా వ్రాతలు రెండు రెట్లలో రంగుపదార్థమును కలిగియుండేనే అవి స్ఫుటంగా కనుపిస్తూ నకళ్లనుగూడ స్ఫుటమైనరంగులో కనుపించు నట్లు చేస్తవి. ఈ వ్రాతలు కాపీ తీయకముందే ఆరిపోకుండా చేయటానికి ఈ సిరాలలో అధికంగా గ్లిసరీను వాడుతూ ఉంటారు. నకళ్ల సిరాలతో వర్తకులు మత వ్యాపారపు టుత్తరాలను వ్రాసి కాపీయింగ్ ప్రెస్ సహాయంతో నీటికి నకళ్లను ఉల్లిపొర కాగితాలమీద పల్చని గుడ్డలోని తడి సహాయంతో పొందుతూ ఉంటారు. ఉదారంగు రబ్బరుస్టాంపు సిరాలను స్టాంపుపేడ్‌లమీదకు చేర్చి వర్తకులు, ఆఫీసులు తమ కవసరమైన రబ్బరు ముద్రలను ఈ సిరావత్తుడు మీదవత్తి కాగితాల మీద సిరాముద్రలను పొందుతూ ఉంటారు. ఈ సిరాలుగూడ స్టాంపుపేడ్ మీద గాని రబ్బరు ముద్రపైగాని వేగంగా ఆరిపోకుండా చేయడానికి ఇందులో హెచ్చుగా గ్లిసరీను చేరుస్తారు. క్షారస్వభావపు వ్రాతసిరాలు గాలికి ఆరినా గూడ అందులో సెడిమెంటు ఏర్పడదని, అందుచేత వాటిలో ధారాళ ప్రవాహశక్తి అధికంగా వుంటుందని వాటితో సబ్బువంటి క్షారపదార్థాలకు చుట్టే కాగితాలమీద గూడా వ్రాయవచ్చునని చెపుతారు. వ్రాత కనుపించని సిరాలతో మునుపటివాళ్లు రాజకీయ పురహస్యపు టుత్తరాల్ని, ప్రేమ లేఖ ల్ని వ్రాస్తూండేవారని గూడ చెబుతారు. చాకలి కేవుకువచ్చే బట్టలు మారుపడకుండా చేయడానికి గుర్తువేసే సిరాలను ఉపయోగించి బట్టలమీద గుర్తులువేస్తూ ఉంటారు. చైనీసు ఇండియన్ ఇంక్‌తో కొందరు చిత్రకారులు చిత్తరువులను వ్రాస్తూఉంటారు.

—నీలకృష్ణ సిరా తయారీ—

వ్రాతసిరా తయారీకి టానిక్, గాలిగ్ ఆసిడ్లు, అన్నభేది (లోహగంధకితము) చాల ప్రధానం అని మనం తెలిసికున్నాం. కరక్కాయ, మాచికాయ డి-డి కాయల్లోను, తుమ్మంగేడువంటి చెట్ల బెరళ్లలోనూ, తేయాకులోనూ ఈటానిక్, గాలిక్ సేంద్రియామ్లాలున్నవి. డి-డి కాయల్లో ఉన్న టానిక్ ఆమ్లం మిగిలిన అన్నిటిలోకంటె గూడ చాల స్వచ్ఛంగా ఉంటుందని చెపుతారు. ఇందులో జిగురు పదార్థాలుకాని శుకసంబంధమైన కొయ్యచెత్తవంటి కల్మషాలు కాని చాల సూక్ష్మస్థాయిలో మాత్రమేఉన్నై. ఈ జిగురు, కొయ్యచెత్తలవంటి కల్మషాలే తయారైన సిరాద్రవంలో ప్రవేశించి దాని ప్రవాహక సౌలభ్యాన్ని అరికడుతూ ఉంటై. ఈ కల్మషాలు డి-డి కాయల్లో చాలా తక్కువగా ఉన్నైగనుకనే ఈ కాయలతో నాణ్యమైన ఫౌంటెన్ కలపు సిరాలు తయారు చేస్తూంటారు.

దక్షిణదేశంలో డి-డి కాయలు పుష్కలంగా లభిస్తాయి. కరక మాచికాయలు అలాగే మన దేశపు ఉత్తరప్రాంతంలో దొరుకుతై. ఈ డి-డి చెట్లను పెద్ద పెద్ద బంగళాల ఆవరణలకు చుట్టూ కంచెగా నాటుతూంటారు. ఈ చెట్లు షుమారు 15 అడుగుల ఎత్తువరకూ పెరుగుతై. ఇవి గుబులుగా పొడుగాటి కొమ్మలతో విస్తరిస్తై. సాధారణంగా వేసవికాలంలో ఈ చెట్ల నుండి కాయలుపండి రాలుతై. ఈలా పండి నేలపై రాలిన కాయలను మాత్రమే ప్రోగు చేస్తూ ఉంటారు. పండి రాలిన డి-డి కాయలు ముదురుగోధుమవన్నెలో వుంటై. ఇవి బద్దగా వుండి చుట్టలుచుట్టుకొని రాలుతూ వుంటై. వీని పొడుగు సుమారు రెండు మూడంగుళాలుండి వీనిలోని గింజలు చాల చిన్నవిగ వుంటై. అవి నున్నగాను లేత గోధుమరంగులోను కనుపిస్తై. మదరాసువారీకాయల్ని "ఇంకికాయ" (సిరాకాయ) అనిపిలుస్తారు. వీరీ కాయల్ని విరివిగా ఇతరదేశాలకు ఎగుమతిచేస్తూ ఉండేవారు. తెలుగు ప్రాంతాలలో ఈ కాయలను డి-డి కాయ లంటారు. టానిక్ ఆసిడ్ కషాయం కోసరం ఈ డి-డి కాయలను ముందు చిన్న చిన్న ముక్కలుగా చితిపి వానిలోని గింజలను ఏరివేసిన తరువాతనే ఈ కాయలపొట్టును నీళ్లలో నానపెట్టాలి. గింజలతోసహా ఈ కాయల్ని నీళ్లలో నానవేస్తే, ఈ గింజలలోఉండే నూనె కొంతవరకు తయారైన సిరాలో ప్రవేశించి ధారాళ ప్రవాహాన్ని అడ్డుతుందని చెబుతారు.

—12 లీటర్ల సిరాతయారీ విధానం—

(శీతల పద్ధతి)

వర్షకాలంలో వాననీళ్లనుపట్టి నిలవయుంచుకోవాలి. క్రొత్తగా ప్లాస్టరు చేసిన సిమెంటు, సున్నపుడాబా నేలల నుంచి మాత్రం సిరా తయారీ కొరకు నీళ్లను పట్టవద్దు. క్రొత్తగా చేసిన సున్నం, సిమెంటు ప్లాస్టరునుండి క్షార సంబంధమైన కొంరు పదార్థాలు వాననీళ్లలో కరిగివస్తై. అందుచే తయారైన సిరాలు ఈ క్షారరసాయనాల వలన విరిగిపోతై. వాననీళ్లను గుడ్డతేరాల నుండి పట్టే పద్ధతి చాల శ్రేష్ఠం. అలాగే తయారైన సిరాలనుగూడ ద్రావకాలకు తాళే మెరుగు పూతవున్న పింగాణీ జాడీలలో నిలవచేసి తేరబెట్టటం శ్రేయస్కరం. తల్లిసిరా—$1\frac{1}{4}$ పౌను డి-డి కాయలపొట్టు తూచి ఆరు లీటర్ల (6000 సి. సిలు) వాననీళ్లున్న మట్టికుండలో పోసి నానపెట్టాల. టానికు ఆమ్లపుకషాయము సులభముగాకావటానికి కాయపొట్టును సంచీలో పోసిదింపాలి. ఈ సంచీని నీళ్లమధ్య తేలేటట్లు, కుండమూతికి అడ్డంగా వేసిన తాగాడికి దారముతో వ్రేలాడ గట్టాలి. ఈ పద్ధతివలన కషాయము తిసులువుగా అవటమే కాకుండ ఈ కషాయపు ద్రవంలోకి కాయలలోని కొయ్యచెత్తవంటి నలకలు ప్రవేశించటానికి అవకాశముండదు. తరువాత 2 ఔన్సులు మాచికాయ ముక్కలను తూచి 1 లీటరు వాననీళ్లలో నానపెట్టాలి. టానిక్ ఆమ్లము అధికభాగంగాగల డి-డి కాయలు సిరా వ్రాతలకు శాశ్వతస్వభావాన్ని కలిగిస్తాయని, గాలిక్ ఆమ్లపుపాలు హెచ్చుగా నున్న మాచికాయకషాయము వలన వ్రాతలు మంచి నల్లనికాంతిని కలిగి ఉంటాయని చెపుతారు. $\frac{1}{4}$ పౌను అన్నభేది స్ఫటికములను మెత్తగా పొడిచేసి దానిని 2 లీటర్ల వాననీళ్లున్న గాజుపాత్రలో చేర్చి ద్రావణము చేయాలి. ఈ యన్నభేది ద్రావణాన్ని ఇనుపపాత్రలోగాని ఇతర లోహపుపాత్రలలోగాని చేయరాదు. తయారైన సిరాలనుగూడ లోహసంబంధమైన పాత్రలలో నిలువ యుంచరాదు. ఈ పై మూడు ద్రవాల్ని ఒకరాత్రంతా నిలువయుంచాలి.

మరునాడు ప్రొద్దున డి-డి కాయల గుడ్డ సంచీని కషాయమునుంచి బయటకు తీసి ఆ కషాయాన్ని పలుచటిగుడ్డ పొరలోనుండి వడపోస్తూ 15 లీటర్లుపట్టే, ద్రావకాలకు తాళే పింగాణీ జాడీలోనికి మార్చాలి. ద్రావణపు అడుగున కరుగక నిలచియున్న పలుకులను పూర్తిగా కరిగేటట్లుగా అన్నభేది నీళ్లను గాజుకఱ్ఱతో చక్కగా కలపాలి. తరువాత అన్నభేది నీళ్లను బాగా కలుపుతూ లఘుఉదజ హరికామ్లపు స్థిరకారిని జేర్చాలి. 16 సి. సి. లు గాఢ ఉదజహరికామ్లాన్ని 10 సి. సి. లు వాననీళ్లలో కలిపి స్థిరకారిద్రవాన్ని ముందుగా తయారు చేసుకోవాలి. ఈ యావత్తు ఆమ్లాన్ని ఒక్కమారుగా అన్నభేది నీళ్లకుచేర్చి బాగా కలపాలి. వెంటనే ఈ ఆమ్లీకృతము చేయబడిన అన్నభేదినీటిని డి-డి మాచికాయకషాయాలతో చేర్చి అంతటిని చక్కగా గాజుకఱ్ఱతో కలపాలి. ఆమ్లము చేర్చినతరువాత అన్నభేదినీళ్లను హెచ్చు కాలము టానిక్, గాలిక్ కషాయాలతో చేర్చకుండా జాగుచేయరాదు. జాగువలన సిరాలో స్థిరకారిగా పనిచేయవలసిన ఆమ్లమంతా అన్నభేది ద్రావణములోని 'ఇనప్ హైడ్రాక్సైడ్' వంటి కల్మషముతో పనిచేసి వృథాగా ఖర్చైపోతుంది. ఇప్పుడీ మిశ్రమ ద్రవాన్ని తల్లిసిరా అంటారు. ఇది నీళ్లమాదిరిగా ఏరంగు లేకుండ మొదట్లో వ్రాసి ఆరుదలమీద క్రమంగా నలుపుకు తిరుగుతూ ఉంటుంది. వ్రాసినవెంటనే ఈ తల్లిసిరా వ్రాత స్ఫుటంగా కనుపించదుగనుక దీనికి తాత్కాలిక వర్ణపదార్థాలు చేరుస్తూ ఉంటారు.

—తాత్కాలిక వర్ణపదార్థములు—

సాధారణంగా 'కోల్‌తారు'కు సంబంధించిన కృత్రిమ నీలిరంగును తాత్కాలిక వర్ణపదార్థముగా వాడుతూఉంటారు. కాని దురదృష్టవశమున ఈ మాదిరి రంగు పరిశ్రమలన్ని పరాయి దేశములలోనే ఉన్నయి. పాళీలు ముంచివ్రాసే కొన్ని రకముల వ్రాతసిరాలలో నీటిలో కరిగే "ఇండిగో కార్మైన్"వంటి నీల రంగును తాత్కాలిక వర్ణంగా వాడవచ్చు. కలకత్తావంటి ముఖ్యనగరాలలో మంచిరకపు 'ఇండిగో కార్మైన్' ఇపుడు తయారవుతున్నది. దీనిని నీలి మందునుండి తయారుచేస్తారు. దీనినే 'చైనీసునీలము' అని గూడ పిలుస్తూఉంటారు. నీలిమందును మెత్తగా పొడిచేసి ఆ పొడిని గాఢగంధకధృతిలో చేర్చి ఆవిరిమీద ఉడకబెడితే నీట కరుగని ఈ నీలి మందు అంతా నీటిలో ద్రావణమై పోతుంది. తరువాత ఈ నీళ్లను ఆవిరిమీద మరిగించి పూర్తిగా ఇగురపెట్టటంవలన నీటిలో కరిగే నీలి మందుముక్కలు లభిస్తాయి. నీలిమొక్కలను విరివిగా కృష్ణ, గోదావరి లంకలలో పెంచేవారు. పూర్వీకులు ఈ నీలిఆకులను తొట్లలో వేసి నీటితో మురగపెట్టి నీలిమందును తయారు చేస్తూండేవారు. రెండవ ప్రపంచసంగ్రామమునకు పూర్వము మనదేశమునుండి ఈనీలిమందు విరివిగా జర్మనీదేశానికి ఎగుమతి అయేది. ఇలా ఇతర దేశాలకు ఎగుమతి అయేనీలిమందులో మన దేశవాళీవర్తకులు అధిక లాభదృష్టితో వండ్రుమట్టిని కలిపి పంపుతూఉండేవారని గూడా వింటూంటాము. మన నీలిమందువ్యాపారసుల దగాకోరుతనాన్ని జర్మనీవారు భరించలేకపోవటంచేత నేబొగ్గుతారునుండి కృత్రిమంగా గారంగులు తయారుచేసే పద్ధతిని మొట్టమొదటగా కనిపెట్టవలసిన అవసరము వారికి ఏర్పడిందని కూడ చెపుతారు. ఈ నీలిమందు తయారుచేసే పద్ధతిని ఇపుడు మనము పూర్తిగా మరిచాము. ఈ పరిశ్రమను దేశంలో గ్రామీణులకు అనువయ్యే పద్ధతిలో పునరుద్ధరించటం ఎంతో అవసరము. ఫెర్రోగాలేటు వ్రాతసిరాల్లోచేర్చడానికి అనువగు తాత్కాలికరంగు పదార్థాన్ని ఏరుకోవటంలో మనం చాల జాగ్రత్తగా ఉండాలి. ఈ సిరాయొక్క ఆమ్లతతో వికటించని విధంగా చూచి తాత్కాలిక రంగుపదార్థాన్ని మన మేరుకోవాలి. ఇందునిమిత్తం సాధారణంగా ఇంకుబ్లు, ఏ. యస్., హోలీషియాబ్లు, ఇంకుబ్లు స్పెషల్‌వంటి ఆమ్లపురంగులను వాడుతూ ఉంటారు.

తాత్కాలికవర్ణ ద్రావణ

$2\frac{1}{2}$ ఔ॥ నీటిలో కరగే నీలిరంగును తూచి మూడు లీటర్ల వాననీళ్లున్న గాజుపాత్రలో చేర్చి ద్రావణం చెయ్యాలి. దీన్ని ఒక రోజంతా ఉంచి అడుగుకు చేరే ఇనుపరేకులను, ముక్కలను వడబోసి ద్రావణం నుండి వేరు చేయాలి. ఈ ఇనుపరేకులు తయారైన సిరాలో చేరితే అదివిరిగిపోతుంది. ఇలావడ

(26-వ పేజీ చూడుడు)

పక్షుల్లోను - జంతువుల్లోను - నాట్యకళ

(22-వ పేజీ తరువాయి)

ఈ తెలిసినవిషయాలతో ఆజంతువుల మానసిక పరిణామాలను మనము కనిపెట్ట గలుగుతా మను కోకూడదు. జంతువులు చేయు చేష్టలు చాలా నిగూఢభావపరంపరతో కూడికొని యున్నవి. వాటి భావాలను నోటితో చెప్పికొని, కలముతో వ్రాసికొనే జ్ఞానము వాటికి లేదన్నమాటేగాని భావప్రదర్శనలో మానవులకన్నా జంతువులు మించుచున్నవి.

సాలీడు ప్రణయము.


సాలీడుల ప్రణయకలాపము చాల గమ్మత్తుగా నుండును. ఆడసాలీడుముందఱ మొగసాలీ డుంటే ఏనుగుముందఱ నక్క యున్నట్లే. ఆడసాలీడుకు "కొంపరు" చాల ఎక్కువగా నుండును. అందుచే మొగసాలీడు దాని ముందుకు రావాలంటే దాని అనుజ్ఞ తీసికొనవలెను. అది వచ్చుచున్నట్లు కొన్ని సూచనలు చేసి అనుమతి పొంది ఆడసాలీడుతో ప్రణయమునకు దిగవలెను. లేక ఏ సమయములో పడితే ఆ సమయములో ఆడసాలీడుతో ప్రణయానికి దిగితే మొగసాలీడుకు యమలోకయాత్రయే గతి. తోటలలో నివసించే సాలీడుల ప్రణయము వాటి అల్లిక యుండ్లయొక్క కొన్ని పోగులను అల్లల్లాడించటంతో మొదలగును. ఈ విధంగా కదలించటంవల్ల మొగసాలీడు ఒక దారముమీద పరుగెత్తుచున్నచో ఆడసాలీడు అదే దారముమీద దానిని వెంబడించుటకు వీలగును. రీపుపక్షులమాదిరి మొగసాలీడులు ముష్టియుద్ధాలకు దిగునుగాని వాటి యంత ప్రమాదమును కలిగించుకొనవు.

ఈ మొగ ఆడ సాలీడులు తమాషాగా నృత్యము చేయ నారంభించును. మొగసాలీడు తన భేషజాలను డాబుసరిని ప్రదర్శించుచూ ఆడసాలీడుముందఱ నిలబడును. ఆడసాలీడుకు దగ్గిర దృష్టియేగాని దూరదృష్టి లేదు. మొగసాలీడు ఆడదానిముందు అర్ధవృత్తాకారముగా ముందఱకు వెనక్కు చాల సాగులు తిరుగును. లేకపోతే ఆడసాలీడుచుట్టూ ప్రదక్షిణలు చేయును. కొంత సేపటికి ఆడసాలీడు తన నిగ్రహము నింక ఆపుకోలేక మొగసాలీడుతో కలిసి నృత్యము చేయును. ఆవిధంగా మొగసాలీడు 3 సార్లు ప్రదక్షిణలు చేయుటను పెకహోమ్స అనే శాస్త్రజ్ఞుడు చూచినాడు. కాని యీ ప్రణయకలాపము మొగసాలీడున కెప్పుడు ప్రమాదమే! ఏ మాత్రము కోపము వచ్చిననూ, ఆడసాలీడు మొగదానిమీద పడి చంపివేయును. ఈ భయము మొగసాలీడు కున్ననూ, ప్రకృతి సహజానికి తల ఒగ్గి దాసుడౌచున్నది. ఈ ప్రణయనృత్యమువల్ల ఆడసాలీడు అభిరుచులను అభివృద్ధి చేయవచ్చునేగాని అది అంత తేలిక పని కాదు.

పీతల్లో ప్రేమ.

హిందూ సముద్రతీరంలో ఎండ్రకాయలు చాల చిత్రప్రణయాలను చేయుచుండును. పీతకు ముందఱ రెండు వంపుతిరిగిన కాళ్ళుండును. ఇవి మిగతావాని కన్న పెద్దవి. కుడిభాగము రంగులు రంగులుగా మెఱయుచుండును. ఒక ఎండ్రకాయదాని భార్యనుగానిభర్తనుగానిచూచి నప్పుడు ముందు కుడివైపు కాలిని రంగులన్నియు తళతళ మెఱయునట్లు కదలించును. కొన్ని సంకేతశబ్దాల నుచ్చరించును. అప్పు డిది చేయు నృత్యము నెమలి చేయు నృత్యమువలె నుండును. ఇదిగూడ ఒక తాళమునకు బద్ధమై యుండును. కాని యీ తాళముయొక్క కాలపరిమితి హెచ్చు. ప్రకృతివిచిత్రాలను చూస్తుంటే, జంతువులుగూడ మనుష్యులమాదిరి చేయు నృత్యాలను గమనిస్తుంటే, జంతువుల్లో ప్రణయకలాపాలను పరికించుతుంటే, నిజంగా ప్రకృతి సౌందర్యము మన హృదయాలను కంపింపజేస్తుంది.

———



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

38

(అన్నమాచార్యరచన చరిత్ర పీఠికలోనిది పు. ౧౧౪)

లలితరాగం - రూపకతాళం

రాగలక్షణము :

చాలా ప్రాచీనమైన రాగం. మతంగుడు దీనిని గ్రామరాగమగు 'టక్క' రాగమునకు 'భాష' గా లక్షించినాడు. (బృహద్దేశి పు. ౧౧౭) శుద్ధమైన మతంగలక్షణపాఠం లభింపలేదు గాని ఉన్నదానిని, ఇచ్చిన లక్ష్యాన్ని బట్టి చూడగా, అప్పటికే ఇది సప్తస్వర సహితమైనా, రి - ప స్వరాలు దుర్బలాలుగా, షాడవంగానూ ఔడవంగానూ ప్రయోగించుచున్నట్లు కానవచ్చును. శు - రి, అం - గా, శు - మ, శు - ధ, కా - ని స్వరములు గలది. టక్కరాగానికివే స్వరాలు. దానిలోని మ రి గ స - స ధ - ధ ని ధ స - ఇత్యాది వక్రసంచారాలను వదలి ధారాళమైన ఆరోహావరోహాలతో ఈ రాగం బయలుదేరినది. రామామాత్యుని కాలానికిది మాలవగౌళ మేళంలో చేరింది. పంచమం పూర్తిగా వదలిన షాడవరాగంగా ఆతడు లక్షించినాడు. (స్వ. మే. క. రా. పు. ౩౬) సోమనాథునికి 'లలితా' అని యొక స్త్రీరాగమూ, 'లలితః' అని ఒక పుం రాగమూ లభించినవి మొదటిదానికి శుద్ధమధ్యమమూ, రెండవదానికి ప్రతిమధ్యమమూ వచ్చును. మొదటిది 'శుద్ధలలిత' అని కూడా అన్నాడతడు. తక్కిన స్వరాలు సమానమే. రెంటనూ పంచమ మున్నా అది దుర్బలమే. (రా. వి. వివే. ౫) గోవిందదీక్షితుల కాలానికిది శుద్ధంగా 'స షాడవః పంచమవర్జనాత్' ఐనది. (సం. సుధ; ప. ౭౧౩) ముద్దుస్వామి దీక్షితుల కాలంవరకూ ఈ మతమే నిలిచి వచ్చినది. సుబ్బరామదీక్షితులు ఈ సంప్రదాయాన్నే రక్షించుకొని వచ్చినాడు.

కాని ఈనల 'వసంత' కూ 'లలిత' కూ స్పర్ధ కలిగింది. రెంటిలోను మొదలు దుర్బలంగా ఉన్న పంచమం క్రమంగా నశించింది. సంగీతకళారహస్యనిధి రామరాజభూషణుడు 'వసంతము మహాసంపూర్ణభావోన్నతి' గలదిగా చాటినాడుగనుక (వసు. ౧-౧౫౯) 'చ్యుతపంచమము' దానిలో ప్రయోగించవలె నన్నారు లాక్షణికులు! (సం. సం. ప్ర. పు ౩౭౫) కాని పంచమం లేని రాగాలలో మధ్యమ స్వరం పంచమం వలె - షడ్జంవలె కూడా - ప్రధానమైన అంశన్యాసస్వరంగా మెరవడికి వస్తుంది. దానికి తరువాతి స్వరమైన ధైవతం చతుశ్రుతిగా నున్నప్పుడే రెంటికీ సంవాదం ప్రబలంగా వినవచ్చును. కనుక వసంతం మాళవగౌళలో పుట్టినా ధైవతం తీవ్ర మైపోయింది. ఆ మ - ధల సంవాదాన్ని మరిగిన వారి వాడుకలో 'లలిత' కు కూడా తీవ్రధైవతమే తనంత వచ్చి చేరుకొన్నది. ఫలంగా 'సీతమ్మ మాయమ్మ' అనే త్యాగయ్యగారి 'లలిత' కీర్తన తీవ్రధైవతంతోనే పాడే వాడుక వచ్చింది. శాస్త్రానికి రెండూ మాళవగౌళజన్యములనే చెప్పేది సంప్రదాయం. ఈ భ్రాంతిలో కొందరు వసంతకు శుద్ధ ధైవతాన్నీ, లలితకు చతుశ్రుతి ధైవతాన్నీ, మార్చి అంటగట్టినారు! (తచ్చూరివారి గాయకలోచనం. పు. ౫౩-౫౪)

మధ్యమ ప్రాబల్యంతో వసంతలో ధైవతం తీవ్రమై నిలిచింది గనుక, లలితను గూడా నిలుపుకోవలెనంటే కొంచెం దృష్టిని మార్చుకోవలసి వస్తుంది. ఇందలి అంతర గాంధారాన్ని న్యాసాంశస్వరంగా గ్రహించి ప్రయోగిస్తే శుద్ధ ధైవతం దానితో సంవాదాన్ని చూపుతూ రక్తిప్రద మౌతుంది గాంధారమూ మధ్యమమూ షడ్జంతో సమాన సంవాదం గల స్వరాలే గనుక వసంతలో గాంధారాన్నిగాని, లలితలో మధ్యమాన్నిగాని వదలుకోలేము. కాని వసంతకు మధ్యమమూ లలితకు గాంధారమూ ప్రధానస్వరాలుగా గ్రహించి పాడితే రెంటికీ భేదం స్పష్టంగా వినవచ్చును. మరి శుద్ధధైవతంతో సంవాదం గల స్వరం కాబట్టి శుద్ధఋషభం వసంతకంటె లలితలో ప్రబలంగా తోచును. మరీ, గమధా మగరీ, రీగమగరీ, ధారసరీ - ఇత్యాది ప్రయోగాలు ఇందులో రంజించును. 'రి మ గ రి, స రి మ గ' అని కూడా కల దంటాడు తులజా మహారాజు (సం. సా. పు ౮౭) న్యాయమే. ఇట్లే గాంధారంతో సంవాదం గల నిషాదం వసంతకంటె ఈ రాగంలో ఎక్కువగా ప్రత్యక్షము కాగలదు. నీ ధ మ గా, గ గ మ మ ధ ధ నీ, స నీ ధ మ ధ నీ ధ ధ ని ని సా - ఇత్యాదిగా ప్రయోగించవచ్చును. ధైవత గాంధార స్వరాలను అలంఘనాభ్యాసములతో ఎక్కువగా వాడవలసినది ఈ రాగంలోని తత్త్వం. మంద్రస్థాయి మధ్యమంవరకూ దీనికి సంచారం కలదనీ, 'స రి స మ గ మ' అనే ఆరోహణసంచారం కావలెననీ, చెప్పడం అంత ముఖ్యమైన రాగధర్మం కాదు. గ - ధ లు దీని జీవాతువులు. వాని చేరికలో గ గ ధా - ధ గా - గ గ నీ ధ గ మ గ ధా నీ గా, ధా రీ,—ఇట్లు మధ్యమాన్ని ప్రక్కకు త్రోసిరాజన్నా రక్తి చెడదు. ఇది ప్రాతఃకాలము పాడదగినదట.

[పల్లవి]

(౧) రి సా , రి ని సా గా గ గ | గ రి మా మ మ గ మ గ దా మ గ మ గ రి స ని
న మో నా రా య ణ నా వి న్న ప మి ది వో

(౨) రి స్సా , సా రీ రి స స ని సా గా గ గ | మ గ రీ స మ గ మ గ మ గ ధా మ గ మ గ రి స ని
న మో నా రా య ణ నా వి న్న ప మి ది వో

(౩) రి స స ని స రి స ని ధ ని స రీ స మా గ గ | మ గ రీ దా ధ ధ నీ ధ ని ధ మ గ మ గ రి స ని
న మో నా రా య ణ నా వి న్న ప మి ది వో

(౪) ,, ,, ,, | మ గ మా ని ధ సా స స ని స రి స ని ధ ని ధ మ గ రి స ని
,, ,, ,, నా వి న్న ప మి ది వో

[అనుపల్లవి]

స మా , గ మ ని ధ ని సా స | సా రి ని ధ ధ ధ మ గ రి స ని
స మా సు డ గా సు న న్న స ర్వే శ ర క్షిం చ వె

స మా గ మ ధా ధ ధ ధ గ మ గ మ ధ ని సా | ని స గా రి ని ధ మ ధ ని స రి స ని ధ మ గ మ గ రి స ని (నమో)
స మా సు డ గా సు న న్న స ర్వే శ ర క్షిం చ వే

[చరణం]

(౧) మ గ రి సా న్ని సా [illegible] మ గ | మ గ మ ధ నీ ధ ని ధ మ మ గ రి గ
మ న సు నీ [illegible] ధీ న ము మా ట లు నీ వా డె డి వే

కులాసా కబుర్లు:

"రాష్ట్రనిర్మాణ లిమిటెడ్ కంపెనీ"

[జి. యన్. సూరి]

రష్యా ప్రభావానికి ఆహుతి కాకుండా సాధ్యమైనంతవరకు యూరపు రాజ్యాలను బందోబస్తుచేయటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అట్లాంటిక్ ఒడంబడికలు, పశ్చిమ ఐరోపా కూటములు ఎన్నో క్రమంగా అవతరిస్తున్నవి. వీటి అన్నింటికి పెట్టుబడి అమెరికాది; వాంగుదారులు బ్రిటిష్ కన్సర్వేటివ్ పార్టీవారు. ఉభయులదీ వ్యాపారదృష్టే. అడిగిన దేశానికల్లా అప్పులుపెడితే అందుబాటులో ఉండి తీరక పోతారా అని వారి ధైర్యం.

ఈ విధానాన్ని సరియైన కట్టుదిట్టాలతో అమలుపరిచేందుకు ఒక లిమిటెడ్ కంపెనీని స్థాపించటానికి నిర్ణయించినట్లు ఈమధ్య ఒక ప్రకటన జరిగింది. చర్చిల్ వగైరాలు ఈ కంపెనీకి డైరెక్టర్లుగా ఉంటారుట. రిజిష్టర్డు ఆఫీసు లండన్‌లో ఉంటుందిట. అన్ని దేశాలలోను బ్రాంచి ఆఫీసులను నెలకొల్పుతారుట. పత్రికాముఖంగాను, రేడియోలద్వారాను, సమావేశాల వల్లను గుక్క తిప్పుకోకుండా ప్రచారం చేస్తారుట. ఎఱ్ఱరంగు కంటికి కనపడకుండా ముంచెలు పట్టుకుని వెల్లవేస్తారుట.

ఈ విషయంలో ఇంగ్లీషువాళ్లు మంచి అనుభవజ్ఞులు. ఈస్టిండియా కంపెనీ ద్వారా సామ్రాజ్యాన్ని సంపాదించగలిగిన అసాధ్యులు. ఈ కొత్త కంపెనీ ద్వారా రక్తవర్ణానికి విరుగుడు తేలేక పోతారని మనం సందేహించ నవసరం లేదు. ఇంపీరియల్ కెమికల్ వర్క్సు వాళ్లు కావలసినంత బ్లీచింగ్ పౌడరును అందించగలరు. రష్యా అద్దకం ఎంతవరకు తట్టుకుంటుందో చూడతగిన విషయం.

ఈ కొత్తకంపెనీ కమీషనుగురించి ఇంతగా వివరించటానికి కారణం లేకపోలేదు. దీనిని భోగట్టా యావత్తూ సేకరించి, బాగా పరిశోధించవలసిన బాధ్యత మననాయకులమీద ఉన్నది. ముఖ్యంగా ఆంధ్రులు విధిగా గమనించాలి. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించటానికి ఇంతకంటె సులువైన మార్గం మరొకటి లేదు. అఖిలాంధ్ర పరిషత్ సమావేశాలవల్లనూ, అగ్రనాయకుల డెప్యుటేషన్లవల్లనూ, నివేదికలవల్లనూ, ప్రాయోపవేశాలవల్లనూ ఒక్కనాటికీ ఆంధ్ర రాష్ట్రాన్ని సంపాదించలేము. అంతూ పొంతూ లేని బాధ్యతలను నెత్తిమీద పెట్టుకుంటే ఏపనీ సానుకూలం గాదు. అందువల్ల మితమైన బాధ్యతే ప్రధానంగా ఉండే లిమిటెడ్ కంపెనీ అన్ని విధాలా తగిఉంటుంది. చర్చిల్ అండ్ కంపెనీ కంటె ఆదర్శప్రాయమైనది మనకు మరొకటి ఉండదు.

ఆంధ్రనాయకులు వెంటనే ఇండియన్ కంపెనీల చట్టం క్రింద ఒక సంస్థను స్థాపించాలి. కావలసిన మెమొరాండమును, ఆర్టికిల్సును వేటి లాయర్లచేత తయారు చేయించాలి. కావలసి ఉంటే కాశీంరజ్వీ తరఫున వాదించటానికి పరుగెత్తుకునివచ్చి వనకకు వెళ్లిన రాబర్ట్సు దొర వారి సలహాకూడ పొందవచ్చును. ఈ కంపెనీని "ఆంధ్రరాష్ట్ర నిర్మాణపు కంపెనీ లిమిటెడ్" అని పిలవవచ్చును. ప్రధాన కార్యాలయం కూవు నదికి ఉత్తరంగా చెన్నపట్నంలోనే ఏర్పరచాలి. దీనిలో వాటాదార్లుగా చేరటానికి డబ్బు పెట్టుబడి అవసరం ఉండదు. రాష్ట్రం కోసం కొద్దోగొప్పో పాటుపడగల ప్రతి తెలుగు వ్యక్తి వాటాదారుకావచ్చును. అయితే మద్రాసుమీద హక్కు వదులుకోవాలని అనేవాళ్ళకు మాత్రం షేర్లు మంజూరు చేయకూడదు.

తెలుగు జనాభా ఉన్న ప్రాంతాల నన్నిటినీ మద్రాసుతో సహా బ్రహ్మాండమైన రాష్ట్రంగా నిర్మాణం చెయ్యటం ఈ కంపెనీ యొక్క ప్రధాన ఆశయమని మెమొరాండం ఆఫ్ అసోసియేషన్‌లో నిక్కచ్చిగా ఉదహరించాలి. సదరు రాష్ట్రాన్ని చట్టబద్ధమైన వివిధ మార్గాలద్వారా సాధించటమే ముఖ్య కర్తవ్యం అని తేటతెల్లం చేయాలి. మొదటి సంవత్సరంలోమాత్రం డైరెక్టర్లకు ఎన్నిక ఉండకూడదు. శాంతిరామమూర్తిగారు బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు అధ్యక్షుడుగా ఉంటే బాగుంటుంది. అనంతశయనం అయ్యంగారు, ఆచార్య రంగా, మహర్షి సాంబమూర్తిగారు ప్రకాశం పంతులు, కాశీశ్వరరావుగారు, రామకృష్ణ రాజుగారు మొదలైన అష్టదిగ్గజాలు డైరెక్టర్లుగా ఉండాలి. కావలసిన ప్రచురణకోసం ఒకరిద్దరు తెలుగు పత్రికాధిపతులను కో ఆప్ట్ చేసుకోవచ్చు. శిసలైన వ్యాపారసరళిలో కార్యక్రమం నడిపించాలి. అవసరం అని తోస్తే గుంటూరు నరసింహారావు అండ్ మద్దిసుదర్శనంగారిలాంటి వర్తకప్రముఖులను సంప్రదిస్తూ ఉండవచ్చు.

అయితే ఒక్కవిషయం మాత్రం కట్టుదిట్టం చేసుకోవాలి. తెలుగుదేశంలో ఏ లిమిటెడ్ కంపెనీ పెట్టినా మర్నాటినుంచీ లిక్విడేషను సన్నాహాలు తప్పనిసరిగా చేస్తూ ఉంటారు. అందువల్ల రాష్ట్రం సిద్ధించేవరకూ కంపెనీ రద్దు కాకుండా తగిన బందోబస్తులను ముందుగానే ఏర్పరచుకోవాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. ఆపైన సదరు రాష్ట్రం సిద్ధించేవరకూ డివిడెండ్లమాట ఎత్తనివ్వకూడదు. కాబోయే మంత్రు లెవరా అని, పర్మిట్లు ఎవరికి ఇవ్వటమా అని అంతవరకూ ఆలోచించకూడదు.

"ఆంధ్రరాష్ట్ర నిర్మాణపు కంపెనీ లిమిటెడ్" అవతరించగానే దీనికి పోటీ కంపెనీ మరొకటి బయలుదేర తీయటానికి ప్రయత్నాలు జరిగి తీరుతాయి. మద్రాసుమీద హక్కు వదులుకోదలచినవాళ్లు ఇందులో షేర్‌హోల్డర్లుగా చేరుతారు. కార్యస్థానం బెజవాడలోనో గుంటూరులోనో ఏర్పరచవచ్చు. డాక్టరు పట్టాభిగారిని కంపెనీఅధ్యక్షుడుగా ఉండమని కోరటం, కళా వెంకట్రావుగారిని, గోపాలరెడ్డిగారిని, పున్నయ్యశాస్త్రిగారిని మొదలైనవారిని ప్రథమ డైరెక్టర్లుగా ఉండమని బ్రతిమాలటం జరిగి తీరుతుంది. ఈ కంపెనీ అంటూ స్థాపితమైతే శ్రీమాన్ రాజగోపాలచార్యులవారు ప్రారంభమహోత్సవంనాడు శుభాశీస్సులను పంపుతారని ఆశించవచ్చు. ఒకవేళ మద్రాసు ప్రభుత్వంవారు కొన్ని షేర్లను కొనినా కొనవచ్చు.

కొద్దిగొప్పా తేడాలు ఉన్నప్పటికీ ఒకటికి రెండుకంపెనీలు బయలుదేరితే ప్రయోజనం ఉండకపోదు. ఏ పిల్లిఅయితే మనకేం ఎలుకను పట్టితే చాలు. అదీగాక పోటీ సంస్థ అంటూ లేకపోతే మనదేశంలోని రాష్ట్రీయప్రభుత్వాలలో మాదిరి ముఠాపోట్లాటలు ప్రాప్తించవచ్చు. అందుకల్ల ఒక విధంగా రెండు కంపెనీలూ అవసరమే అని చెప్పవచ్చు.

కాన్ఫరెన్సులవల్ల సాధించలేని దానిని కంపెనీలవల్ల సాధించవచ్చునని చర్చిల్ అంతటివాడు మనకు మార్గం చూపుతున్నప్పుడు మనం అనుకరించకపోతే ముందు యుగంబుల జనులు తలలూపరుసరిగదా వంచిన తల ఎత్తరు. మన నాయకులు ఈ విషయంలో ఎంతవరకు శ్రద్ధ తీసుకుంటారో గమనించదగిన విషయం.

రిక్షావాలా

(11-వ పేజీ తరువాయి)

శరీరాన్ని చుట్టివేసింది. భార్య దుఃఖాన్ని చూచి, ఎంకడికికూడా దుఃఖం పొంగి పొరలి, గట్లు దాటి ప్రవహించడం మొదలుపెట్టిది. కాని కర్కశజీవితం ఏ దుఃఖాన్నీ చూచి జాలి పడదు. నియమబద్ధజీవితం దాక్షిణ్యం వహించదు. కష్టాలకోసమే బీదరిక ఈ దారుణ ప్రపంచంలో పుట్టింది. అది ఆ కష్టాలను అనుభవించక తప్పదు.

*   *   *

మరునాటి ఉదయం ఎంకడు తెల్లవారుఝామునే హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఎంకి ఎంకడు వెళ్లినదారికి కళ్లు అప్పగించి, తన దుర్దశకు జలజల కన్నీళ్లు కార్చడం మొదలు పెట్టింది. ఎంకడు మరునాడు హైదరాబాద్ చేరుకొని తన ఊరివాళ్లకోసం, ఆ రోజుఅంతా నగరం గాలించాడు. కాని వాళ్ల ఆచూకీ ఎక్కడా దొరకలేదు- చేతిలో డబ్బు లేదు. కడుపు దహించుకపోతున్నది- బిచ్చమెత్తడం అతనికి ఏమాత్రం మనస్కరించలేదు. దారిన వెడుతూన్న ఒక రిక్షావాణ్ణి పిలచి, వాడు ఊరివాడుగా ఉండడం గమనించి, అతనిపై ప్రశ్నల పరంపరను కురిపించాడు.

"మనది ఏ వూరు?"

"బాటసింగారం"

"ఎన్ని రోజులనించి ఈ పని చేస్తున్నావు?"

"ఆరునెల్లనించి"

"రోజుకు ఎంత గిట్టుతుంది"

"చెప్పడం కష్టం. దొరకిననాడు బాగానే దొరుకుతుంది. దొరకనినాడు ఏమీ లేదు"

"ఈ బండి నీదేనా"?

"కాదు, దీన్ని బండి అనరు, రిక్షా అంటారు"

"నీది కాకపోతే నీదగ్గర ఎందుకున్నది?"

"కిరాయకు తీసుకొచ్చినా"

"కిరాయ ఎంత?"

"రోజుకు రెండు"

"అమ్మో! రోజుకు రెండు రూపాయాలే?"

"మనది ఏ ఊరూ?"

"రామచంద్రపురం"

"పట్నం ఎప్పుడు వచ్చినావు?"

"నిన్ననే"

"బతుకు తెరువుకోసమే నా?"

"అవును."

"ఎక్కడైనా చూసుకున్నావా?"

"లేదు"

"ఏమి చేయ్య మనుకుంటున్నావు?"

"ఈ బండి తొక్కడం నాకు నేర్పుతావా?"

"బండి కాదు—రిక్షా—నేర్చుకుంటే తప్పకుండా నేర్పుతా?"

"కింద పడుతానా?"

"లేదు- తొక్కి చూడు ఏమీ పడవు?"

ఎంకడికి ఆకలివల్ల బండి ఎక్కడంతోనే కళ్లు గిర్రున తిరిగాయి. తూలిపోతూ ఉండడం గమనించి, రాముడు. నువ్వు ఈరోజు ఏమీ తినలేదా అని అడిగాడు. ఎంకడు 'డబ్బులేదు' అని జవాబు చెప్పాడు. రాముడు జాలి చెంది ఎంకడిని హోటలుకు తీసుకొని వెళ్లాడు. కడుపు నిండా బజ్జీలు, పకోడీలు పెట్టించి, బలవంతంగా ఎంకడితో, టీ తాగించాడు. ఎంకడు మరునాటినుంచీ రిక్షా వృత్తి అవలంబించాడు. డబ్బు ఎక్కువ గడించాలన్న ఆశతో రాత్రింబగళ్లూ రిక్షా నడపడం మొదలుపెట్టాడు. రాత్రికి ఏ 2, 3, గంటలకో అదే రిక్షాలో పడుకునేవాడు. మళ్లీ తెల్లవారుఝామునే కిరాయకు బయల్దేరేవాడు, రోజూ, అన్నం ఉండేది కాదు. కనపడిన హోటల్‌లోకి దూరి బజ్జీలు, పకోడీలు, పూరీలతో కాలం గడిపేవాడు. 15 రోజులు అయ్యేసరికల్లా ఎంకడి కండలుతీరిన శరీరం దిగజారిపోయింది. మనిషి సన్నగా గుర్తుపట్టడానికి కూడా వీలు లేకుండా మారిపోయినాడు. అప్పుడప్పుడూ అతనికి ఎంకి జ్ఞాపక మొచ్చేది. ఎంకి జ్ఞాపకం వచ్చిన నాడల్లా, అతను ద్విగుణీకృతోత్సాహంతో పని చేసేవాడు. ఒకనాడు అతనికి గుండెలో ఏదో సన్నని నొప్పి లేచింది. అతను మొదట ఆ నొప్పిని ఏమాత్రం లక్ష్యం చేయలేదు. నొప్పి క్రమంగా వృద్ధి చెంది దగ్గులోకి పరిణమించింది. దగ్గు రోజుకు రోజు ఎక్కువ కావడం మొదలుపెట్టింది. అయినా అతను ఎంకిని త్వరగా పట్నం తెచ్చుకోవాలనే ఉద్దేశంతో రిక్షా నడపడం మానలేదు. దగ్గు వాంతులకు దారితీసింది- నెమ్మదిగా జ్వరం రావడం మొదలుపెట్టింది- ఎక్కడా నిలువనీడ లేక రాత్రిళ్లు ఎంకడు ఆ రిక్షాలోనే పడి మూల్గేవాడు ఉదయం మళ్లీ ఏదో కొద్దిగా తేరుకొని, టీ, కాఫీలతో ఉపశాంతి పొంది మళ్లీ రిక్షా నడిపేవాడు. ఈవిధంగా కొన్ని రోజులు గడిచాయి. వాంతులు క్రమంగా హెచ్చాయి- నోటినుండా దగ్గితే రక్తం పడడం మొదలుపెట్టింది. ఒకనాడు రాముడు ఈ స్థితి చూచి ఎంకడిని తన యింటికి తీసుకొనివెళ్లాడు. ఆనాడు ఎంకడికి అన్నం సహించలేదు. రక్తం పడడం మరీ ఎక్కువైంది. రాత్రంతా ఎంకీ ఎంకీ అని కలవరించాడు. కాని ఆరాత్రి ఎంకడికి, ఎంకి కలలోనైనా కనపడలేదు ఉదయం అయ్యేసరికి పక్కన రూపాయాల మూటతో ఎంకడు కాలధర్మం చెందాడు. నవీననాగరికత, పట్నవాసంబ్రతుకు ఇంకొక అమాయకుడిని పొట్టపెట్టుకున్నది. పాపం, ఎంకికి ఈ సంగతేమీ తెలియదు. ఎంకడి రాకకోసమై రోజూ దారులు కాస్తున్నది.

కర్కశ ప్రపంచం, ఏమీ తెలియనట్లు నంగనాచివలె మామూలుగా తిరిగి వ్యవహరించడం మొదలు పెట్టింది.

---

(౨) మ గ రి స రి స ని ధ మ ధ స స మ గ మ | గ మా గ మ ధ గ మ ధ ని సా , ని ధ మ మ గ రి గ
మ న సు నీ య ధీ న ము మా టలు నీ వా డె డి వే
మ గ మ గ మ ధా మ గ మ ధ మ గ రీ స ని | స రి ని స మ గ మా , , , ,
త ను వు నీ పు ట్టిం చి న ధ న మి ది
మ ప నీ నీ నీ ధ ని ధ మ గ మ ధా ధ | , గ మ ని ధ ని సా ని స రి స
ము ను నీ పం పున ని న్ని మో చు కొ న్న వా డ నిం తే
ని ధ గ రి రీ స ని ధ ధ మ ధ | సా ని ధ మా ని ధ మ గ రి ని
వె ను క న న్ను నే రా లు వే య క ర క్షిం చ వే (నమో)

ఇట్లే క్రింది చరణములు :

(౧) భోగములెల్లా నీ వి – బుద్ధులు నీ విచ్చినవి ;
యీగతి నా బతుకు నీ – కిర వైనది ;
చేగ దేర నీవు నన్ను – జేసిన మానిసినింతే,
సోగల నా యజ్ఞానము – చూడక రక్షించవే (నమో)

(3) బలి నీవే లో నివే; – వేడుకలెల్లా నీవే ;
కలకాలమును నీ – కరుణే నాకు ;
ఇల శ్రీ వేంకటేశ నీ – వేలుకొన్న బంటనింతే ;
నెలవు దప్పించక – నీవే రక్షించవే. (నమో)

టీక : ఇర వైనది=వసించు చోటైనది ; చేగదేర=సారము తేలునట్లు ; సోగల=పొడువుగా - ఎక్కువగా; నెలవు =స్థానము-ముక్తి.

ప్రాచీనగ్రామసభల న్యాయపరిపాలనము

(6-వ పేజీ తరువాయి)

గట్టింపవలెననియు, దానిం బ్రత్యహము బాగు జేయించుచు గ్రామాధిపతులచే గాపాడజేయు చుండవలెననియు, పాంథశాలాధికారి యచ్చటి కేతెంచు పాంథులను 'ఎచ్చటినుండి యెచ్చటికి బోవుచున్నారు? నిజము సెప్పుడు. సాయ మున్నదా? లేదా? ఆయుధ మేదేని గలదా? వాహనమో? ఏజాతి? కులమేది? పేరు? చిర కాలమునుండి యెక్కడ నునికి?" అని యడిగి చెప్పిన విషయములను వ్రాసికొని సాయంకాల మగునపుడు ఆపాంథులయొద్దనుండు నాయుధ ములను గైకొని మీరు సావధానమనస్కుల రయి నిదురింపవచ్చునని చెప్పి పాంథశాలయం దుండు వారి నందఱ లెక్కించుకొని శాలాద్వార మును మూసివేయవలెననియు, శాలయందలి పాంథుల నెల్లఱ దలవరులు గాపాడుచు దెల్ల వాఱగనే లేపవలెననియు, బిమ్మట నెవరి యాయుధముల వారి కప్పగించి మరల లెక్క పెట్టికొని ద్వారమును దెఱచి విడుదల సేయవలె ననియు, గ్రామ్యజనులు వారిని బొలిమేర వఱకు సాయపడి సాగనంపవలెననియు, విదితము కా గలదు.

"న కిలానుయయు స్తస్య
రాజానో రక్షితు ర్యశః
వ్యావృత్తా య త్పరస్వేభ్యః
శ్రుతౌ తస్కరతా స్థితా."

అని రఘువంశమున (1 వ సర్గ, 22 వ శ్లో.) రఘుమహారాజును గుఱించి కలదు. యశోరక్షణ మొనర్చు నీ రఘు మహారాజునకు సములు కానరారు. ఏలన; అతని రాజ్యమున దొంగతన మను మాట ప్రజల ద్రవ్యమునుండి తొలగి శబ్ద మాత్రావశిష్టమై యున్నది. దీనింబట్టి యప్పటి రక్షకభటుల వ్యవస్థ యద్వితీయ మనియు, ననుప మాన మనియు దెలియందగు.

శాసనములవలన గ్రీస్తుశకము 5,6 శతాబ్దము లకు ముందు గ్రామరక్షణమున కొక యధికారి యుండినట్లును, నాతడు ముఖ్యోద్యోగుల యం దొకరుడుగ నుండినట్లును - స్పష్టమగుచున్నది. ద్రాంగికుడు, చోరోద్ధరణికుడు, ప్రతిసరకుడు, దండపాశికుడు ననుపదములు 'యామిక' ధర్మ ముల నిర్వహించువారికి జెందునని (ఇ పి. గ్రా. ఇండికా, సం. 3-13) నందు గలదు. దండ పాశికు డనువాడే మన తెలుగుదేశమున దలవరి యయ్యెననియు, బారాబలావతీలలో నిత డెప్పుడు సేరెనో గ్రామవ్యవస్థయందీ బారా బలావతీ పద్ధతి యెప్పటినుండి కలదో - ఈ మొదలగు సంశయముల దెలిసికొనదగు సాధా రాధే యములు గానరావు. కాని కాకతీయ చక్రవర్తుల పరిపాలనమున నీ తలవరి ప్రధాన గ్రామసేవకు డుగ (నౌకరి)నుండినట్లు లగపడుచున్నది. ఇంతియకాక యతడు గ్రామములో స్పర్ధలు, పోటీలు, వివాదలు లేకుండ శాంతిభద్రతల జేకూర్చవలసినట్లును, గలతపడు నిఱుపక్షముల వారిని బిలువంబనిచి 'ధర్మశాసనము' వినుపించి వివాదను బరిష్కరించుట యాతని విధి యైన ట్లును, —శ్రీనాథకవిసార్వభౌమవిరచితం బగు 'క్రీడాభిరామ' మను గ్రంథమున రూఢిపఱుప బడినది.

వీరభద్రులు

కాకతీయచక్రవర్తుల కాలమున గ్రామ రక్షణమునకీ తలవరులే గాక 'వీరభద్రు'లను మఱియొక గ్రామరక్షకులుండెడివారని *Government Epigraphica Report*, (No. 197,94.) లో వ్రాయబడియున్నది.

"బీజచ్ఛేద శిరచ్ఛేద
కుక్షి భేదాది కర్మభిః,
వీరభద్ర సమాఖ్యాతా
(దశ) గ్రామస్య రక్షకాః."

అని యొక శాసనమున నీ గ్రామరక్షకు (కావ లివాండ్రు) లభివర్ణింపబడిరి. గ్రామమున కేదైన నొక యాపత్తు దటస్థించినపుడు తన్నివారణ కయి గ్రామసంఘము యొక్క శుభంబు గోరి శిరచ్ఛేదాది కర్మములచే దమకు దామే బలి యగుటవలన వారి కోర్కి ఫలించుటయు, నయ్యాపద వోవుటయు జరగుచుండెనని విదిత మగుచున్నది.

ఈ వీరభద్రులను గ్రామ రక్షకులు చోళ మండలమునుండి వచ్చినవారు. కర్ణాటదేశమున గూడ నివ్విధానముండినట్లు కన్నడ శాసనములు (*Kanarese Inscriptions*) వాకొనుచున్నవి. "ప్రత్యేక మొక యభిలాష మీడేరుటకుగాని, యజమానికి మేలు సేకూఱుటకై గాని, గ్రామ సంరక్షణమునకై గాని, యాపన్నివారణమునకై - గాని ఇట్టి పద్ధతి నవలోకించుచున్నట్టు లగపడు చున్న"దని రైసు దొర వ్రాసిన "*Mysore and Coorg*" అను గ్రంథమున వ్రాయబడి యున్నది. (*p.* 186-188.) ఈ గ్రామరక్షకులం శిరచ్ఛేద కుక్షి భేదాది కర్మముల గావించుకొను టకు జగనొబ్బగండ డను ననవేము భూపాలుడు శ్రీశైలపర్వతమున నొక 'వీరశిరోమండపము'ను గట్టించిరని *Government Epigraphica Report* (1915, No. 20) వలన గాన్పించుచున్నది. ఇట్టి గ్రామరక్షకుల (వీరభద్రుల) శిలా రూపక స్మారక చిహ్నమును గన్నడభాషలో 'వీరకల్లు' (వీరశిల) అందురు. ఇట్టి గుఱుతు లెన్నియో కన్నడదేశమున నగపడుచున్నవి. మన తెలుగుదేశములో నీ గుఱుతులు త్రిపురాంత కము, మోపూరు గ్రామములందు గనుపించు చున్నవి. త్రిపురాంతకమునం గల గుఱుతుల (చిహ్నముల) విలోకించినచో గత్తిని జేబూని కొందఱు కుత్తుకల దెగనఱకు కొనుచుండినట్లును, మఱికొందఱు కుక్షిని ఛేదించుకొనుచుండినట్లును, నింక గొందఱు ఒక చేతితో గత్తిని దీసికొని యెడమతొడను బొడిచికొనుచు గుండియలందు బొడుచుకొనుటకయి రెండవచేతితో గత్తినెత్తు చుండినట్లును-ఇవ్విధముగ నవ్వేఱు చిహ్నములు గలవని *Government Epigraphica Report* (1909, *para* 73.) వలన విదితమగు చున్నది.

ఈ రీతి బలిదాన మొనర్చిన వీరశిఖామణుల సాహసోపేత కృత్యముల బాటించి యప్పటి వారు వారికి బుణ్యలోకావాప్తి కలుగునట్లు వారిపేర దేవునకు శాశ్వతముగ 'నందా' దీప మును బెట్టువారని *Government Epigraphica Report* (1912. No. 411) వలన విస్పష్టమగుచున్నది.

కర్ణాటక చక్రవర్తుల నాటికి గ్రామసంరక్షణ విధానమున బరిణామ మొదవెను. 'వీరభద్రు'లను గ్రామరక్షకులు కర్ణాటక చక్రవర్తుల కాలమున లేరు. వారు శైవమతస్థులు. కాకతీయులనాటి శైవమత విజృంభణము కొంతకుగొంత సడలి వైష్ణవమత విజృంభణమునకు దావొసంగినతర్వాత 'గావలివాం' డ్రేర్పడిరి ఈ కావలివాండ్రు తల వరులకు బైవారు. వీరు స్థల, దేశ, రాజ్యవిభా గములందు గావలి గాయుచుండిరి. -ఇందువలన దేశరక్షణ విధాన మిట్లున్నదని తెలియుచున్నది గదా! ఊరికావలి, స్థలకావలి, దేశకావలి యనునవి ప్రజలకును బ్రభువునకును అవినాభావ సంబంధమును దెలుపుచున్నవి. రాజునకు నాయ కుడును, నాయకునకు దేశకావలివాండ్రును, దేశ కావలివాండ్రకు స్థలము కావలివాండ్రును, స్థలము కావలివాండ్రకు దలవరులును,-వినయ వినమితులయి పనిచేయుచుండిరి. పట్టణములలోని తలవరుల క్రింద బెక్కురు చిన్నతలవరు లుండెడి వారు. ఇవ్విధముగ గర్ణాటక చక్రవర్తుల కాల మునకు గ్రామరక్షణ విధానము సంపూర్ణ వికాస మంది యుచ్చస్థితియం దుండెను.

భారతదేశపు వ్రాతసిరా పరిశ్రమ

(23-వ పేజీ తరువాయి)

కట్టిన నీలిరంగునీళ్ళకు 24 సి. సి. లు గ్లిసరీను వంటి అరుదు నిరోధకాన్ని చేర్చాలి. తరువాత 20 సి. సి. లు కార్బాలిక్ లోషన్ వంటి క్రిమి సంహారాకాన్ని కూడ ఇందులో చేర్చాలి. మన దేశంలో ఉష్ణవాతావరణ స్థితులే జాస్తిగా ఉం టాయి గనుక చలిదేశములు వారి సిరాల్లో వాడే టంతగా సారాయి వంటి అరుదు సహాయకాన్ని మన సిరాలో చేర్చవలసిన పని ఉండదు.

నీలకృష్ణసిరా తయారీ ముగింపు

తల్లి సిరాఉన్న జాడీలోనికి ఈ రంగునీళ్ళను నెమ్మదిగా తేర్చి అంకుశనాళిద్వారా బదలీచేస్తూ ఆ ద్రవాన్నంతా చక్కగా కొయ్యకవ్వంతో పై నుంచి క్రిందివరకు కలిపెట్టాలి. తరువాత అది నిల బడగనే దానిపైన ఇంకొక 16 సి. సి. లు కార్బా లిక్ లోషన్‌ను ఒక పొరగాపరచుకొనేటట్లు పోయాలి. ఈ క్రిమిసంహారపులోషన్ యొక్క పై కప్పువలన సిరామీదకు చేరే బూజుక్రిములు చేరినవి చేరినట్లుగనే చచ్చిపోతూవుంటై. అం దుచేత సిరాలకు మాగేకాలములో బూజుపట్ట టానికి అవకాశం కలగదు. ఈ విధంగా తయా రైన సిరాలను జాడీలో ఒకటి రెండు మాసాల వరకు నిలవయుంచి చక్కగా మాగనియ్యాలి. సిరాజాడీకి గాలిచొరని మూత బిగించి దాని మూతికి కాగితముతో గాని, గుడ్డతో గాని వాసిన కట్టాలి. సిరాద్రవము మాగేకాలములో దనలో స్వేచ్ఛగా తేరుతూ ఉండే శాకసంబంధ మైన సేంద్రియ కల్మషములు చాలావరకు అడు గుభాగానికి చేరుతూ ఉంటాయి. పైకి నిర్మల మైన సిరా తేట తేరుకొంటుంది. ఈ సిరాతేట ను తేర్చి అంకుశనాళిద్వారా దూది ముక్క ఉన్న గాజుగరాటీనుండి వడగట్టి సిరాబుడ్ల లోనికి, సీసాలలోనికి పట్టి వాడుకకోసము నిలవఉంచు కోవచ్చు. సిరాసీసాలను వెలుతురు సోకని ప్రదే శాలలో గాలి చొరని బిరడాలతో మూసి నిలవ వుంచుకోవాలి. ఈమాదిరిగా తయారైన సిరా ద్రవాలు ఫౌంటెన్ కలాలలో అతి తేలికగా ప్రవహిస్తాయి. ఇవి బాళీలమీదగాని సిరా ప్రవ హించే కాలువలలోగాని పేరి గడ్డకట్టవు.

12 లీటర్లు సిరా తయారుచేసి అమ్మకుంటే పనివానికి రు. 18/= లకు తక్కువ కాకుం గిట్టుతుంది. ఈ మాదిరిగా సిరా తయారీ దారుడు నెలకు రెండు దఫాలు సిరా తయారుచేసి అమ్మ గలిగితే అతనికి నికరంగా నెలకు రు. 36 మిగులుతయి. రు. 250 లు పెట్టుబడి ప్రతివ్యక్తి ఈమాదిరిగా సిరాలను తయారు అమ్మి జీవించవచ్చన్న మాట. అతి తేలికగా పటానికి వీలైన ఈ వ్రాతసిరాపరిశ్రమను గృహ పరిశ్రమగా దేశంలో వ్యాపకం చేస్తే గ్రామ స్థులకు గూడ పని కల్పిస్తుంది. ప్రతిఫిర్కాకు ఒకొక్క సిరా తయారీ గృహ పరిశ్రమను స్థాపిస్తే ఒక కుటుంబం తేలికగా బ్రతుక తుంది.

సిరా తయారీ ఇంత తేలికైనప్పటికీ నేటి విజ్ఞానవంతులు ఇంకా పరాయిదేశపు సిరాల కొరకు ప్రాకులాడటము చూస్తే చాల విచార మేస్తుంది. ఔన్సు రు. 0-0-3 కూడ సరిగా చేయని సిరాకు రు. 0-3-0 లు అప్పుడప్పుడు అంతకన్న హెచ్చుగాకూడ విదేశీ సిరాలకు చెల్లిస్తున్నారంటే మనవాళ్ళకి ఇంకా విదేశ వస్తు వులమీద భ్రమ తగ్గలేదని తోస్తుంది. వికేంద్రీ కరణవిధానంలో వ్రాతసిరాతయారీని దేశంలో వ్యాపింపజేసి, దేశమంతట ఈ సిరాగృహపరి శ్రమలతో చక్కగా అల్లి ఈ పారిశ్రామికులను శోధన్ - గృహపరిశ్రమల సంఘమువంటి ఒక కేంద్ర సంఘముతో కలిపి ఉంచినట్లైతే మంచి నాణ్యము కల సిరాలు ఇంకా తక్కువధరకు లభించే అవకాశంకూడ ఉంది. అచ్చు సిరా తయారీని గూడ గృహపరిశ్రమగా మార్చుటకు చాలా కాలమునుంచి పరిశోధనలు జరుగుతున్నై. అవకాశము లభించినపుడు ఈ యచ్చుసిరాపరి శ్రమను గురించికూడ తెలుసుకొందాం.

ఫౌంటెన్ పెన్ సిరా — 12 లీటర్ల సిరాకు పాళ్లు — ఖరీదులు

ముడిసరకు పేరు	తూకము	లీటరుకొలతలో వాననీళ్ళు	1 పా. ఖరీదు	మొత్తం ఖరీదు
డి. డి. కాయలపొట్టు	$1\frac{1}{4}$ పా	6	రు. 0-4-0	రు. 0- 5-0
మాచికాయముక్కలు	2 ఔ	1	1-8-0	0- 3-0
అన్నభేది	4 ఔ	2	1-8-0	0- 6-0
లఘుఉదజహరికామ్లము	16 సి. సి. లు	8 సి. సి. లు	3-0-0	0- 4-0
ఇంక్ బ్లూ ఏ. యస్. క్రిస్టల్సు	$2\frac{1}{2}$ ఔ	3 లీటర్లు	20-0-0	3- 2-0
గ్లిసరీను	24 సి. సి. లు		1-8-0	0- 2-0
3 కార్బాలిక్ ఆసిడ్ లోషన్	30 సి. సి. లు		3-0-0	0- 5-0
వాననీళ్లు పట్టడానికి ఖర్చు				0- 8-0
సాదరు ఖర్చులు.				0-13-0
12 లీటర్లు లేక 384 ఔన్సుల సిరా ఖరీదు			రు.	6-0-0

ఒక ఔన్సు తయారీకైన ఖరీదు రు. 0—0—3
ఒక ఔన్సు సిరాఅమ్మకము ఖరీదు రు. 0—1—0
సూచన :—విదేశపు వ్రాతసిరాలను ఒకొక్క ఔన్సు రు. 0-3-0 అంతకన్న హెచ్చు ధరకు కూడ అమ్ముతూ ఉంటారు.

సిరాతయారీకి అవసరమైన పనిముట్లు


ముడిసరకులు పరికరాలు లేక పనిముట్లు

(1) అనంబర్లు 12 లీటరుపట్టే పింగాణీజాడీలు ...	రు.	25-0-0
(2) వాననీళ్లు నిలవఉంచే తొట్లు, నీళ్లుపట్టే గుడ్డ తెరలు మొదలైనవి		25-0-0
(3) గాజుకఱ్ఱలు, గొట్టాలు, రబ్బరుగొట్టాలు, అంకుశనాళి, గాజుగరాటి, పించికాకులు మొదలైన చిల్లర సామానులు...		25-0-0
(4) గాజు సిరాబుడ్లు, కార్కులు		25-0-0
		100-0-0


ముడిసరకులు

డి. డి కాయలమీద	రు.	20-0-0
మాచికాయలమీద		5-0-0
అన్నభేదిమీద		25-0-0
		150-0-0
ఉదజహరికామ్లముమీద		10-0-0
సిరారంగులమీద		50-0-0
గ్లిసరీనుమీద		10-0-0
కార్బాలిక్ ఆసిడ్ మీద		10-0-0
ఇతర చిల్లరసరకులు		20-0-0
సిరాగృహపరిశ్రమదారునికి కావలసిన పెట్టుబడి	రు.	250-0-0

ఢిల్లీ ఆంధ్రసంఘం - స్వాతంత్ర్య దినోత్సవం




ఢిల్లీ ఆంధ్రసంఘం మేనేజింగ్ కమిటీ సభ్యులు
కుడికి (1) టి. వి. యల్. నరసింహారావు, (2) ఎ. ఆర్. కె. మూర్తి,
...రావు, (4) సి. యస్. మూర్తి, (5) యస్. నీలకంఠన్, (6) పి.
రాజేశ్వరరావు (7) జె. వి. యస్. ఆంజనేయులు.



ఆంధ్రరాష్ట్రీరాయబారి సంఘానికి
స్వాగత మిచ్చినప్పటి దృశ్యం.



కళా వెంకట్రావుగారు స్వాతంత్ర్యపతాకను ఎగురవైచుచున్నారు.



ఉత్సవాలలో పాల్గొన్న ఆంధ్రులు.



శ్రీమతి దుర్గాబాయమ్మగారు పతాకోత్సవసమయంలో ప్రార్థనాగీతం
పాడుచున్నారు.



ఉత్సవానికి వచ్చిన మహిళాలోకం.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras !